అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 12-12-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 341 | Published from Rangareddy, Hyderabad, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



పార్లమెంట్ స్వతంత్రతపై నీలినీడలు

ప్రతిపక్ష సభ్యులే లక్ష్యంగా సస్పెన్షన్లు

బీజేపీ ఎంపీలకు సుతిమెత్తని హెచ్చరికలతో సరి

న్యూఢిల్లీ : పార్లమెంట్ స్వతంత్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. చట్టసభ నిబంధనలు అధికార పక్షానికి ఒకలా, ప్రతిపక్షాలకు మరోలా వర్తిస్తున్నాయి. అధికార పక్ష సభ్యులు నిబంధనలను తుంగలో తొక్కినా చూసీచూడనట్లు వ్యవహరించడం పరిపాటిగా మారింది. చట్టసభలో నిస్పాక్షికంగా వ్యవహరించి, అందరినీ సమదృష్టితో చూడాల్సిన సభాపతులు అధికార పక్షానికే కొమ్ము కాస్తున్నారు.

సెప్టెంబర్ 21న బీజేపీకి చెందిన లోక్‌సభ సభ్యుడు రమేష్ బిధురీ తన సహచరుడైన బీఎస్పీ ఎంపీ దనిష్ అలీపై మతపరమైన దూషణలు చేసి అవమానించారు. సభాపతి ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుండి తొలగించి చేతులు దులుపుకున్నారు. బిధురీని సస్పెండ్ చేయాలని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో డిమాండ్ చేసినప్పటికీ కేవలం సుతిమెత్తగా హెచ్చరించి వదిలేశారు.అదే విపక్షాలకు చెందిన మహువా మొయిత్రీని మాత్రం నిరూపణకాని ఆరోపణలపై ఆధారపడి ఏకంగా పార్లమెంట్ నుంచే బహిష్కరించారు. ఇలా బీజేపీయేతర సభ్యులు చిన్న చిన్న తప్పిదాలకు పాల్పడినా వారిని సభ నుంచి సస్పెండ్ చేసిన ఉదంతాలు ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్నాయి. ఉదాహరణకు కాంగ్రెస్ సభ్యుడు అధిర్ రంజన్ చౌదరి సభలో మహాభారతాన్ని ప్రస్తావిస్తూ 'మహిళలకు వ్యతిరేకంగా జరుగు తున్న అకృత్యాల విషయంలో రాజు గుడ్డివాడిగా ఉండకూడదు. అది హస్తినాపూర్‌లో కావచ్చు, మణిపూర్‌లో కావచ్చు' అని వ్యాఖ్యానించారు. చౌదరి ఉద్దేశపూర్వకంగా, తరచూ దుష్ప్రవర్తనకు పాల్పడుతున్నారంటూ ఆయనను సభ ఆగస్ట్ 10న సస్పెండ్ చేసింది. అదే నెల 30న ప్రివిలేజ్ కమిటీ ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేయడం వేరే విషయం. అంతకుముందు జూలై 24న రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ సభ్యుడు సంజయ్ సింగ్‌ను చైర్మన్ జగదీప్ ధన్‌కర్ సస్పెండ్ చేశారు. ఇంతకీ ఆయన చేసిన మహాపరాధం ఏమిటంటే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండగా సభ మధ్యలోకి దూసుకుపోయి సభాపతి స్థానం వైపు వేలెత్తి చూపడం.

టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై బహిష్కరణ వేటు

టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాను లోక్‌సభనుంచి బహిష్కరించారు. ఇటీవల క్యాష్ ఫర్ క్వెరీ ఆరోపణలకు సంబంధించి ...13లో

రద్దు సబబే..

ఆర్టికల్ 370పై సుప్రీంకోర్టు తీర్పు

జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించండి

- సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు జరపండి :కేంద్రానికి ఆదేశం



న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370ని మోడీ ప్రభుత్వం రద్దు చేయడాన్ని సుప్రీంకోర్టు సోమవారం సమర్థించింది. ఈ అధికరణ తాత్కాలికమైనదేనని, దీనిని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంటుందని స్పష్టం చేసింది. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించి, వచ్చే సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీ లోపు ఎన్నికలు నిర్వహించాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది.

ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ దాఖలైన పలు పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సంజయ్ ఖన్నా, బీఆర్ గవాయ్, సూర్యకాంతతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారించిన విషయం తెలిసిందే. తీర్పు సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. జమ్మూకాశ్మీర్‌కు అంతర్గత సార్వభౌమాధికారం లేదని తేల్చి చెప్పింది. రాష్ట్రపతి పాలన అమలులో ఉన్నప్పుడు కేంద్రం తీసుకునే ప్రతి నిర్ణయాన్నీ సవాలు చేయలేరని తెలిపింది. భారతదేశంలో విలీనమైన తర్వాత జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక సార్వభౌమాధికారం లేదని గుర్తు చేసింది. యుద్ధ వాతావరణంలో తాత్కాలిక అవసరాల కోసమే ఆర్టికల్ 370ని తీసుకొచ్చారని వివరించింది. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హక్కులంటూ ఏవీ ఉండవని, ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఏ హక్కులు ఉంటాయో దీనికీ అంతే ఉంటాయని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 1, 370 అధికరణల ప్రకారం భారత్‌లో జమ్మూకాశ్మీర్ అంతర్భాగమేనని చెప్పింది. రాజ్యాంగ నిబంధనలు జమ్మూకాశ్మీర్‌కు కూడా వర్తిస్తాయని, ప్రత్యేకతలేవీ ...5లో

కలవరపరుస్తోంది

సుప్రీం తీర్పుపై సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని రద్దు చేసి, ఆర్టికల్ 370ని రద్దు చేయడం రాజ్యాంగబద్ధమేనని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కలవరపరుస్తోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. ఈ తీర్పు వల్ల మన రాజ్యాంగం ప్రాథమికాంశాల్లో ఒకటైన ఫెడరల్ వ్యవస్థకు తీవ్ర పర్యవసానాలు ఏర్పడతాయని హెచ్చరించింది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. భారత యూనియన్‌లోకి విలీనమవుతున్న ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత ఇక జమ్మూ కాశ్మీర్‌కు ఎలాంటి సార్వభౌమాధికారం వుండబోదని తీర్పు చెబుతోంది. కానీ, ఇప్పుడు రద్దు చేసిన 370వ అధికరణలో వున్నట్టుగా ప్రత్యేక హోదాను కొనసాగించేందుకే షరతులతో కూడిన విలీనంపై సంతకాలు జరిగాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

భారత యూనియన్‌లో ఇతర అన్ని రాష్ట్రాల మాదిరిగానే జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం కూడానని సుప్రీం తన తీర్పులో స్పష్టం చేసింది. తద్వారా, 371వ అధికరణలోని వివిధ క్లాజుల కింద ఈశాన్య ...6లో

మా పోరాటం ఆగదు

- గృహ నిర్బంధంలో నేతలు
- సుప్రీం తీర్పుపై జమ్ముకాశ్మీర్ పార్టీల నిర్వేదం !

న్యూఢిల్లీ : ఆర్టికల్ 370ని రద్దు చేయడం రాజ్యాంగబద్ధమేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై జమ్ము కాశ్మీర్‌కు చెందిన రాజకీయ పార్టీలు ఆచితూచి స్పందించాయి. జరగాల్సిన చర్య జరిగిపోయినందున ఇక న్యాయ వ్యవస్థ ఇచ్చే ఆమోదముద్ర కేవలం లాంఛనప్రాయమేనన్న అభిప్రాయంలో ఆయా పార్టీలు వున్నాయి. శ్రీనగర్‌కి చెందిన ఒక వ్యాపారవేత్త వైర్‌తో మాట్లాడుతూ, ఈ నిర్ణయాన్ని కాశ్మీరీలు చాలామంది ముందుగానే ఊహించారని చెప్పారు. ఇంతకన్నా భిన్నమైన తీర్పు వస్తుందని వారు ఊహించలేదన్నారు. దీన్ని మనం మార్చగలిగేది కూడా ఏమీ లేదనే అభిప్రాయంతో వారున్నారని అన్నారు. కాగా తీర్పు వెల్లడించడానికి ముందుగానే కాశ్మీర్ వ్యాప్తంగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



రాజకీయ పార్టీల నేతలను ఇంటి నుండి బయటకు కదలనివ్వకుండా గృహ నిర్బంధం చేశారు. మీడియా వారితో కూడా మాట్లాడనివ్వలేదని వారు విమర్శించారు.

మన నష్టం కంటే కూడా...

మన నష్టం కంటే కూడా భారతదేశం యొక్క ఆలోచన ఈనాడు ఓటమిని చవిచూసిందని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు (పీడీపీ) మెహబూబా ముఫ్తి విమర్శించారు. 2019 ఆగస్టు 5న భారత ప్రభుత్వం పార్లమెంట్‌లో తీసుకున్న చట్టవిరుద్ధమైన నిర్ణయం, ఈనాడు సుప్రీంకోర్టు దానికి ఆమోద ముద్ర వేయడం చూస్తుంటే భారతదేశపు ఆలోచనకు మరణ శిక్ష విధించినట్లయిందని ఆమె పేర్కొన్నారు. ఆ ద్రోహమనేది వారి నుంచే వచ్చింది, మన నుంచి కాదని అన్నారు. 370వ అధికరణను తాత్కాలిక నిబంధన అని పేర్కొనడం ద్వారా దేశాన్ని బలహీనపరిచారు.



నిరాశ కలిగింది


సోమవారం ఉదయం నుంచి తాను ...6లో

ఇదేం తీరు..

బీజేపీయేతర రాష్ట్రాలకు కేంద్ర నిధుల అడ్డగింతపై ప్రతిపక్షాల నిరసన

- రాజ్యసభ నుంచి ఇండియా ఫోరం ఎంపీల వాకౌట్

వివరాలు 8లో



ఎలా ఉన్నారు..!

త్వరగా కోలుకుని ప్రజాసేవకు రావాలి

- కేసీఆర్‌కు చంద్రబాబు సహా పలువురి పరామర్శ
- భట్టి, చిరంజీవి, ప్రకాశ్‌రాజ్, భీమ్ ఆర్మీ చీఫ్ , ప్రవీణ్‌కుమార్ రాక

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావును తెలుగుదేశం అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు పరామర్శించారు. వీలైనంత తొందరగా కోలుకొని ప్రజాసేవకు రావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను సోమవారం చంద్రబాబు కలిశారు. దాదాపు ఇరవై నిమిషాలు అక్కడ గడిపారు. పక్కనే కూర్చుని కేసీఆర్‌తో మాట్లాడారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వద్ద చంద్రబాబుకు యశోద యాజమాన్యంతోపాటు మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, వి. శ్రీనివాస్‌గౌడ్, ఇతరులు స్వాగతం పలికారు. కేసీఆర్ దగ్గరే ఉన్న కేసీఆర్ కుమారుడు కేటీఆర్, కూతురు కవితతోనూ చంద్రబాబు ముచ్చటించారు. అనంతరం ఆస్పత్రి వెలుపల



మీడియాతో మాట్లాడుతూ 'ఆయనతో మాట్లాడాలనిపించి వచ్చాను. కోలుకోవడానికి ఆరువారాల సమయం పడుతుందని వైద్యులు చెప్పారు. చాలా చక్కగా ఆపరేషన్ జరిగింది. త్వరలోనే కేసీఆర్ మామూలుగా నడుస్తారు' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పరామర్శించి వెళుతున్న క్రమంలో కేటీఆర్, చంద్రబాబును ఆస్పత్రి బయటకు ...6లో

కాళేశ్వరంపై విచారణ

సమగ్ర నివేదికకు ఆదేశం

- మేడిగడ్డను సందర్శిస్తా.. ఏర్పాట్లు చేయండి
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల జాతీయ హోదాకు కృషి
- కృష్ణాజలాల్లో న్యాయమైన వాటాకు చర్యలు : భారీనీటిపారుదలశాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్

వివరాలు 8లో





రైతుబంధు ఇచ్చేయండి

సీఎం రేవంత్ ఆదేశాలు

- రూ.2 లక్షల రుణమాఫీపై కార్యాచరణ ప్రణాళిక
- ప్రజా దర్బార్.. ఇక నుంచి ప్రజావాణి
- వారానికి రెండు రోజులు నిర్వహణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని రైతులందరికీ రైతు బంధు నిధులను అన్నదాతల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను తక్షణమే (సోమవారం సాయంత్రం నుంచే) ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది కలగకుండా పంట పెట్టుబడి సాయాన్ని అందించాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతు భరోసా కింద ఒక్కో రైతుకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించింది. అయితే దానికి విధి విధానాలు, నియమ నిబంధనలు ఖరారు కాకపోవటంతో ప్రస్తుతానికి బీఆర్ఎస్ సర్కారు ...5లో

మధ్యప్రదేశ్ కొత్త సీఎం మోహన్ యాదవ్

- మాజీ సీఎం శివరాజ్ చౌహాన్‌కు బీజేపీ హైకమాండ్ హ్యాండ్..
- స్పీకర్‌గా నరేంద్ర తోమర్



జైపూర్ : మధ్యప్రదేశ్‌లో అధికారాన్ని ఎవరు చేపట్టాలన్న సస్పెన్స్‌కు తెరపడింది. ఒక్కసారి ఛాన్స్ ప్లీజ్ అంటున్న ఆ రాష్ట్ర సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను బీజేపీ అధిష్ఠానం పక్కనబెట్టింది. ఛత్తీస్‌గఢ్‌లో రమణ్ సింగ్‌ను కాదన్నట్టుగానే.. మధ్యప్రదేశ్‌లోనూ శివరాజ్‌కు ...13లో

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ పదవికి జనార్ధన్‌రెడ్డి రాజీనామా



- గవర్నర్‌కు లేఖ అందజేత
- ఆమోదించి సీఎస్‌కు పంపిన తమిళిసై
- అదే దారిలో పాలకమండలి సభ్యులు
- గ్రూప్-2 రాతపరీక్షలు వాయిదా!
- రీషెడ్యూల్ చేయాలని సీఎం రేవంత్ ఆదేశం

వివరాలు 2లో

గ్యాస్ సబ్సిడీకి భారీ కోత

- ప్రజలపై అధిక భారం
- ఐదేండ్లలో రూ.30,244 కోట్ల సబ్సిడీ పాయే
- రూ.37,209 కోట్ల నుంచి రూ.6,965 కోట్లకు తగ్గుదల



వివరాలు 13లో

ప్రభుత్వరంగ స్టీల్ సంస్థల్లో భారీగా ఖాళీలు

- వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లోనూ తగ్గిన పోస్టుల సంఖ్య

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రభుత్వ రంగ స్టీల్ సంస్థ (పీఎస్‌యూ)ల్లో భారీగా ఖాళీలు ఉన్నాయి. అలాగే మంజూరైన ఉద్యోగాల సంఖ్య కూడా తగ్గుతోంది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థల్లో ఏడాదికేడు ...13లో



అద్దె కట్టలేదని ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం

బయటే విధులు నిర్వహిస్తున్న డాక్టర్

- 8 నెలలుగా వేతనాలు లేవని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

ఈఎస్ఐ డిస్పెన్సరీ భవనానికి అద్దె ఇవ్వడం లేదంటూ యజమాని తాళం వేశారు. అయినా అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో నాలుగు రోజులుగా డాక్టర్ బయటే విధులు నిర్వహిస్తున్నారు. చీటీ రాసివ్వడం తప్ప మందులు ఇవ్వలేకపోతున్నారు. దాంతోపాటు తమకు 8 నెలలుగా వేతనాలు రావడం లేదని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి..

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పోతురాజుపల్లిలో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ భవనానికి 19 నెలలుగా యజమానికి అద్దె ఇవ్వడం లేదు. దాంతో యజమాని డిస్పెన్సరీకి తాళం వేశారు. అధికారుల నుంచి స్పందన



లేకపోవడంతో డాక్టర్ భరత్ నాలుగు రోజులుగా సిబ్బందితో కలిసి బయటే కూర్చొని రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. మందుల చీటీని రాసి ఇవ్వడం తప్ప మందులు ఇవ్వలేకపోతున్నారు. దాంతో మందులు బయట కొనుక్కోవడానికి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. యజమానికి ఇచ్చే అద్దె గురించి పై అధికారులకు నివేదికలు పంపామని, అక్కడి నుంచి సమాధానం రాలేదని డాక్టర్ భరత్ తెలిపారు. కాగా పోతురాజుపల్లిలో మినహా ఎక్కడా ఈఎస్ఐ డిస్పెన్సరీలు అందుబాటులో లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డిస్పెన్సరీని తెరిచే విధంగా చర్యలు ...13లో

వైద్యానికి సుస్తీ..

వైద్యవిధాన పరిషత్‌లో నాలుగు వేల ఖాళీలు

- కొత్త సర్కారులోనైనా భర్తీ అయ్యేనా?
- నామ్‌కేవాస్తేగా సేవలు
- ప్రయివేటుకు వెళ్లక తప్పని పరిస్థితి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అక్కడ ఆస్పత్రి ఉంటుంది. అదీ ప్రభుత్వాస్పత్రి ఉంటుంది. నర్సు ఉంటే డాక్టరు ఉండరు. డాక్టర్ ఉంటే నర్సు ఉండరు. వారిద్దరు ఉంటే ఫార్మాసిస్టు ఉండరు. ల్యాబ్ టెక్నీషియన్లు కనిపించరు. బయట మాత్రం బోర్డు బ్రహ్మాండంగా కనిపిస్తుంటది. డిస్పెన్సరీలు మొదలు జిల్లా ఆస్పత్రుల వరకు సిబ్బంది కొరత వెక్కిరిస్తుంటది. ప్రభుత్వం నుంచి వచ్చే అధికారిక సమాచారంలో మాత్రం తాము ఎన్ని



ఆస్పత్రుల ద్వారా ప్రజలకు ప్రజావైద్యాన్ని అందిస్తున్నామనే విషయాలను వివరిస్తుంటారు. క్షేత్రస్థాయిలోనేమో ఆయా ఆస్పత్రులు అందించాల్సిన సేవలు పూర్తి స్థాయిలో అందించలేక నామమాత్రంగా మిగిలాయి. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ పరిధిలో రాష్ట్రంలో 179 ఆస్పత్రులు డిస్పెన్సరీ మొదలు జిల్లా ఆస్పత్రుల వరకున్నాయి. ఇందులో 10,470 బెడ్లున్నాయి. వీటిలో జిల్లా ఆస్పత్రుల్లో 2,490, ఏరియా ఆస్పత్రుల్లో 2,940, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో (50 పడకలవి) 1,100, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (30 పడకలవి) 2,430, మెటర్నిటీ చైల్డ్ హెల్త్ హాస్పిటల్స్ లో 1,250, అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 260 ఉన్నాయి.

వస్తున్న రోగుల సంఖ్యకు తగినట్టుగా ఈ ఆస్పత్రులు పూర్తి స్థాయిలో సేవలందించాలంటే 12,588 మంది సిబ్బంది అవసరం. అయితే కేవలం 5,197 మంది మాత్రమే రెగ్యులర్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. 7,400 పోస్టులు భర్తీ చేయాల్సినవి ఉండగా, ఇందులో ...13లో

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి..జర్నలిస్టు బీమా పథకం తేవాలి



హెచ్‌యూజే కార్యవర్గం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) కార్యవర్గం డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి లో గల త్యాగరాయగాన సభలో హెచ్‌యూజే కార్యవర్గ సమావేశం జరిగింది. ఇటీవల మరణించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రం నర్సింగ్‌రావుకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్షులు అరుణ్‌కుమార్, కార్యదర్శి బి.జగదీశ్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, విజయానంద్, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు బీవీఎన్ పద్మరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగవాణి, జాయింట్ సెక్రటరీ అచ్చిన ప్రశాంత్, ఆఫీస్ బేరర్లు వీరేష్, సర్వేశ్వర్‌రావు, శివశంకర్, రమేష్, మధుకర్, నిస్సార్, లలిత, నర్సింహా, సాగర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బసవపున్నయ్య, అరుణ్‌కుమార్, జగదీశ్ మాట్లాడుతూ...సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతు, నేతన్న బీమాల మాదిరిగానే జర్నలిస్టుల బీమా పథకాన్ని తేవాలని కోరారు. టీవీలు, పత్రికలకిచ్చే యాడ్స్ నిధుల నుంచి జర్నలిస్టుల సంక్షేమం కోసం ఒకటి నుంచి రెండు శాతం జమచేయాలని విన్నవించారు. చాలా ఆస్పత్రుల్లో హెల్త్ కార్డులు పనిచేయడం లేదనీ, దీంతో వైద్యం విషయంలో జర్నలిస్టులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫ్రీ బస్ సౌకర్యం ఎలా ఉంది?

- మహిళా ప్రయాణీకులతో టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ మాటా ముచ్చట
- జూబ్లీ బస్టాండ్‌లో ఆకస్మిక పర్యటన



నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ కాల్‌సెంటర్లకు ఫోన్ చేసి చెప్పాలని వారికి సూచించారు. సోమవారంనాడాయన సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్‌స్టేషన్ (జేబీఎస్) లో ఆకస్మికంగా పర్యటించారు. అక్కడి బస్సులు ఎక్కి మహిళా ప్రయాణీకులతో మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణంపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా బస్సుల్లోని మహిళలతో ముచ్చటించారు. తమ ప్రాంతానికి మరిన్ని బస్సుల్ని ఏర్పాటు చేయాలని పలువురు మహిళలు ఎమ్‌డీని కోరారు. వారి విజ్ఞప్తులను పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చారు. జేబీఎస్–ప్రజ్ఞాపూర్, జేబీఎస్–జనగామకు వెళ్లే పల్లె వెలుగు, బాన్సువాడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోని మహిళా ప్రయాణీకులతో మాట్లాడారు. అక్కడి నుంచి జేబీఎస్–వెంకటొరెడ్డి నగర్ (రూట్ నంబర్ 18 వీ/జే) సిటీ ఆర్డినరీ బస్సులో మెట్టుగూడ వరకు ప్రయాణించారు. ఆ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థినులతో మాట్లాడారు. కండక్టర్‌తో కలిసి వారికి జీరో టికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి–మహిళలకు ఉచిత బస్ ప్రయాణం'కు మంచి స్పందన వస్తుందన్నారు. మహిళల ప్రయాణ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారనీ, మహిళలు, బాలికలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్లు ఈ సౌకర్యం ఉపయోగించుకోవాలని సూచించారు. ఇలాంటి ఓ గొప్ప కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీని భాగస్వామిగా చేసినందుకు ఆయన ప్రభుత్వానికీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సవరించుకుంటూ ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామ న్నారు. 'మహాలక్ష్మి'పై ఇప్పటికే సంస్థలోని 40 వేల మంది సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. మహిళలందరూ స్థానికతను నిర్ధారించుకునేందుకు తమ ఆధార్ కార్డులను సిబ్బందికి చూపించి ఆర్టీసీకి సహకరించాలని కోరారు. ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రవేశపెట్టగానే రద్దీ పెరిగిందనీ, అందుకు అనుగుణంగా బస్సులను నడిపేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. రద్దీ సమయాల్లో ప్రయాణికులు కొంత సమయనం పాటించి.. సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయాణీకులు సంస్థకు ఏవైనా సలహాలు, సూచనలు, ఫిర్యాదులు చేయాలంటే 24 గంటలు అందుబాటులో ఉండే టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నెంబర్లు 040–69440000, 040–23450033 కు ఫోన్ చేసి చెప్పొచ్చన్నారు. వాటిని వెంటనే సరిదిద్దుకునేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎమ్‌డీ వెంట సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (గ్రేటర్ హైదరాబాద్ జోన్) వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, సికింద్రాబాద్ ఆర్ఎంలు శ్రీధర్, ఖుష్రోషా ఖాన్ తదితరులు ఉన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు ఎంతో మేలు

ఆరు గ్యారంటీలను అమలు చేసి చూపిస్తాం : మాజీ ఎంపీ రేణుకా చౌదరి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని మాజీ ఎంపీ కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి అన్నారు. సోమవారం గాంధీ భవన్ నుంచి మహిళలతో కలిసి లక్‌డీకపూల్ వరకు ఆమె బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉచిత బస్సు పథకాన్ని మహిళలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ లాంటి మహానగరంలో చిన్నా చితక ఉద్యోగులు, వ్యాపారులకు ఈ పథకం వరమని అన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన అన్ని హామీలను అమలు చేస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ఇక రెస్ట్ తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్ల కాలంలో చేసిన తప్పులను పునరావృతం కాకుండా మంచి పాలనను అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చి రెండు రోజులు కాకముందే కొంతమంది విమర్శలు మొదలు పెట్టడం సబబు కాదని హితవు పలికారు.



కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు సరికావు : టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పై చేసిన వ్యాఖ్యలు సరికావని టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్ అన్నారు. సోమవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గెలిపించి ప్రజలు బాధ పడుతున్నారని కిషన్ రెడ్డి అనడాన్ని ఆయన తప్పు పట్టారు. ఎన్నికల్లో సొంత పార్టీని సింగిల్ డిజిట్ దాటించలేక తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగారని విమర్శించారు. కాంగ్రెస్, మజ్లీస్‌కు ఎలాంటి స్నేహం లేదని, నిబంధనల మేరకే అక్బరుద్దీన్‌కు ప్రొటెం స్పీకర్‌గా అవకాశం వచ్చిందని తెలిపారు. అసెంబ్లీ సాంప్రదాయం, విలువలను కూడా బీజేపీ రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. అక్బరుద్దీన్ మత తత్వవాది అయితే నరేంద్రమోడీ కూడా మతతత్వ వాదేనని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన రెండు రోజులకే ఆరు గ్యారంటీల్లోని రెండింటి అమలుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇకనైనా బీజేపీ నేతలు చౌకబారు విమర్శలు మానాలని సూచించారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ పదవికి జనార్ధన్‌రెడ్డి రాజీనామా

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మెన్ పదవికి బి జనార్ధన్‌రెడ్డి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌కు సోమవారం అందజేశారు. అనంతరం ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారికి రాజీనామా పత్రాన్ని పంపించారు. రాజీనామాకు ముందు సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డితో జనార్ధన్‌రెడ్డి భేటీ అయ్యారు. టీఎస్‌పీఎస్సీకి సంబంధించిన అంశాలు, నియామకాల ప్రక్రియ, గ్రూప్–2 రాతపరీక్షల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. ఆ తర్వాత జనార్ధన్‌రెడ్డి రాజీనామా చేయడం గమనార్హం.

ఇది అందరిలోనూ చర్చనీయాంశంగా మారింది. వచ్చే ఏడాది జనవరి ఆరు, ఏడు తేదీల్లో గ్రూప్–2 రాత పరీక్షల నిర్వహణకు ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ రంగం సిద్ధం చేసింది. వాటిని రీ షెడ్యూల్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించటంతో ఆ పరీక్షలు వాయిదా పడే అవకాశముంది. టీఎస్‌పీఎస్సీ నిర్వహించే పరీక్షలన్నింటినీ రీషెడ్యూల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

త్వరలోనే గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 రాతపరీక్షలకు సంబంధించి కొత్త తేదీలను ప్రకటించే అవకాశమున్నది. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా జాబ్ క్యాలెండర్‌ను రూపొందించి, అందుకనుగుణంగా నియామకాల ప్రక్రియను చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాలోచన చేస్తున్నట్టు సమాచారం.

2021 మేలో చైర్మెన్‌గా నియామకం

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌గా ఐఏఎస్ అధికారి బి జనార్ధన్‌రెడ్డిని 2021, మే 21న రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయన ఈ పదవిలో మూడేండ్లపాటు కొనసాగుతారని ప్రకటించింది. పదవీ విరమణకు ఇంకా నాలుగు నెలల సమయం ఉండగానే ఆయన రాజీనామా చేయడం గమనార్హం. ఏడుగురు సభ్యులు రమావత్ ధన్‌సింగ్, ప్రొఫెసర్ బి లింగారెడ్డి, కోట్ల అరుణకుమారి, సుమిత్రా ఆనంద్ తనోబా, కారం రవీందర్‌రెడ్డి, డాక్టర్ అరవెల్లి చంద్రశేఖర్‌రావు, ఆర్ సత్యనారాయణ అదేరోజు ప్రమాణస్వీకారం చేశారు. అయితే వారిలో రమావత్ ధన్‌సింగ్, చంద్రశేఖర్‌రావు పదవీ విరమణ చేశారు. మిగిలిన ఐదుగురు సభ్యులు ప్రస్తుతం కొనసాగుతున్నారు. అయితే జనార్ధన్‌రెడ్డి దారిలోనే మిగిలిన పాలకమండలి సభ్యులు కూడా మంగళవారం రాజీనామా చేసే అవకాశమున్నది.

వెంటాడిన టీఎస్‌పీఎస్సీ వైఫల్యాలు

పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు లీక్ కావడం, పరీక్షలు రద్దు కావడం టీఎస్‌పీఎస్సీ ప్రతిష్టను మంటగలిపాయి. టీఎస్‌పీఎస్సీ వైఫల్యాలు వెంటాడాయి. గ్రూప్–1 సహా పలు పరీక్షలను రద్దు చేయడం, వాయిదా వేయడం పట్ల నిరుద్యోగ యువత ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా మొదటిసారి, హైకోర్టు ఆదేశాలతో రెండోసారి గ్రూప్–1 ప్రిలిమ్స్ రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. గ్రూప్–2, గ్రూప్–3 పరీక్షలను కూడా టీఎస్‌పీఎస్సీ, ఎన్నికల కారణంగా డీఎస్సీ రాతపరీక్షలను విద్యాశాఖ వాయిదా వేశాయి. దీంతో జీవితాలు నాశనమయ్యాయన్న అభిప్రాయానికి నిరుద్యోగులు బలంగా వచ్చారు. ఒకవైపు విలువైన సమయం, ఇంకోవైపు డబ్బు వృథా అయ్యాయన్న మానసిక ఆవేదనకు వచ్చారు. అధికారంలోకి వస్తే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామంటూ కేటీఆర్ ఎన్నికల సమయంలో వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు 1.60 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని ప్రకటించారు. ఇంకోవైపు పరీక్షలు వాయిదా పడడంతో మనస్థాపానికి గురైన ప్రవళిక ఆత్మహత్య చేసుకుంది. ప్రేమకారణంతోనే ఆత్మహత్యకు పాల్పడిందనీ, గ్రూప్స్ పరీక్షలకు దరఖాస్తు చేయలేదంటూ కేటీఆర్ ప్రకటించి అభాసుపాలయ్యారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని నిరుద్యోగులు విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తామని హామీ ఇచ్చింది. అందుకనుగుణంగా జాబ్ క్యాలెండర్‌ను రూపొందించి పక్కాగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు.

పెరుగుతున్న ఆత్మహత్యలు

దినసరి కార్మికులే అధికం

- గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులు కూడా...
- చివరి స్థానంలో అన్నదాతలు, వ్యవసాయ కార్మికులు

2022కు ముందు ఐదు సంవత్సరాల కాలంలో దేశంలో ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో దినసరి వేతన కార్మికుల సంఖ్యే అధికంగా ఉంది. గృహిణులు, స్వయం ఉపాధి పొందిన వారు, నిరుద్యోగులు, విద్యార్థులు, అన్నదాతలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అందరి కంటే రైతులు, వ్యవసాయ కార్మికుల సంఖ్యే తక్కువగా ఉన్నదని జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.





న్యూఢిల్లీ : రోజువారీ వేతనాలు పొందుతూ, జీవితాలను నెట్టుకొస్తున్న కార్మికులు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీరి సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూ వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. 2018లో 30,124 మంది, 2019లో 32,559 మంది, 2020లో 37,657 మంది, 2021లో 41,997 మంది, 2022లో 45,185 మంది దినసరి కార్మికులు బలవన్మరణానికి పాల్పడ్డారు. అదే ఐదు సంవత్సరాల కాలంలో ఆత్మహత్య చేసుకున్న రైతులు, వ్యవసాయ కూలీల సంఖ్య 10,000-11,000 మధ్య కొనసాగింది. ఈ తరగతికి చెందిన వారు 2018లో 10.349 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

ఇక 2019లో ఆత్మహత్యకు పాల్పడిన అన్నదాతలు, వ్యవసాయ కార్మికుల సంఖ్య 10,281గా ఉంది. అంటే 2018తో పోలిస్తే ఇది కొంచెం తక్కువ. ఆ తర్వాతి మూడు సంవత్సరాల్లో బలవన్మరణానికి పాల్పడిన రైతులు, వ్యవసాయ కూలీల సంఖ్య కొంత పెరిగింది. 2020లో 10,677 మంది, 2021లో 10,881 మంది, 2022లో 11,290 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. 2018-2022 మధ్యకాలంలో ఆత్మహత్య చేసుకొని మరణించిన గృహిణుల సంఖ్య రైతుల సంఖ్యతో పోలిస్తే రెట్టింపుకు పైగా ఉంది. 2018లో 22,937 మంది, 2019లో 21,359 మంది, 2020లో 22,372 మంది, 2021లో 23,178 మంది, 2022లో అత్యధికంగా 25,309 మంది గృహిణులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇక స్వయం ఉపాధి పొందిన వారిలో 2018లో 13,149 మంది, 2019లో 16,098 మంది, 2020లో 17,332 మంది, 2021లో 20,231 మంది, 2022లో 19,484 మంది ఆత్మహత్య చేసుకున్నారు. నిరుద్యోగులకు సంబంధించి 2018లో 12,936 మంది, 2019లో 14,019 మంది, 2020లో 15,652 మంది, 2021లో 13,714 మంది, 2022లో 15,714 మంది ఆత్మహత్య చేసుకున్నారు. విద్యార్థులకు సంబంధించి 2019లో 10,335 మంది, 2020లో 12,526 మంది, 2021లో 13,089 మంది, 2022లో 13,044 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు.

మాజీ మంత్రులూ....
నోరు అదుపులో పెట్టుకోవాలి

సూచనలు, సలహాలు ఇవ్వకుండా ఆరోపణలా?

- నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తాం
- గజ్వేల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



నవతెలంగాణ- గజ్వేల్

"ప్రభుత్వం ఏర్పాటై వారం రోజులు కూడా గడవకముందే మాజీ మంత్రులు నోరు పారేసుకుంటున్నారు.. నోరు అదుపులో పెట్టుకుంటేనే మంచిది.. కొత్త ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వడం మానుకుని విమర్శలు చేయడం సిగ్గుచేటు.." అని రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనంతరం మొదటిసారిగా గజ్వేల్‌కు రావడంతో.. పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంట్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో పొన్నం మాట్లాడుతూ.. 'రైతుబంధు ఏది, రైతుబీమా ఏది, రైతుకు బోనస్ ఏది' అంటూ కొందరు మాజీ మంత్రులు మాట్లాడుతున్నారని.. నూతన ప్రభుత్వం ఏర్పడి వారం రోజులు కూడా కాలేదని అప్పుడే నోరు పారేసుకుంటే ఎలా అన్నారు. మీరు ఏ రోజైనా ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటి లేదా రెండో తారీఖీల్లో జీతాలు వేశారా అని ప్రశ్నించారు. కొందరు ప్రొఫెసర్లు సైతం ప్రభుత్వం ఆరు నెలలే ఉంటుందని.. అటు పిమ్మట ప్రభుత్వం కూలిపోతుందనడం తగదన్నారు. ప్రజలు తీర్పు ఇచ్చారని, ఆ తీర్పుకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సమర్థవంతంగా నడుస్తుందని చెప్పారు. ప్రజలు తగిన బుద్ధి చెప్పినా.. మాజీ మంత్రులకు ఆశలు చల్లారలేదన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన రెండ్రోజుల్లోనే 6 గ్యారంటీల్లో రెండు అమలు చేశామని.. ఇది మాజీ మంత్రులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని గతంలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టారని.. నేడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ పథకాన్ని రూ.10లక్షలకు పెంచినట్టు గుర్తు చేశారు. మరో నాలుగు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు.

సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, గండేల్లి, గౌరవెల్లి తదితర ప్రాజెక్టుల కింద నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం రావాల్సిన పూర్తి బెనిఫిట్స్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రితో చర్చిస్తామన్నారు. వారికి న్యాయం చేస్తామన్నారు. గజ్వేల్ అభివృద్ధి విషయంలో తాను ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు. స్థానికంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు.

ముఖ్యమంత్రిగా ప్రజలకు అందుబాటులోని ఉండని కేసీఆర్.. ప్రతిపక్ష నాయకుడిగానైనా అందుబాటులో ఉండాలని కోరారు. పేదల ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల సాయం చేస్తామన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ఐదువేల ఇండ్లు నిర్మించి.. ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా పేదలకు ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, నాయకులు నాయిని యాదగిరి, మల్లారెడ్డి, సర్దార్ ఖాన్, రంగారెడ్డి, ముత్యాలు, రవీందర్ రెడ్డి, మోహన్, నక్క రాములు, నాయినితిరుపతి, ఇక్బాల్, వహీద్ ఖాన్, సురేష్, మామిడి కృష్ణ, రమేష్ గౌడ్, నాగరాజు గౌడ్, సీపీఐ నాయకులు మంద పవన్ తదితరులు ఉన్నారు.

టాటానగర్ ప్లాస్టిక్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం

- మైలార్‌దేవ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఘటన



నవతెలంగాణ-రాజేంద్రనగర్

నివాసాల మధ్యలో ఉన్న ప్లాస్టిక్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో టాటానగర్‌లోని ఒక ప్లాస్టిక్ గోదాంలో మంటలు వ్యాపించాయి. స్థానికులు వెంటనే పోలీసులకు, ఫైర్స్ సిబ్బందికి సమాచారం అందించారు. గోదాంలో ప్లాస్టిక్ నిలువలు పెద్దఎత్తున ఉండటంతో క్షణాల్లో భారీగా మంటలు వ్యాపించి ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగ వ్యాపించింది. ఫైర్ సిబ్బంది సుమారు నాలుగు గంటలపాటు కష్టపడి మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు వ్యాపించిన సమయంలో గోదాంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ ఘటనలో గోదాంలో ఉన్న రెండు ఆటోలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులూ లేకుండా నివాసాల మధ్యలో ప్లాస్టిక్ గోదాము ఏర్పాటు చేశారని, యాజమాన్యం మీద కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.పది లక్షల ఆస్తి నష్టం సంభవించి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

చింతపల్లి ఎస్ఐ సతీష్ రెడ్డి సస్పెన్షన్



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లా చింతపల్లి పీఎస్ పరిధిలో ఆదివారం జరిగిన లాకప్‌డెత్ ఘటనలో ఎస్ఐని సస్పెండ్ చేస్తూ ఎస్పీ అపూర్వరావు ఉత్తర్వులు జారీ చేశారు. భూ వివాదంలో తలదూర్చి అతి ఉత్సాహం చూపించిన ఎస్ఐ సతీష్‌రెడ్డిని ఐజీపీ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు ఎస్పీ అపూర్వరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ వివాదాలు, సివిల్ విషయాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దని, ఎవరైనా ఈలాంటి కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-తలమడుగు

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని వివిధ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు ట్రిప్పులను పెంచాలని బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాటేపల్లి సునీత రెడ్డి ఎమ్మెల్యేను కోరారు. సోమవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగిస్తున్నందున రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలకు బస్సులు నడిపిస్తే వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బోథ్ నుంచి భారీ మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యేను ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

స్టాక్ మార్కెట్లలో రూ.27వేల కోట్ల ఈపీఎఫ్ నిధులు

- ఏప్రిల్ - అక్టోబర్‌లో పెట్టుబడులు
- కార్మిక శాఖ మంత్రి వెల్లడి



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఉద్యోగ, కార్మికులకు చెందిన దాదాపు రూ.27వేల కోట్ల పైనా నిధులను కేంద్ర ప్రభుత్వం స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టింది. ఇదే విషయాన్ని సోమవారం కార్మిక శాఖ మంత్రి పార్లమెంట్‌కు తెలిపారు. 2023-24లో ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో రూ.27,105 కోట్ల మొత్తానికి ఎక్స్ఛేంజీ ట్రేడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లో పెట్టుబడిగా పెట్టామని కార్మిక, ఉపాధి శాఖ మంత్రి రామేశ్వర్ తేలి వెల్లడించారు. గడిచిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇటిఎఫ్‌లలో మొత్తంగా రూ.53,081 కోట్లు పెట్టుబడి పెట్టిందని, 2021-22లోని రూ.43,568 కోట్ల పెట్టుబడులతో పోల్చితే దాదాపు 20 శాతం ఎక్కువని రామేశ్వర్ లోకసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో ఇప్పటి వరకు రూ. 27,105 కోట్లను ఇటిఎఫ్‌ల్లో పెట్టుబడి పెట్టినట్టు పేర్కొన్నారు.

2016-17లో ఈటీఎఫ్‌లలో రూ.14,983 కోట్లు, 2017-18లో రూ.24,790 కోట్లు, 2018-19లో రూ.27,974, 2019-20లో రూ.31,501 కోట్లు, 2019-20లో రూ.32,071 చొప్పున పెట్టుబడులు పెట్టినట్టు వెల్లడించారు. అయితే.. బ్లూచిప్ కంపెనీ స్టాక్స్‌తో సహా వ్యక్తిగత స్టాక్‌లలో ఈపీఎఫ్‌ఓ నేరుగా పెట్టుబడి చేయదన్నారు. బీఎస్‌ఈ సెన్సెక్స్, నిఫ్టీ-50 సూచీల్లో ఈటీఎఫ్‌ల ద్వారా ఇన్వెస్ట్ చేస్తుందన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం వివిధ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ వాటాల్లోనూ పెట్టుబడులు పెడుతుందన్నారు. ప్రభుత్వం నోటిఫై చేసిన ఇన్వెస్ట్‌మెంట్ విధాన ప్రకారం ఈపీఎఫ్‌ఓ తన ఫండ్స్‌ను ఇన్వెస్ట్ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. 2022 మార్చి 31 నాటికి ఈపీఎఫ్‌ఓ వద్ద రూ.18.30 లక్షల కోట్ల కార్పస్ ఫండ్ ఉంది. ఇందులో 8.70 శాతం నిధులను స్టాక్ మార్కెట్లలో పెట్టుబడిగా పెట్టింది. మిగితా 91.30 శాతం రుణ పెట్టుబడులు కలిగి ఉంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015 ఆగస్ట్ నుంచి ఈటీఎఫ్‌ల్లో ఈపీఎఫ్‌ఓ పెట్టుబడులు పెడుతోంది.

దంపతుల ఆత్మహత్యాయత్నం

భూమిని అధికారులు లాక్కుంటున్నారని ఆవేదన



నవతెలంగాణ - కొనరావుపేట

గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూమిని తిరిగి అధికారులు లాక్కుంటున్నారని వారి ముందే భార్యాభర్తలిద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

కొనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మల్యాల నందం 15 సంవత్సరాలు జనశక్తి పార్టీలో పనిచేసి తెలంగాణ రాకముందు అప్పటి ప్రభుత్వం ముందు లొంగిపోయాడు. 2013లో ప్రభుత్వం నందంకు కొండాపూర్ శివారులోని 116ఏ సర్వే నెంబర్‌లో ఎకరం 20 గుంటల భూమి ఇచ్చింది. అప్పటి నుంచి ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల సర్వేయర్ కుమార్ వారికి ఇక్కడ భూమి లేదని.. రూ.50వేలు లంచం ఇస్తే సర్వే చేసి భూమి ఇస్తానని చెప్పాడు. లంచం ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ విషయపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు స్పందించడం లేదు. సోమవారం భూమిని స్వాధీనం తహసీల్దార్ విజయరామారావు, అధికారులు వచ్చారు. భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయగా మల్యాల నందం, ఆయన భార్య పద్మ అధికారుల ముందే పురుగుల మందు తాగేందుకు యత్నించారు. నందం పురుగుల మందు తాగి కింద పడిపోయాడు. వెంటనే గమనించిన తహసీల్దార్ తన వాహనంలోనే భార్యాభర్తలు ఇద్దరినీ సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై తహసీల్దార్ స్పందిస్తూ.. రెవెన్యూ భూమిని ప్రభుత్వం అటవీశాఖకు అప్పగించిందని, హద్దులు చూపించేందుకు రాగా ఈ ఘటన జరిగిందని చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజలందరికీ న్యాయం చేస్తాం

- ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు
- ప్రజాదర్బార్‌లో 1,143 వినతులు స్వీకరించిన మంత్రి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేస్తుందనీ, ప్రజలందరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భరోసానిచ్చారు. ప్రజాదర్బార్‌లో ప్రజలిచ్చే వినతిపత్రాలపై పూర్తి అడ్రస్, సెల్‌ఫోన్‌నెంబర్, పూర్తి వివరాలు రాయాలని సూచించారు. సీఎం ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి శ్రీధర్‌బాబు 1,143 వినతిపత్రాలను స్వీకరించారు. పూర్తి వివరాలుంటే దరఖాస్తుదారుల సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే వీలుంటుందన్నారు. ఈనెల 17న రెండు, మూడు పోటీ పరీక్షలున్నందున టీఎస్ జెన్కో ఏఈ పరీక్ష వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామనీ, సంబంధిత అధికారులతో చర్చించి పరీక్ష వాయిదాపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తమకిచ్చే గౌరవ వేతనాన్ని ప్రతి నెలా రెగ్యులర్‌గా ఇవ్వాలని మధ్యాహ్న భోజన వంట కార్మికులు విజ్ఞాపన పత్రం అందజేశారని చెప్పారు. దీన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. ప్రజాదర్బార్ నిర్వహణను జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ సమన్వయం చేశారు. ఆయుష్ విభాగం డైరెక్టర్ హరిచందన, సీనియర్ ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిసెట్టి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇప్పటిదాకా 4,471 వినతిపత్రాల స్వీకరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాదర్బార్‌కు మంచి స్పందన లభిస్తున్నది. ప్రజలు తమకు సంబంధించిన వివిధ రకాల సమస్యలపై వినతి పత్రాలను సమర్పించేందుకు ప్రజా భవన్ కు పెద్ద ఎత్తున వస్తున్నారు. ప్రజాదర్బార్ మొదలైన నాలుగు రోజుల్లోనే 4,471 వినతిపత్రాలు వచ్చాయని అధికార వర్గాలు తెలిపాయి. అందులో ఎక్కువ శాతం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, పింఛన్లకు సంబంధించిన సమస్యలే ఉన్నాయని పేర్కొన్నాయి.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి సీతక్కకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ(సీతక్క) చొరవ తీసుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంత్రి సీతక్కకు వారు వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల పోరాటానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కాంగ్రెస్ నేతలు మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీలకు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు వెంటనే ఉత్తర్వులను జారీ చేయాలని మంత్రిని కోరారు. అంగన్వాడీలను పర్మినెంట్ చేసి కనీస వేతనం 26 వేలు ఇవ్వడంతో పటు పీఎఫ్, ఈఎస్ఐ, తదితర సౌకర్యాలను కల్పించాలని విన్నవించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించేలా చూడాలన్నారు. 24 రోజుల సమ్మెకాలపు వేతనాలను వెంటనే చెల్లించాలనీ, పెండింగ్ వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. రెండోపీఆర్సీ వర్తింపజేయడంతో పాటు కనీసవేతనం నిర్ణయించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలు, అర్హులకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని విన్నవించారు. ప్రమాదబీమా సౌకర్యం రూ.2 లక్షల ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. యాప్‌లన్నీ రద్దు చేసి ఒకటే ఉండేలా చూడాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులివ్వాలని కోరారు. అర్హులైనవారికి ప్రమోషన్లు ఇవ్వాలనీ, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులను చేయించొద్దని సూచించారు. మూడేండ్ల రేషన్‌షాపు ట్రాన్స్‌పోర్టు చార్జీలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర కోశాధికారి పి.మంగ, ఉపాధ్యక్షులు డి.సునీత, సహాయ కార్యదర్శి బి.స్వప్న, జి.శారద, రాష్ట్ర నాయకులు పి.నాగమణి, కె.సమ్మక్క, నిర్మల, అన్నపూర్ణ, కె.నర్సమ్మ బి.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తా : మాజీ మంత్రి జానారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన్ను హైదరాబాద్‌లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై దాదాపు గంటకు పైగా ఇద్దరు చర్చించారు. ఈ సందర్భంగా సీఎంను జానారెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జానారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇబ్బందులను, బాధలను తెలియజేయడం శుభ పరిణామమన్నారు. ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రజల ప్రజాభిమానం చూరగొనేలా పనిచేయాలని సీఎంకు చెప్పానన్నారు. ప్రభుత్వంలో తన పాత్ర ఏమి ఉండదని, సలహాలు, సూచనలు ఇస్తానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆస్పత్రిలో ఉండటం బాధాకరమన్నారు. తాను వెళ్లి పరామర్శించే ప్రయత్నం చేశాననీ, వీలు కాకపోవడంతో కేటీఆర్, హరీష్‌లను కలిశానని చెప్పారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాగార్జున సాగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తన కుమారుడు జయవీర్‌కు మంత్రి పదవి ఇవ్వాలని సీఎంను అడుగలేదని ఈ సందర్భంగా జానారెడ్డి తెలిపారు.

కాటన్‌కు పాత రోజులు వచ్చేనా?

కష్టకాలంలో కాటన్ వస్త్రోత్పత్తి

- మూతపడ్డ సైజింగ్, డయింగ్‌లు
- 20వేల నుంచి 2వేలకు తగ్గిన మరమగ్గాలు
- అప్పుల పాలైన ఉత్పత్తిదారులు



నవతెలంగాణ - సిరిసిల్ల

నాడు సిరిసిల్ల కాటన్ వస్త్రోత్పత్తికే పెట్టింది పేరు. నేడు ఆ కాటన్ వస్త్రోత్పత్తి కష్ట కాలాన్ని ఎదుర్కొంటోంది. ఆ రోజుల్లో 20వేల మరమగ్గాలపై కాటన్ నడవగా.. ప్రస్తుతం 2వేలు కూడా లేవు. కాటన్ పరిశ్రమ సంక్షోభం లో కూరుకుపోయింది. గత ప్రభుత్వంలో అనేకసార్లు కాటన్ వస్త్ర వ్యాపారులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. కానీ ఎలాంటి లాభం కనిపించలేదు. దాంతో పరిశ్రమ చతికిలబడిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం కాటన్ పరిశ్రమపై దృష్టి సారిస్తే సిరిసిల్లలో కాటన్ పరిశ్రమకు మళ్లీ మంచి రోజులు వచ్చే అవకాశం ఉంది. కాటన్‌కు అనుబంధంగా ఉన్న డయింగ్, సైజింగ్‌లు మూతపడ్డాయి. సుమారు 300 డయింగ్‌లు ఉండగా అవి పదికి చేరుకున్నాయి. సిరిసిల్లలో ఉన్న 25సైజింగ్‌లు మూతపడ్డాయి. ప్రస్తుతం ఐదు సైజింగ్‌లు మాత్రమే నడుస్తున్నాయి. ఈ పరిశ్రమకు అనుబంధంగా పనిచేసే 5వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. గత ప్రభుత్వం పాలిస్టర్‌కు ఇచ్చిన ప్రాధాన్యం కాటన్ రంగానికి ఇవ్వకపోవడంతో కార్మికులు రోడ్డున పడగా యజమానులు నష్టాల్లో కూలిపోయారు.

అప్పుల పాలైన ఉత్పత్తిదారులు

సిరిసిల్లలో గతంలో 36వేల మరమగ్గాలు ఉండగా పాలిస్టర్ 10 శాతం మరమగ్గాలపై నడిచేవి. మిగతా 90శాతం కాటన్ మీద నడిచేవి. ప్రస్తుతం 10శాతం మరమగ్గాలపైన మాత్రమే కాటన్ వస్త్రాలు తయారవుతున్నాయి. దాంతో కాటన్ మరమగ్గాలకు ముడిసరుకులైన బీములను సైజింగ్ పరిశ్రమలు అందిస్తుండగా కాటన్ గుడ్డను మరమగ్గాలపై ఉత్పత్తి చేసిన అనంతరం డయింగ్ పరిశ్రమలు ఈ వస్త్రాలను అద్దకం చేస్తాయి. ప్రస్తుతం కాటన్ వస్త్ర ఉత్పత్తి రంగం కుదేలు కావడంతో వాటిపై ఆధారపడి మనుగడ సాగించే డయింగ్ సైజింగ్ పరిశ్రమల్లో కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఈ రెండు రంగాల పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో పాటు యజమానుల పరిస్థితి కూడా దయనీయంగా మారింది.

తప్పని నష్టాలు.. కష్టాలు

బతుకమ్మ చీరల ఉత్పత్తితో మరమగ్గాలపై పాలిస్టర్ తయారీ జరుగుతుండటంతో కార్మికులు సైతం కాటన్ తయారీ చేయడం లేదు. ఫలితంగా ఇప్పటికే సైజింగ్‌లు డయింగ్‌లు మూతపడుతూ వస్తున్నాయి. కొన్ని డయింగులు సైజింగ్‌లు కష్టంగా నష్టాల్లో నడుస్తున్నాయి. బతుకమ్మ చీరలు ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో కార్మికులను యజమానులను ఆదుకున్న గత ప్రభుత్వం కాటన్ వస్త్ర రంగాన్ని ఆదుకోకపోవడంతో సంబంధిత పరిశ్రమలు మూతపడ్డాయి. కాటన్ వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలను ఆదుకోవాలని గత ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లినా లాభం లేకుండా పోయింది. ప్రస్తుత ప్రభుత్వమైనా కాటన్ పరిశ్రమపై దృష్టి సారించి సంక్షోభంలో ఉన్న పరిశ్రమను గట్టెక్కించాల్సిన అవసరం ఉంది. పాలిస్టర్ లాగే కాటన్‌కు కూడా ప్రభుత్వం ఆర్డర్లు ఇప్పిస్తే ఉపాధి కల్పించిన వారవుతారు.

నెలకు ఐదు రోజులే నడుస్తోంది



గతంలో నెలలో 30రోజులు పని ఉండేది. ప్రస్తుత పరిస్థితుల్లో నెలలో 5రోజులు మాత్రమే పని ఉంటోంది. నెలకు రూ.5వేలు మాత్రం వస్తున్నాయి. సిరిసిల్లలో సైజింగ్‌లు అన్నీ మూతబడి ప్రస్తుతం 5 మాత్రమే నడుస్తున్నాయి. గతంలో 100 అద్దకం పరిశ్రమలు ఉండగా.. ఇప్పుడు ఆరు మాత్రమే నడుస్తున్నాయి. ఈ ప్రభుత్వమైనా ఆలోచించి కాటన్ పరిశ్రమను గట్టెక్కిస్తేనే కార్మికులు బతుకుతారు.

- గాలిపెల్లి శ్రీనివాస్, సైజింగ్ కార్మికుడు

సంపాదకీయం

సామూహిక సవాళ్లు

కొన్నిసార్లు వ్యక్తులకు సవాళ్లొస్తుంటాయి. నాయకుడి చుట్టూ నిర్మించిన పార్టీల్లో ఇది సర్వసాధారణం. సమిష్టి నిర్ణయాలే అమలయ్యే పార్టీలకూ సవాళ్లుంటాయి. కోవిడ్ లాంటి మహమ్మారులు కమ్ముకున్నపుడు దేశాలకు సవాళ్లుంటాయి. కాని యావత్ తెలంగాణ సమాజానికి, దాన్లోని నాలుగు కోట్ల మంది జనానికి సామూహికంగా సవాళ్లు రావడం ఒక ప్రత్యేక సందర్భమే! ఆకాశంలోని నక్షత్రాలను కోసుకొచ్చి మన గ్రామ సీమల్లో ముగ్గులద్దుతామన్న పార్టీ మాటలు విరోధాభాసాలంకారానికి నిలువెత్తు నిదర్శనాలుగా నిలిచాయి. కన్యాశుల్కంలో వెంకమ్మ గారి నిష్ఠూరపు మాటలు "అదిగో పసుపు, ఇదిగో ముసుగు"ల సామ్యం చాలా మందిని కలిచి వేశాయి. ప్రయణారంభాన్ని మరిచిపోతే గమనం అర్థం కాదు, గమ్యం శిథిలమవుతుంది. అలానే అయ్యింది కూడా!

నైజాము నవాబునే ఎదిరించి, వారి గడీలను కూల్చిన భూమి మీద ఆత్మగౌరవం లేకుండా బతకదు తెలంగాణ. ఏకుగా వచ్చి మేకుగా మారిన పాలకుడి దర్పనం ఆ పార్టీ శాసన సభ్యులకే కరువు. ఇక సామాన్యుల గతేంటి? నేతలకు కనీసం తమగోడు విన్నవించుకోగలిగామన్న సంతృప్తి గత నాలుగు రోజులుగా జ్యోతిబాఫూలే ప్రాంగణంలో మారుమోగుతున్న తీరే ఒక నిదర్శనం. అందుకే, సవాళ్లు వ్యక్తులకు కాదు.

ఇది రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌ల మధ్య సమస్య కాదు, బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య సమస్య అసలే కాదు. విధానాలకు సంబంధించిన సమస్య. 2014 కంటే ముందు కాంగ్రెస్ అవలంభించిన విధానాలనే ఆ తర్వాత టీఆర్ఎస్, ఇప్పటి బీఆర్ఎస్ అవలంభించింది. లేదా కొనసాగించింది. అందుకే అక్కడికే చేరింది. 1991 - 92లో పి.వి, మన్మోహన్ ద్వయం ప్రారంభించిన నయా ఉదారవాద విధానాలు నిరుద్యోగాన్ని, వ్యవసాయ సంక్షోభాన్ని పెంచాయి. రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. నేటికీ దేశంలో అతిపెద్ద ఉపాధి కేంద్రం వ్యవసాయమే. గ్రామీణ నిరుద్యోగం కుప్పలు తెప్పలుగా పెరిగింది. దీని పరిష్కారానికే 2014లో మోడీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలన్నాడు. వ్యవసాయ సంక్షోభం పరిష్కారించాలంటే ఒకటిన్నర రెట్లు పంటకు ఆదాయమొచ్చేలా చేస్తామన్నాడు. వీటి పరిష్కారానికే 2014లో కేసీఆర్ నీళ్లు, నియామకాలన్నాడు.



జనం రోసిన ఆ విధానాలవలంభిస్తే తెలంగాణలో ఉపాధి అవకాశాలు మెరుగవలేదు. నియామకాలు 'హళ్లికి హళ్లి, సున్నకి సున్న'గా తేలాయి. 1983 నుండి 2018 వరకు యువత ఉపాధి అవకాశాలు పెరిగినట్లు దాఖలాల్లేవు. తాజాగా అజీమ్‌ప్రేమ్‌జీ విశ్వ విద్యాలయం వారి 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2023' నివేదిక ఉపాధి అవకాశాల అధ్వాన్న స్థితినే తెలియజేస్తున్నది. పైగా కార్మికుల నిజ వేతనాలు పడిపోవడం మరొక కీలకాంశం. ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున కేంద్రం కోత పెడుతున్నది. దానిపై ఇంతకాలం నోరెత్తలేదు బీఆర్ఎస్. అది బీజేపీతో లాలూచీ కుస్తీలో అంతర్భాగమో కాదో కేసీఆర్ తేల్చాలి.

కోట్లాది జనం చేసిన పోరాటాల వల్ల తెలంగాణ సిద్ధించింది. దానికి కర్త, కర్మ, క్రియా తానేనన్న అహంకారంతో కేసీఆర్ ప్రవర్తించారు. తనని విమర్శిస్తే తెలంగాణను విమర్శించినట్లేనంటూ ఆయన తాబేదార్లంతా ఎగిసి పడేవాండ్లు. గులాబీ దళాలు మరిచిపోయిన అంశం, లేదా విస్మరించిన అంశమేమంటే తెలంగాణ సాధన ఒక (ఎన్డ్) ముగింపు కాదు. నాలుగు కోట్ల తెలంగాణా వాసుల సముద్ధరణకు అది ఒక సాధనం (మీన్స్). ఉత్తరాన గోదావరి, దక్షిణాన క్రిష్ణ నదులున్న ప్రాంతం మన తెలంగాణ. ఇనుము, బొగ్గు, సున్నపురాయి, బాక్సైట్ వంటి ఖనిజాలనేకం. క్రిష్ణానది పొడుగునా కోదాడ నుండి విష్ణుపురం వరకు సిమెంటు పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. రైలు, రోడ్ రవాణాని విస్తరించగలిగితే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. దీనికి అడ్డుపడే కేంద్ర ప్రభుత్వ విధానాలపై యుద్ధం చేయాలి. ఆ పని చేయకుండా పెద్దనోట్ల రద్దుకు, జీఎస్‌టీకి భజన చేస్తూ కొంతకాలం కాలక్షేపం చేసింది బీఆర్ఎస్. ఆ రెంటి దెబ్బకు కునారిల్లిన ఎమ్ఎస్ఎమ్ఈ లు నేటికీ కోలుకోలేదు.

60 శాతం పైగా వలస కార్మికులతో పని చేయించుకుంటూ పరిశ్రమల యజమానులు కోట్ల రూపాయల లాభాలు సంపాదించుకుంటున్నారు. నేడు స్థానికులకే ఉద్యోగాలన్న డిమాండు రాష్ట్రమంతా మార్మోగుతున్నది. వ్యవసాయంతో సహా అన్ని పనుల్లో యాంత్రీకరణ పెరిగిపోయింది. ఇక 'నియామకాల'న్న అంశమే అటకెక్కింది. వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపనకున్న అవకాశాలను పాలకులు పట్టించుకోకపోవడం పెద్ద సవాలు. టిఎస్ఐడీసీ ద్వారా 28 ఇండస్ట్రీయల్ పార్కులేర్పాటు చేసినా అవి నడిపించింది లేదు. కొలువులొచ్చిందీ లేదు.

నైజాము నవాబునే ఎదిరించి, వారి గడీలను కూల్చిన భూమి మీద ఆత్మగౌరవం లేకుండా బతకదు తెలంగాణ. ఏకుగా వచ్చి మేకుగా మారిన పాలకుడి దర్పనం ఆ పార్టీ శాసన సభ్యులకే కరువు. ఇక సామాన్యుల గతేంటి? ఇప్పుడు ప్రజలకు కనీసం తమగోడు విన్నవించుకోగలిగామన్న సంతృప్తి గత నాలుగు రోజులుగా జ్యోతిబాఫూలే ప్రాంగణంలో మారుమోగుతున్న తీరే ఒక నిదర్శనం. అందుకే, సవాళ్లు వ్యక్తులకు కాదు.

ఇది వ్యక్తుల సమస్య కూడా కాదు. తెలంగాణ ప్రజల సమస్య, వాళ్ల జీవితాలకు సంబంధించిన సమస్య. ఈ సవాళ్లను సరిగా స్వీకరించి ప్రజలకు ఎలా ఉపయోగపడాలో కాంగ్రెస్ పార్టీ నిర్ణయించుకోవాలి.

ఈ అడుగులు ఆశలు నెరవేర్చాలి...



ఎస్ వీరయ్య

రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వం కొలువుతీరింది. ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానం మేరకు ఆరు గ్యారంటీల మీద ముఖ్యమంత్రి సంతకం చేసారు. వికలాంగురాలైన విద్యావంతురాలికి ఉద్యోగమిస్తూ మలి సంతకం చేసారు. కొత్త ప్రభుత్వం మీద జనం ఎంతో ఆశతో ఉన్నారు. మరోవైపు విద్యుత్తు అప్పు భారం, మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోవటం మీద ప్రభుత్వం స్పందిస్తున్న తీరు చర్చనీయాంశమైంది. ఇవన్నీ ఒక భాగం... ఈ ఎన్నికల్లో ప్రజల భావోద్వేగాలతో చెలగాటమాడే మతోన్మాద శక్తుల ప్రమాదం మరింత ముందుకొచ్చింది. ఆరునెలల్లో ఈ ప్రభుత్వం కూలిపోతుందని చెప్పటం కూడా మొదలైంది. రానున్నది తెలంగాణ ప్రజలకు, ప్రజాతంత్రవాదులకు పరీక్షాకాలం.

'ప్రగతి భవన్' పేరు గొప్పది. కానీ పేరు పెట్టినంత మాత్రాన సరిపోదు కదా! ప్రభుత్వ విధానం ఆ పేరును మసకబార్చింది. కొత్తగా పెట్టిన పేరు కూడా అంతే. పేరు పెట్టినంత పట్టుదలతో దాని స్ఫూర్తిని అమలు చేయటం ఇంకా ముఖ్యం. 'ప్రజాభవన్' కు 'జ్యోతిబా ఫూలె' పేరు కూడా జోడించటం మంచిదే. సామాజిక రంగంలో కూడా ఆ స్ఫూర్తితో కొత్త ప్రభుత్వం పనిచేయాలి. ప్రగతి భవన్ ముందు ఇనుప గోడలు తొలగించడాన్ని జనం ఉద్వేగంతో గమనించారు. ప్రజలెన్నుకున్న నేతలు ఇక ప్రజలకు దూరంగా ఉండరన్నట్టుగా ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే ప్రజాదర్బార్ ప్రారంభం కూడా జనంతో కిటకిటలాడింది. అయితే ప్రజాస్వామ్యాన్ని ప్రజా దర్బార్‌కు పరిమితం చేసి చూడకూడదు. ప్రగతి భవన్ పేరు మార్పు, ఇనుప బ్యారికేడ్ల ధ్వంసం, ప్రజాదర్బార్ ప్రారంభం ప్రజాస్వామ్య విలువలకు సూచనప్రాయ చర్యలు మాత్రమే. నిజమైన ప్రజాస్వామ్య విలువలు అమలు చేయాలి. ప్రజల హక్కులను గౌరవించాలి. వినతిపత్రాలు స్వీకరించాలి. సంఘాలతో, పార్టీలతో చర్చలు జరపాలి. ప్రజల సమస్యలపట్ల సానుకూలత ప్రదర్శించాలి. నిరసన తెలిపే హక్కు, సమ్మె హక్కును అంగీకరించాలి. సమిష్టి బేరసారాల హక్కును గౌరవించాలి. ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలి. విమర్శలను స్వీకరించాలి. శాసనసభను ప్రజల సమస్యలు, ప్రభుత్వ విధానాల చర్చావేదికగా నడపాలి.

కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం కూడా చేయకముందే 'ఆరు గ్యారంటీలు ఆచరణ సాధ్యమా?' అన్న చర్చ మొదలైంది. కొందరు మేధావులతో పాటు చినజీయర్ స్వామి వరకూ ఇదే వాదన. ఆర్థిక వ్యవస్థ చితికిపోతుందట. చినజీయర్ స్వామి ఈ పథకాల పట్ల వ్యంగ్యాస్త్రాలు వదిలారు. 'పడుకుంటే ఉచితం, నిలుచుంటే ఉచితం' అని హేళన చేసారు. తమ ప్రియతమ ప్రధాని మోడీ 'ఉచితాల' వాదన తలకెక్కినట్టున్నది. సర్వసంగ పరిత్యాగినని చెప్పుకునే ఆయనకు అన్ని సౌకర్యాలు కావాలట. పేదల సంక్షేమ పథకాలను మాత్రం హేళన చేస్తున్నారు. ఇలాంటివారికి దేశ ఆర్థిక వ్యవస్థ మీద నిజంగా ఆందోళన ఉంటే, ఆదానీ కుంభకోణం, బ్యాంకుల అప్పులు ఎగ్గొడుతున్న బడాబాబుల దోపిడీల మీద దృష్టి సారించాలి.

ఫలితాలు వెలువడగానే, కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ "వామపక్షాల సహకారం కూడా తీసుకుంటా"నన్నారు. ప్రమాణ స్వీకారం సమయంలో ప్రతిపక్షాలను, మేధావులను కలుపుకుపోయారని, అందరితో కలివిడిగా మెలిగారన్న వార్తలు వచ్చాయి. ఇవన్నీ సానుకూల సంకేతాలు. రానున్నకాలంలో ఆచరణ రూపుదాల్చాలి. మరోవైపు బీఆర్ఎస్ ఓటమి స్పష్టమైన తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తీరు కూడా చర్చనీయాంశమైంది. రాజీనామా లేఖను గవర్నర్‌కు పంపించి, తాను ప్రజలకు, మీడియాకు ముఖం చాటేసి, ఫామ్‌హౌజ్‌కు వెళ్ళిపోవటం ప్రజలు గమనించారు. ఓటమిని హుందాగా స్వీకరించి ఉండాల్సింది. ప్రజల తీర్పును గౌరవిస్తూ, తొమ్మిదిన్నర సంవత్సరాలు పరిపాలించే అవకాశం ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు చెప్పి ఉండాల్సింది.

కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం కూడా చేయకముందే 'ఆరు గ్యారంటీలు ఆచరణ సాధ్యమా?' అన్న చర్చ మొదలైంది. కొందరు మేధావులతో పాటు చినజీయర్ స్వామి వరకూ ఇదే వాదన. ఆర్థిక వ్యవస్థ చితికిపోతుందట. చినజీయర్ స్వామి ఈ పథకాల పట్ల వ్యంగ్యాస్త్రాలు వదిలారు. 'పడుకుంటే ఉచితం, నిలుచుంటే ఉచితం' అని హేళన చేసారు. తమ ప్రియతమ ప్రధాని మోడీ 'ఉచితాల' వాదన తలకెక్కినట్టున్నది. సర్వసంగ పరిత్యాగినని చెప్పుకునే ఆయనకు అన్ని సౌకర్యాలు కావాలట. పేదల సంక్షేమ పథకాలను మాత్రం హేళన చేస్తున్నారు. ఇలాంటివారికి దేశ ఆర్థిక వ్యవస్థ మీద నిజంగా ఆందోళన ఉంటే, ఆదానీ కుంభకోణం, బ్యాంకుల అప్పులు ఎగ్గొడుతున్న బడాబాబుల దోపిడీల మీద దృష్టి సారించాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా వనరుల సేకరణకు సంపద పోగవుతున్న చోట దృష్టి సారించాలి. అవినీతిని అరికట్టాలి. అర్హులైన పేదలు, మధ్యతరగతి ప్రజలకే రాయితీలు పరిమితం చేయాలి.

కాంగ్రెస్ నాయకత్వం ఒక వాస్తవం గమనించాలి. ఓట్లు కాంగ్రెస్ మీద ప్రేమతో పడలేదు. బీఆర్ఎస్ నాయకత్వ ధోరణి మీద వ్యతిరేకత, కొన్ని విధానాల మీద అసంతృప్తితో వేసారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా తీసుకున్న జాగ్రత్తలు, బీఆర్ఎస్ వ్యతిరేక ఓటును సొమ్ము చేసుకునేందుకు తోడ్పడింది. కాంగ్రెసు తీసుకున్న జాగ్రత్తలు ఎంతకాలం నిలుపుకుంటుందో చూడాలి. బొటాబొటి మెజారిటీతో ఉన్న కాంగ్రెసు, తన గూటినుండి పక్షులు ఎగిరిపోకుండా నిలుపుకోగలగాలి. ఎదుటిపక్షం శాసనసభ్యులకు గాలం వేసే ప్రయత్నాలు చేయకుండా ఉండగలదా అన్నది కూడా వేచిచూడాలి. ప్రభుత్వం నిలుపుకునేందుకు దొడ్డిదారులు వెతకకుండా ప్రజల విశ్వాసం చూరగొనాలి. కాంగ్రెస్ సహజ స్వభావానికి భిన్నంగా, ఈ మార్పులు చేసుకోగలుగుతుందా అన్నదే ప్రశ్న.

ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం కూడా జరుగకముందే విద్యుత్తు ఉన్నతాధికారి రాజీనామా ప్రయత్నం అనుమానాలకు తావిచ్చింది. 85వేల కోట్ల రూపాయల అప్పు చర్చనీయాంశమైంది. రైతులకు ఏంచేసైనా ఉచిత విద్యుత్తు ఇస్తానన్న గత పాలకులు అప్పుకు సాహసించి ఉండవచ్చు. అదే నిజమైతే... శాసన సభలో చర్చకు పెట్టి ఉండాల్సింది. పారదర్శకత లోపించింది. లోతైన పరిశీలన అవసరమే. మేడిగడ్డ ప్రాజెక్టు ఉదంతం చూసిన తర్వాత, సాగునీటి ప్రాజెక్టుల మీద విచారణను ఎవరూ ప్రశ్నించజాలరు. వాస్తవాలు తేలితే మంచిదే కదా!

ఏమైనా ప్రజాసమస్యల పట్ల ప్రభుత్వం అనుసరించే వైఖరి, ప్రజాస్వామ్య విలువల పట్ల ప్రదర్శించే ధోరణి కీలకమైనది. మరోవైపు పొంచి ఉన్న మతోన్మాద శక్తుల ప్రమాదం ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఇలాంటి శక్తులు పుంజుకోకుండా చూడటం, ప్రజాస్వామ్య, లౌకిక విలువల పరిరక్షణ నూతన ప్రభుత్వం ముందున్న సవాలు. పాలకులు ఏమాత్రం తప్పటడుగులు వేసినా, ప్రజల భావోద్వేగాలతో చెలగాటమాడే శక్తులు ఉపయోగించుకుంటాయన్న స్పృహ అవసరం. ఇప్పటికే, ప్రజల తీర్పును సవాలు చేసే ధోరణలు వ్యక్తమవుతున్నాయి. ఆరు నెలల్లో రేవంత్ ప్రభుత్వం పడిపోతుందని బీజేపీ శాసన సభ్యులు రాజాసింగ్ ప్రకటించారు. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడబోతున్నదనీ, బీజేపీ కీలక పాత్ర పోషిస్తుందనీ బీజేపీ నేత రఘునందన్‌రావు, తన ఎన్నికల క్యాంపెయిన్‌లో చెప్పారు. రేవంత్ కన్నా కేసీఆర్ మెరుగైన నాయకుడని ధర్మపురి అరవింద్ అన్నారు. అంటే కాంగ్రెస్‌కన్నా బీఆర్ఎస్ మెరుగైందనీ, బీఆర్ఎస్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామనీ చెప్పటమే కదా! కానీ ఫలితాలు వారికి ఆశాభంగం కలిగించాయి. తట్టుకోలేకపోతున్నారు. అయినా కాంగ్రెస్‌లో చిచ్చుపెట్టే అవకాశాలు రాకపోతాయా అన్నట్టు ఆలోచిస్తున్నారు. అందుకే రాజాసింగ్ మనసులో మాట బయటపెట్టేసారు. శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం నుంచే మతోన్మాదాన్ని ప్రదర్శించటం మొదలుపెట్టారు. ప్రొటెం స్పీకర్ ముస్లిం కాబట్టి, ఆయన ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయలేమని బాయ్‌కాట్ చేసారు. సీనియర్ మోస్ట్ శాసన సభ్యుడిని ప్రొటెం స్పీకర్‌గా నియమించే సంప్రదాయాన్ని పాటించకపోవడాన్ని తమ మతోన్మాద ధోరణితో ముడిపెట్టారు. సంప్రదాయాన్ని పాటించలేదని విమర్శించవచ్చు. కానీ, జరిగిన ప్రక్రియ రాజ్యాంగబద్ధం. దానినెవరూ ప్రశ్నించజాలరు. అందుకే తమ పార్టీకి చెందిన గవర్నర్ కూడా ప్రశ్నించలేదు కదా! రాజ్యాంగంలోని ఆర్టికల్ 180(1) ప్రకారం ప్రభుత్వం సూచించిన శాసన సభ్యుడు / సభ్యురాలిని ప్రొటెం స్పీకర్‌గా గవర్నర్ నియమిస్తారు. ప్రజాస్వామ్యం, లౌకిక రాజ్యాంగ విలువల మీద నమ్మకం లేని బీజేపీ మత చిచ్చుకు ప్రయత్నాలు ప్రారంభించింది. కాంగ్రెస్ నాయకత్వం మరింత అప్రమత్తత ప్రదర్శించాలి. తమ ప్రభుత్వానికి బీజేపీ నుంచి ప్రమాదం పొంచి ఉన్నదన్న సంకేతాలు రానే వచ్చాయి.



కాంగ్రెస్ నాయకత్వం ఒక వాస్తవం గమనించాలి. ఓట్లు కాంగ్రెస్ మీద ప్రేమతో పడలేదు. బీఆర్ఎస్ నాయకత్వ ధోరణి మీద వ్యతిరేకత, కొన్ని విధానాల మీద అసంతృప్తితో వేసారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా తీసుకున్న జాగ్రత్తలు, బీఆర్ఎస్ వ్యతిరేక ఓటును సొమ్ము చేసుకునేందుకు తోడ్పడింది. కాంగ్రెసు తీసుకున్న జాగ్రత్తలు ఎంతకాలం నిలుపుకుంటుందో చూడాలి. బొటాబొటి మెజారిటీతో ఉన్న కాంగ్రెసు, తన గూటినుండి పక్షులు ఎగిరిపోకుండా నిలుపుకోగలగాలి. ఎదుటిపక్షం శాసనసభ్యులకు గాలం వేసే ప్రయత్నాలు చేయకుండా ఉండగలదా అన్నది కూడా వేచిచూడాలి. ప్రభుత్వం నిలుపుకునేందుకు దొడ్డిదారులు వెతకకుండా ప్రజల విశ్వాసం చూరగొనాలి.

రాష్ట్రంలో బీజేపీ ఏ గడ్డి గరిచైనా ఎదగాలని ప్రయత్నిస్తున్నది. ఇందుకోసం, ఎన్నికల సందర్భంగా, ప్రజలలో పలుకుబడి ఉన్న ఇతర పార్టీల నేతలను కలుపుకున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల అవకాశవాద ధోరణులు కూడా వీరికి ఉపయోగపడ్డాయి. స్వప్రయోజనాల కోసం ప్రముఖ కాంగ్రెస్ నాయకులు కొండా విశ్వేశ్వరరెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, వివేక్ (మళ్ళీ వెనక్కి వచ్చారు). కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (మళ్ళీ వెనక్కి వచ్చారు) లాంటివారు, బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీమంత్రి ఈటల రాజేందర్ లాంటి వారు బీజేపీలో చేరటం వారికి ఊతమిచ్చింది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పరస్పరం విమర్శించుకునే క్రమంలో బీజేపీ ప్రమాదాన్ని విస్మరించారు. వివాదాస్పదమైన 'భాగ్యలక్ష్మి ఆలయం'చుట్టూ చర్చ నడిపేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. కాంగ్రెసు నాయకులు ఆ బుట్టలో పడుతున్నారు. కొంతకాలం బీఆర్ఎస్ నాయకత్వం కేంద్రంలో మోడీ ప్రభుత్వంతో లాలూచీ కుస్తీ నడిపింది. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ నాయకత్వం చేసిన ప్రయత్నాలు, మునుగోడులో బీజేపీ ఎత్తుగల గురించి, బీఆర్ఎస్ నాయకత్వం ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించలేదు. ఇవన్నీ బీజేపీ వాడుకోగల్గింది. వీటినుంచి కాంగ్రెసు పాలకులు పాఠం నేర్చుకోవాలి. ప్రతిపక్ష పాత్ర పోషించవల్సిన బీఆర్ఎస్, రానున్న కాలంలో ఈ సున్నిత పరిస్థితులలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఈ రెండు పార్టీలు రాజ్యాంగ విలువలైన ప్రజా స్వామ్యం, లౌకిక విధానం మీద నికరమైన వైఖరి ప్రదర్శించలేదు. వాటి స్వభావ రీత్యానే అవకాశవాదం ప్రదర్శించాయి. తమ పార్టీ శ్రేణులను ఈ విధానాల ప్రాతిపదికన నిలబెట్టి, పోరాడలేదు. డబ్బు, గెలుపు, ఫిరాయింపులకే పెద్ద పీట వేసారు. ఇవే ధోరణులు తెలంగాణ ప్రజల ముందు సవాలుగా నిలవబోతున్నాయి. వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక, సామాజిక శక్తులకు సవాళ్లు విసరబోతున్నాయి. ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతూనే రాజకీయంగా మతోన్మాదశక్తులను నిలువరించటం కర్తవ్యం. ఈ సంక్లిష్ట సమరానికి సిద్ధం కావల్సిందే!

ఆరు నెలల్లో రేవంత్ ప్రభుత్వం పడిపోతుందని బీజేపీ శాసనసభ్యులు రాజాసింగ్ ప్రకటించారు. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడబోతున్నదనీ, బీజేపీ కీలక పాత్ర పోషిస్తుందనీ బీజేపీ నేత రఘునందన్‌రావు, తన ఎన్నికల క్యాంపెయిన్‌లో చెప్పారు. రేవంత్‌కన్నా కేసీఆర్ మెరుగైన నాయకుడని ధర్మపురి అరవింద్ అన్నారు. అంటే కాంగ్రెస్‌కన్నా బీఆర్ఎస్ మెరుగైందనీ, బీఆర్ఎస్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామనీ చెప్పటమే కదా! కానీ ఫలితాలు వారికి ఆశాభంగం కలిగించాయి. తట్టుకోలేకపోతున్నారు. అయినా కాంగ్రెస్‌లో చిచ్చుపెట్టే అవకాశాలు రాకపోతాయా అన్నట్టు ఆలోచిస్తున్నారు. అందుకే రాజాసింగ్ మనసులో మాట బయటపెట్టేసారు. శాసన సభ్యులుగా ప్రమాణ స్వీకారం నుంచే మతోన్మాదాన్ని ప్రదర్శించటం మొదలుపెట్టారు. ప్రొటెం స్పీకర్ ముస్లిం కాబట్టి, ఆయన ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయలేమని బాయ్‌కాట్ చేసారు.

కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న విద్వేష, మత రాజకీయాలతో దేశ ప్రజల జీవితాలు సంక్షోభంలో కూరుకుపోయాయి. దేశ ప్రగతి అన్ని రంగాలలో తిరోగమిస్తోంది. అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాల్సిన బీజేపీ సంఘ్ పరివార్ సహకారంతో విద్వేషాలను ప్రేరేపిస్తోంది. ముస్లింలు, క్రిస్టియన్లు, దళితులు, కమ్యూనిస్టుల పట్ల వ్యతిరేక ధోరణితో ముందుకు సాగుతోంది. హిందుత్వ ప్రయోగశాల అయిన గుజరాత్‌లో నరేంద్రమోడీ నాయకత్వంలో జరిగిన గోద్రా మారణకాండతో మనోధైర్యం కోల్పోయిన ముస్లిం సమాజాన్ని మరింతగా అణచివేసేందుకు, గోవధ నిషేధం, సీఏఏ, ఎన్నార్సీ, ట్రిపుల్ తలాక్, కాశ్మీర్ విభజన లాంటి చట్టాలను అధికార బలంతో తీసుకొచ్చి వారి మనుగడే ప్రశ్నార్థకంగా చేసింది. దళితులపై దమనకాండలు, అత్యాచారాలకు అంతే లేకుండాపోయింది. మణిపూర్ లాంటి ఘటనలు దేశాన్ని అగ్నిగుండంగా మారుస్తున్నాయి.

'భారత్ బచావో'


ఇది ఓవైపు కొనసాగుతుండగానే మరోవైపు, అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు అనుకూలంగా దేశ సంపదలను వాటికి ధారాదత్తం చేసేందుకు బీజేపీ ఆరాటపడుతున్నది. దేశ రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతులు, సైన్యంలో కాంట్రాక్ట్ విధానం లాంటి వాటితో దేశ సార్వభౌమాధికారాన్ని విదేశాలకు దాసోహం చేసింది. వ్యవసాయం, పరిశ్రమలు, బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, ఓడరేవులు(నౌకాశ్రయాలు), విమానాశ్రయాలు, రైల్వేలు, విద్యుత్ రంగం, చమురు రంగం (పెట్రోల్, డీజిల్)లాంటి అనేక ప్రభుత్వరంగ సంస్థలను ఎంపిక చేసుకున్న బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టి ప్రజా సంపదను లూటీ చేస్తోంది. గత పదేండ్ల కాలంలోనే విజయ్ మాల్యా, నీరవ్‌మోదీ, లలిత్‌మోడీ లాంటి వ్యాపారవేత్తలు బ్యాంకుల నుండి అప్పుగా తీసుకొని ఎగగొట్టిన 15 లక్షల కోట్ల రూపాయలను నిరర్థక ఆస్తులు రద్దు (ఎన్.పి.ఏ.) పేరిట మాఫీ చేసి వారు దేశాన్ని వదిలి వెళ్లేందుకు సహకరించింది.

కరోనా లాంటి విపత్తు మనదేశ ఆరోగ్య రంగపు అధ్వాన్నస్థితిని తెలియ చెప్పగా, దాని తదనంతర పరిణామాల కారణంగా లక్షలాది కంపెనీలు మూతపడ్డాయి. కోట్లాది సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, ఉద్యోగులు ఉపాధిని కోల్పోయారు. దేశంలో నిరుద్యోగం తీవ్రత 45 ఏండ్ల స్థాయికి పడిపోయి విలయతాండవం చేస్తున్నది. అన్ని రకాల మానవాభివృద్ధి సూచికలు పాతాళంలో ఉన్న నేటి సంక్షోభ సమయంలో, ఒక బాధ్యతాయుత ప్రభుత్వంగా, వీటి పరిష్కారాలకు కృషి చేయకుండా విద్వేష రాజకీయాలను ప్రోత్సహిస్తోంది. పుక్కిటి పురాణాలు వల్లెవేస్తూ, వెయ్యేళ్ళ కిందటి ఘనమైన గతాన్ని ఊదరగొడుతోంది. ఒక మతాన్ని బూచిగా చూపి భావోద్వేగాల్ని రెచ్చగొడుతూ ప్రభుత్వ వైఫల్యాలను చర్చకు రాకుండా పక్కదారి పట్టిస్తుంది. దీన్ని దేశ ప్రజలు గమనించాలి.

"ప్రతిపక్ష ముక్త్ భారత్" అంటూ, ప్రతిపక్ష పార్టీల సభ్యులను ప్రలోభపెట్టి ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చి వేయడం, బీజేపీయేతర ప్రభుత్వాలను ఈడీ, సీబీఐ లాంటి రాజ్యాంగ సంస్థలను ఉసిగొలుపుతూ, కేసులతో లొంగదీసుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తుంది. అన్ని వ్యవస్థలను హిందుత్వ భావజాలంతో నింపివేసి, 'ఒక దేశం- ఒకే పార్టీ" ఉండాలనే నియంతృత్వ ధోరణితో సాగుతోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మూడవసారి అధికారంలోకి రావడానికి పావులు కదుపుతోంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్నే మార్చివేసి, మనుస్మృతి స్ఫూర్తిగా, హిందూ రాష్ట్రంగా ప్రకటించేందుకు "హిందూ రాష్ట్ర సంవిధాన్ నిర్మాణ సంస్థ' ద్వారా ముసాయిదాను సిద్ధం చేస్తోంది. దీన్ని విద్యార్థులు,మేధావులు, కార్మికులు, కర్షకులు అడ్డుకుని భారత్‌ను రక్షించాలి. లేదంటే ముమ్ముందు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనేది పుస్తకాల్లోనూ కనిపించవు.

- జంజర్ల రమేష్ బాబు

'మిచౌంగ్' పంట నష్టానికి పరిహారమేది?



సారంపల్లి మల్లారెడ్డి
9490098666

2023 డిసెంబర్ 4-7 వరకు వచ్చిన మిచౌంగ్ తుఫాన్ వల్ల రాష్ట్రంలో ప్రభుత్వ అంచనాల ప్రకారం 4.70 లక్షల ఎకరాల్లో రెండోసారి పంటలకు నష్టం వాటిల్లినట్లు నివేదిక ఇచ్చారు. కోతకు వచ్చిన వరి 45 శాతం మాత్రమే కోశారు. మిగిలిన పంట తడిసి ముద్దైంది. పత్తి ఒక విడత తీసినప్పటికీ మెజార్టీ పంట తీయకుండా దెబ్బతిన్నది. ఎకరాకు 3-4 క్వింటాళ్లు దిగుబడి వస్తుందన్న నమ్మకం లేదు. మిరప, మొక్కజొన్న పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఖమ్మం, భద్రాచలం, కరీంనగర్ మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, ములుగు, భూపాలపల్లి, గద్వాల జిల్లాల్లో నష్టం పెద్ద ఎత్తున జరిగింది. వాతావరణ రీత్యా మిరపకు నల్ల తామర తెగులు సోకి ఒకవైపున దిగుబడి తగ్గగా మరో వైపున తుపాన్ వల్ల నష్టం వాటిల్లింది. 1.50 లక్షల మంది రైతులు నష్టపోయారు. 2003 మొదటిసారి వానాకాలం పంటలు వేసిన తరువాత జూలై 23-30 మధ్య పడిన ఆకాల వర్షాలకు 12 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 49 మంది మరణించారు. రెండుసార్లు వచ్చిన ప్రకృతి వైపరీత్యాల వల్ల రూ.7,500 కోట్ల నష్టం వాటిల్లింది. గత రాష్ట్ర ప్రభుత్వం 2.20 లక్షల ఎకరాలకు, ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం చెల్లిస్తానని ఆగస్టులో ప్రకటించి అమలు చేయలేదు. పంటల పరిహారం చెల్లించాలని హైకోర్టులో వేసిన కేసులో రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు సహయం పంపిణీ చేస్తానని ప్రకటించింది. 25 వేల మంది వరద బాధితులు సర్వం కోల్పొయి దివాళా తీశారు. చివరికి కేంద్ర 15వ ఆర్థిక సంఘం 2022-23లో రూ.629 కోట్లు, 2023-24లో రూ.660 కోట్లు ప్రకృతి వైపరీత్యాల సహాయం కింద ప్రకటించింది. ఆ నిధులు కూడా నష్టపోయిన రైతులకు పంపిణీ చేయలేదు. కోసిన పంటలు మార్కెట్‌కు తెచ్చిన సందర్భంలో తగు రక్షణ లేక మార్కెట్‌లలోనే తడిసి నీటిలో కొట్టుకుపోతున్నాయి. ప్రతి మండలంలో ఐకెపి సెంటర్లు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వం గత పదేండ్లలో ఏ ఒక్క మార్కెట్‌లో రైతులకు వర్షాల వచ్చు నష్టాన్ని అధిగమించడానికి ఏర్పాటు చేయలేదు. కనీసం గోదాంల సౌకర్యం కూడా లేదు.

రాష్ట్రంలో 6,055 ధాన్యం ఐకెపి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కోటి టన్నులు సేకరించడానికి 2023 వానాకాల పంటలకు లక్ష్యం నిర్ణయించారు. మార్కెట్‌కు వచ్చిన ధాన్యం చాలా వరకు రైతులు నష్టపోయారు. ఇంత వరకు 30.01 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా ఐకెపి 1,053 కేంద్రాలు తెరవాల్సి ఉంది. కనీసం మార్కెట్‌లలో టార్పాలిన్, గోదాం సౌకర్యాలు లేకపోవడం వల్ల ఏటా మార్కెట్‌కు వచ్చిన వ్యవసాయోత్పత్తులు 30 శాతం వరకు నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాలలో ఐకెపి, మార్కెట్ కమిటీ, మిల్లర్లు కలిసి ఏటా రూ.500 కోట్ల కుంభకోణం సాగించి రైతులను దివాళా తీయిస్తున్నారు. అశాస్త్రీయంగా తేమ శాతం ఎక్కువ ఉన్నదని చెప్పడం, తూకం వేసిన తరువాత తగ్గించడం, రైతులకు బిల్లులు ఇచ్చిన తరువాత అందులో కొంత మొత్తాన్ని బ్యాంకులో వేయకుండా మిల్లర్లు దక్కించుకోవడం జరుగుతున్నది. గతంలో ఈ కుంభకోణంపై ఎన్ని ఫిర్యాదులు చేసిన ప్రభుత్వంలో ఏ మాత్రం కదలిక రాలేదు. డిసెంబర్ 3న జరిగిన ఎన్నికల్లో గత ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చింది. ప్రమాణ స్వీకారాలు జరుగుతుండగానే తుఫాన్ రావడం, పంటలకు నష్టం వాటిల్లడం జరిగింది. గత పదేండ్లలో కరువు వల్ల రూ.14,812 కోట్లు, వరదల వల్ల రూ.18,700 కోట్లు మొత్తం రూ.33,512 కోట్లు రైతులు నష్టపోయారు. కేంద్ర ఆర్థిక సంఘం ఇచ్చిన నిధుల్లో రూ.4,133 కోట్లు మాత్రమే పంపిణీ చేయడం జరిగింది. రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏటా జరుగుతున్న నష్టాలకు రైతులు బలవుతున్నారు. ముఖ్యంగా, కౌలు రైతులు, వాస్తవ సాగుదారులు ఎక్కువ నష్టాలు అనుభవిస్తున్నారు.

అమలు కానీ పంటల బీమా పథకం

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అమలు జరుపుతున్న ఫసల్ బీమా పథకం నుండి రాష్ట్ర ప్రభుత్వం 2000 సంవత్సరంలో ఉపసంహరించుకుంది. తిరిగి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయలేదు. ఫసల్ బీమా నుండి ఉపసంహరించుకున్న ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి పరిహారాలు చెల్లిస్తున్నాయి. ప్రతి దేశంలో పంటలబీమా పథకం అమలు జరుగుతున్నది. కానీ, తెలంగాణ రాష్ట్రంలో రైతులకు పంటల బీమా పథకంగానీ, ప్రకృతి వైపరీత్యాల పరిహారం గానీ అందడం లేదు. అమెరికాలో రైతులకు 8 రకాల రాయితీలు ఇస్తున్నారు. పంటలబీమా, ప్రీమియం ప్రభుత్వమే చెల్లించడం గాక పరిహారం కూడా ప్రభుత్వం చెల్లిస్తున్నది.

అమెరికా వ్యవసాయ రంగానికి ఇస్తున్న రాయితీలు

1) 100 రకాల పంటలకు బీమా - ప్రభుత్వం 60 శాతం ప్రీమియం, 50 శాతం బీమా పరిహారం చెల్లిస్తుంది
2) నిర్ణయించిన ఆదాయం తగ్గితే .... ప్రభుత్వం భరిస్తుంది.
3) నిర్ణయించిన ధరలు తగ్గితే ..... ప్రభుత్వం భరిస్తుంది
4) రక్షణ చర్యలు అనగా పంట వేయక ఉత్పత్తి తగ్గితే పరిహారం ఇస్తారు
5) ప్రకృతి వైపరీత్యాల పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది.
6) పంటల ధరలు తగ్గితే రుణ సౌకర్యం కల్పిస్తారు
7) పరిశోధనలకు నగదు నిధుల సహాయం కల్పిస్తారు
8) ఎగుమతి సబ్సిడీ ఎగుమతిదారులకు ఇస్తారు

(ఈ సబ్సిడీ వలన రైతుల పంటలకు అదనపు ధర చెల్లించబడుతుంది)

ఈక్విడార్, స్విట్జర్లాండ్ దేశాలు ప్రకృతి వైపరీత్యాల నివారణలో ప్రపంచంలో నాయకులుగా ఉన్నారు. చైనా, జపాన్, అమెరికా చివరికి పాకిస్థాన్ దేశాలు కూడా నష్టపోయిన రైతులకు పరిహారాలు చెల్లిస్తున్నాయి. ఆ దేశాలు తమ బడ్జెట్లలో 6-7 శాతం కేటాయించగా, భారత దేశం 2.45 శాతం మాత్రమే కేటాయింపులు చేస్తున్నది. 15వ ఫైనాన్స్ కమిషన్ 2020-26 సంవత్సరాలకు రూ.1.45 లక్షల కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులలో పది శాతం రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్ భరించాలి. భరించలేని రాష్ట్రాలు ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోలేవు. వ్యవసాయోత్పత్తులేగాక హార్టికల్చర్ పంటలు తోటలు, కూరగాయల పంటలు కూడా ప్రతియేటా దెబ్బతింటున్నాయి. ఈ నష్టాల వల్ల ఉల్లి, టమాట ధరలు ఒక్కోసారి కిలో రూ.100 వరకు పెరుగుతున్నాయి. బంగాళాఖాతం, ఆరేబియా సముద్రం నుండి తుఫాన్‌లు ప్రతియేటా క్రమం తప్పకుండా వస్తున్నాయి. అందులో పంటలు వేసిన తరువాత, కోతలకు వచ్చినప్పుడు తుఫాన్‌ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు తెలంగాణలో ప్రత్యేకంగా రాళ్ళ వర్షాల వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. ప్రతియేటా వస్తున్న అధిక వర్షాల వల్ల జరుగుతున్న నష్టాలకు కేంద్రం గానీ, రాష్ట్రాలుగానీ, నివారణ చర్యలు చేపట్టడం లేదు. చివరికి జరిగిన నష్టాన్ని గణాంకాలు సేకరించి నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడం లేదు. ప్రధానంగా కౌలు రైతులు, వాస్తవ సాగుదార్లు పెద్దఎత్తున నష్టపోతున్నారు. ఎన్నికల సందర్భాంగా ప్రకటించిన మ్యానిఫెస్టోలలో అన్ని పార్టీలు పంటల బీమా అమలు చేస్తామని ప్రకటించారు. కానీ, ఇంతవరకు ఏ ప్రభుత్వం పంటల బీమాను అమలు చేయలేదు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పంటలు నష్టపోతే పటిష్ఠమైన పంటల బీమా పథకాన్ని అమలు చేస్తానని ప్రకటించింది. బీమా పథకంతోపాటు ప్రకృతి వైపరీత్యాల పరిహారాన్ని 'ఇన్‌పుట్ సబ్సిడి' చెల్లించాలి. రుణాలను మూడేండ్లకు రీ-షెడ్యూల్ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి.



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అమలు జరుపుతున్న ఫసల్‌బీమా పథకం నుండి రాష్ట్ర ప్రభుత్వం 2000 సంవత్సరంలో ఉపసంహరించుకుంది. తిరిగి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయలేదు. ఫసల్ బీమా నుండి ఉపసంహరించుకున్న ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి పరిహారాలు చెల్లిస్తున్నాయి. ప్రతి దేశంలో పంటలబీమా పథకం అమలు జరుగుతున్నది. కానీ, తెలంగాణ రాష్ట్రంలో రైతులకు పంటల బీమా పథకంగానీ, ప్రకృతి వైపరీత్యాల పరిహారం గానీ అందడం లేదు.

సహజంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ మేరకు కేంద్ర బృందాలు వచ్చి నష్టాన్ని అంచనా వేసి ఆర్థిక సంఘం కేటాయింపులకు అదనంగా మరి కొన్ని నిధులు మంజూరీ చేయుటకు కేంద్రానికి రికమండేషన్ చేస్తాయి. 2015-16లో కేంద్రం నుండి రాష్ట్రానికి అదనంగా రూ. 791 కోట్లు వచ్చాయి. అంతేకానీ తెలంగాణలో గత దశాబ్ద కాలంగా కేంద్రం నుండి ఎలాంటి సహాయం అందలేదు. పంటలు నష్టపోయిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వాల విధానంలో మార్పు రాలేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి హుడా కమిషన్ నిర్ణయం మేరకు పరిహారాలు చెల్లించాలి. రాష్ట్రంతోపాటు కేంద్రం కూడా బడ్జెట్‌ల నుండి నిధులను కేటాయించి రైతులను ఆదుకోవాలి. వర్షాల వల్ల పంటల కోత కాలంలో నష్టాలు జరుగకుండా మార్కెట్‌లలో తగు రక్షణ చర్యలు చేపట్టాలి. తగినన్ని గోదాంలను నిర్మించడం గానీ, ప్రయివేట్ గోదాంలను కిరాయికి తీసుకొని రైతులు నష్టపోకుండా ప్రణాళిక రూపొందించాలి. పంటలబీమా పథకాన్ని, ప్రకృతి వైపరీత్యాల పరిహారాన్ని నష్టపోయిన రైతులకు చెల్లించాలి. ఆ విధంగా రైతులకు రక్షణ కల్పించాలి.

జమ్మూ కాశ్మీర్ బిల్లులకు రాజ్యసభ ఆమోదం

అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్

నవతెలంగాణ'-న్యూఢిల్లీ బ్యూరో





జమ్మూ కాశ్మీర్ రిజర్వేషన్ సవరణ బిల్లు, జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులను రాజ్యసభ ఆమోదించింది. లోక్‌సభ ఆమోదించిన జమ్మూ కాశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు, 2023, జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లును సోమవారం రాజ్యసభలో కేంద్ర హౌం శాఖ మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. దీనిపై జరిగిన చర్చలో వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి అమిత్ షా సమాధానం తరువాత బిల్లులు ఆమోదించారు. కాంగ్రెస్, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని ఓబీసీ వ్యతిరేకి అంటూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ రాజ్యసభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. అనంతరం మూజువాణి ఓటుతో రెండు బిల్లులను ఆమోదించుకున్నారు. కేంద్ర హౌంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ ఆగస్టు 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసే రాష్ట్రపతి అధికారాన్ని సుప్రీంకోర్టు సమర్థించినప్పటి నుంచి ఇది ఒక మైలురాయని అన్నారు. ఆర్టికల్ 370 తాత్కాలిక చర్య అని సుప్రీంకోర్టు గుర్తించిందని అన్నారు. తగిన సమయంలో రాష్ట్ర హౌదాను పునరుద్ధరిస్తామని, తాను పార్లమెంటులో చెప్పానని, సుప్రీంకోర్టు కూడా తన తీర్పులో తన వైఖరిని అంగీకరించిందని పేర్కొన్నారు. "గుజరాత్, రాజస్థాన్‌లకు పాకిస్తాన్‌తో సరిహద్దులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, అసోం మొదలైన రాష్ట్రాల్లో కాశ్మీర్ కంటే ఎక్కువ మంది ముస్లింలు ఉన్నారు. వేర్పాటువాదం వెనుక కారణాలు ఇవే కాదు. ఆర్టికల్ 370. కాశ్మీర్‌లో వేర్పాటువాదం ఉగ్రవాదానికి దారితీసింది" అని ఆయన అన్నారు. "జమ్మూలో ఇప్పుడు 43 సీట్లు (37 నుంచి), కాశ్మీర్‌లో ఇప్పుడు 47 సీట్లు (46 నుంచి). పీఓకెలోని ఇరవై నాలుగు సీట్లు రిజర్వ్‌లో చేశాం. ఎందుకంటే ఇది దేశంలో భాగమని మేము ఇప్పటికీ నమ్ముతున్నాము" అని అన్నారు. తమ ప్రభుత్వం స్థానికుల జీవితాలను మెరుగుపర్చిందని అన్నారు. కాశ్మీర్ ప్రజలు ఇప్పుడు ప్రజాస్వామ్యం, అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారని, వేర్పాటువాద ప్రవర్తనలను, ప్రాచుర్యం పొందాలనుకునే వారిని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. యువత చేతుల్లో రాళ్ల పోయి, ల్యాప్‌టాప్‌లు వచ్చాయని తెలిపారు. వైసీపీ ఎంపీ వి.విజయ సాయి రెడ్డి మాట్లాడుతూ కాశ్మీర్ సమస్య పరిష్కారానికి అడ్డుపడుతున్నందుకు నెహ్రూవియన్ సూడో సెక్యులరిజాన్ని విమర్శిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపాలన్నది తమ ఉద్దేశమని ఆయన తెలిపారు. ఆర్టికల్ 370, పాకిస్తాన్‌తో రెండోయుద్ధంలో కాశ్మీర్‌ను తిరిగి పొందడంలో వైఫల్యం ముఖ్యమైన తప్పిదాలుగా పేర్కొన్నారు. పరిస్థితిని సరిదిద్దడానికి బంగ్లాదేశ్ యుద్ధం తరువాత సిమ్లా డిక్లరేషన్‌పై సంతకం చేసే సమయంలో అవకాశం కోల్పోయిందని ఆయన సూచించారు. ఎన్నికలు జరగని పీఓకెలోని 24 స్థానాలకు అక్కడి సభ్యులను నామినేట్ చేయాలని ప్రతిపాదించారు. వలసదారులకు నగదు ఉపశమనాన్ని పెంచాలని ఆయన అభ్యర్థించారు. ఆర్టికల్ 370 రద్దు చేసినప్పటి నుండి జమ్మూ కాశ్మీర్ గణనీయమైన పురోగతిని సాధించిందని ఆయన ప్రశంసించారు.

కాశ్మీర్ భారతదేశంలో భాగం కావడానికి నెహ్రూ కారణమని కాంగ్రెస్ ఎంపీ సయ్యద్ నాసిర్ హుస్సేన్ తెలిపారు. వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి నెహ్రూపై చేసిన వ్యాఖ్యలపై నాసిర్ హుస్సేన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. విజయసాయి రెడ్డికి నెహ్రూ, పటేల్ ధృక్కోణాలపై అవగాహన లేదన్నారు. కాంగ్రెస్ ఎంపీ వివేక్ తంఖా మాట్లాడుతూ ఈ సమస్య గురించి మాట్లాడటానికి ఒక కాశ్మీరీ పండిట్‌కు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హౌదాను తొలగించారని, 2024 ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించాలని కోర్టు వ్యాఖ్యానించిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతంలో విద్యుత్ కొరతతో సహా అనేక సమస్యలు ఉన్నాయని, అక్కడి వ్యక్తులు కేంద్ర పాలిత ప్రాంత ప్రయోజనాలను పొందడం లేదని ఆయన తెలిపారు. జమ్మూ కాశ్మీర్ సమస్యల గురించి కొంచెం ఆలోచించండి అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదం నిర్మూలించబడిందా? అని ప్రశ్నించారు

సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లో రాష్ట్ర హౌదాను తొలగించాల్సిన అనవసరమని అన్నారు. ఫెడరలిజం సూత్రాలకు విఘాతం కలిగిస్తోందని, ఈ చర్య అవసరమని ఆయన ప్రశ్నించారు.ఈ ప్రాంతం స్వయంప్రతిపత్తి, దేశంలోని మొత్తం సమాఖ్య పాలనపై అటువంటి నిర్ణయం ప్రభావం గురించి అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అప్పట్లో నెహ్రూ లేకపోతే ఈరోజు జమ్మూకాశ్మీర్‌పై చర్చ జరిగేది కాదన్నారు. మీడియాను ప్రభుత్వం నియంత్రిస్తోందని మరో సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ అన్నారు.

సీపీఐ ఎంపీ పి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ కాశ్మీర్‌లో బీజేపీ స్వయం ప్రతిపత్తి రాజ్యాంగంలా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్‌సీపీ ఎంపీ ఫౌజియా ఖాన్ మాట్లాడుతూ మిలిటెన్సీ కాశ్మీర్ అందాన్ని తినేసే క్యాన్సర్ అని అన్నారు. డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిధిలో రాష్ట్ర హక్కులను అమలు చేయాలని కోరారు. లోక్‌సభ ఎన్నికలతోనే జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని ఆప్ ఎంపీ సంజయ్ అరోరా కోరారు. పంజాబీ ప్రజలను, ముఖ్యంగా హిందూ పండిట్‌ల మాదిరిగానే కష్టాలను ఎదుర్కొన్న సిక్కులను సమానంగా పరిగణించాలని కోరారు.

బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేది మాట్లాడుతూ కాశ్మీర్‌లో డీలిమిటేషన్, నివాసం, అభివృద్ధి అనే మూడు సమస్యలు ఉన్నాయని అన్నారు. బీజేపీ ఎంపీ సుశీల్ కుమార్ మోడీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇతర వెనుకబడిన తరగతులకు వ్యతిరేకమని, మోడీ ప్రభుత్వం అన్ని కులాల వారికి సమాన అవకాశాలు కల్పించిందని అన్నారు.

రైతుబంధు ఇచ్చేయండి

(మొదటిపేజీ తరువాయి)

అమల్లోసిన రైతుబంధు కిందే నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంబంధిత నిధులు ఇప్పటికే ట్రెజరీల్లో ఉన్నందున వెంటనే వాటిని రైతుల ఖాతాల్లో వేయాలని సూచించారు. అన్నదాతలకు రూ.2 లక్షల రుణ మాఫీపై కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వ్యవసాయ శాఖపై సీఎం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దాదాపు మూడు గంటలపాటు నిర్వహించిన ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ, సంబంధిత విభాగాల పనితీరు, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలుపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని రైతులకు రెండు లక్షల మేరకు రుణ మాఫీ చేసేందుకు తగు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుతం హైదరాబాద్ బేగంపేటలోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌ను ఇకనుండి 'ప్రజావాణి'గా పిలవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ఇక నుంచి ప్రతీ మంగళ, శుక్ర వారాల్లో రెండు రోజులపాటు ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని ప్రకటించారు.

ఉదయం 10 గంటలలోపు ప్రజాభవన్‌కు చేరుకున్న వారికి ప్రజావాణిలో అవకాశం కల్పించాలని సూచించారు. వికలాంగులు, మహిళలకు ప్రత్యేక క్యూ-లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ చెలామణిపై ఉక్కుపాదం.. : సీఎం రేవంత్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



రాష్ట్రంలో మాదక ద్రవ్యాల చెలామణి, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నార్కోటిక్స్ కంట్రోల్ అంశంపై మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరోకు పూర్తి స్థాయి డైరెక్టర్‌ను నియమించడంతోపాటు ఆ విభాగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. అందుకు కావాల్సిన నిధులు,వనరులు, ఇతర సౌకర్యాలను సమకూర్చాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల విక్రయం, చెలామణి నిరోధానికి అత్యంత ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. గ్రే హౌండ్స్, ఆక్టోపస్ మాదిరిగా టీ.ఎస్.నాబ్‌ను తీర్చిదిద్దాలని అన్నారు. సమీక్షా సమావేశంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ రవి గుప్తా, ఇంటిలిజెన్స్ విభాగం అదనపు డీజీ శివధర్‌రెడ్డి, సీఎంవో కార్యదర్శి శేషాద్రితోపాటు పోలీస్, ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ, ఔషధ నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

ఐఏవీహెచ్‌ఎంలో పాల్గొన్న ఆర్మీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

హైదరాబాద్ : ఇండియన్ ఆర్మీ వెటరన్స్ హాఫ్ మారథాన్ (ఐఏవీహెచ్‌ఎం)లో సికింద్రాబాద్ ఆర్కేపురంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో గల 1 ఈఎంఈ సెంటర్ మిల్కాసింగ్ స్టేడియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ప్రదర్శన కనబర్చి పాఠశాలకు మెడల్స్ తీసుకొచ్చారు. 5 కిలోమీటర్ల విభాగంలో ముగ్గురు బాలురు(నవనీత్, అలోక్, శివ సుందర్), ఒక బాలిక (సాహిత్య వర్మ), 3 కిలోమీటర్ల విభాగంలో ఒక బాలుడు(సుబ్రమణ్యమ్), ఇద్దరు బాలికలు (మధు, రిషికా) పతకాలు పొందారు.

మేడారం జాతరను ఘనంగా నిర్వహించాలి

గిరిజన సంక్షేమ శాఖలో సమీక్షించిన మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న మేడారం జాతరను ఘనంగా నిర్వహించాలనీ, భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలిచ్చారు. సోమవారం హైదరాబాద్ లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతరలో పారిశుధ్యం, రహదారులు, విద్యుత్తు, తాగునీటి లభ్యత, స్నానాల ఏర్పాట్లు, భక్తుల వసతులు తదితర అంశాలవారీగా సంబంధిత అధికారులతో చర్చించారు. కోయ గిరిజన ఇలవేల్పుల సమ్మేళనం ఈ సారి జాతర సమయంలోనే జరిగేటట్టు చూడాలనీ, తద్వారా భక్తులకు గిరిజన సాంస్కృతిక వైభవం గురించి బాగా తెలుస్తుందని చెప్పారు. మేడారం జాతరకు జాతీయ పండుగ హోదాకోసం కేంద్ర ప్రభుత్వానికి మరో సారి ప్రతిపాదనలు పంపుతామనీ, రాష్ట్ర బడ్జెట్‌కు కేంద్రం నిధులు తోడైతే.. జాతరను మరింత ఘనంగా నిర్వహించు కోవచ్చు నన్నారు. వచ్చే వారం ఏటూరునాగారంలోని ఐటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహించి జాతర పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ తన తల్లివంటిదనీ, శాఖ ఉద్యోగులు తనను సోదరిలా భావించి తమ సమస్యలను ఎప్పుడైనా చెప్పుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చొంగ్తు సమన్వయం చేయగా శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్ శంకర్, ట్రైకార్ జీఎం శంకర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అధికారం శాశ్వతం కాదు

- కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలి : బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ కు అధికారం శాశ్వతం కాదని మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ తెలిపారు. టీపీసీసీ అధ్యక్షునిగా కూడా కొనసాగుతున్న సీఎం రేవంత్ రెడ్డి తమ కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలని ఆయన సూచిచారు. సోమవారం తెలంగాణ భవన్ లో మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్ ,గువ్వల బాలరాజుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారపక్షం మారినంత మాత్రాన శిలా ఫలకాలు తొలగించడం సబబు కాదని హితవు పలికారు.

రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని తెలిపారు.

శిలా ఫలకాలు ధ్వంసం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలనీ, వాటి స్థానంలో కొత్తవి వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులు ప్రజల ఆస్తి అని గుర్తుచేశారు. ప్రభుత్వం మంచి చేస్తే అభినందిస్తామనీ, చెడు చేస్తే నిలదీస్తామని స్పష్టం చేశారు. ఇందిరా గాంధీ సమయంలో ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెసుకు ప్రజలిచ్చిన తీర్పును మర్చిపోవద్దని సూచించారు. ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

రద్దు సబబే..

(మొదటిపేజీ తరువాయి)

ఉండవని తెలిపింది. జమ్మూకాశ్మీర్ నుండి లఢక్‌ను వేరు చేసి కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలన్న నిర్ణయాన్ని కూడా సుప్రీంకోర్టు సమర్థించింది.

రాజ్యాంగంలోని నిబంధనలను అమలు చేయడానికి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి అవసరం లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. ఏదైనా ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చవచ్చా లేదా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానమేమీ లేదని వ్యాఖ్యానించింది. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని, వచ్చే సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీ లోగా ఎన్నికలు నిర్వహించాలని కేంద్రాన్ని ఆదేశించింది.

ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ 2019 ఆగస్టు ఐదవ తేదీన పార్లమెంట్ నిర్ణయం తీసుకుంది. దీనిని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో 23 పిటిషన్లు దాఖలు య్యాయి. వీటిపై ధర్మాసనం ఆగస్టు 2 నుండి సుదీర్ఘంగా విచారణ జరిపింది. సెప్టెంబర్ ఐదున తీర్పున రిజర్వ్ చేసిన న్యాయస్థానం సోమవారం దానిని వెలువరించింది.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 62,130	▼	220
22 క్యారెట్లు	- 56,950	▼	200
కిలో వెండి	- 77,800	▼	200



చికెన్ ధరలు హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 75
రిటైల్ (లైవ్)	రూ. 97
స్కిన్‌తో	రూ. 141
స్కిన్‌లెస్	రూ. 160

కాళేశ్వరంపై విచారణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుపై విచారణ చేస్తామని రాష్ట్ర భారీ, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఆ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలతో సమగ్ర నివేదికను సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. త్వరలోనే మేడిగడ్డను సందర్శిస్తాననీ, అందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని భారీ నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ రాష్ట్ర కార్యాలయం జలసౌధలో సంబంధిత శాఖపై సమీక్ష చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు, కృష్ణా జలాలు, పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా, చెరువుల నిర్వహణ తదితర అంశాలపై ఉన్నతాధికారులతో పూర్తిస్థాయిలో దాదాపు గంటన్నరపాటు చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం తీవ్రమైన అంశమని వ్యాఖ్యానించారు. నిర్మాణం చేపట్టిన ఏజెన్సీని, అధికారులు తన పర్యటనలో ఉండేలా చూడాలని ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్‌ను ఆదేశించారు. వచ్చేవారం నుంచి ప్రతి ప్రాజెక్టుపై విడివిడిగా ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. మేడిగడ్డను ఎవరు నిర్మించినా, జరిగిన ఘటనలకు బాధ్యత వహించాల్సిందేనని తేల్చి చెప్పారు. ప్రాజెక్టు కట్టిన ఏజెన్సీ, అధికారులు జబాబుదారులని స్పష్టం చేశారు. 'రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు కింద నామమాత్రం కొత్త ఆయకట్టు ఉంది. ఒక్కో ఎకరా సాగుకు అవుతున్న ఖర్చు వివరాలు చెప్పాలని అధికారులను అడిగా..ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనుల పురోగతిపై ఆరా తీశాను..సొరంగం పనుల చేస్తున్న సంస్థకు బిల్లులు బకాయి ఉన్నట్టు తెలిసింది..రాష్ట్రంలోని 40 వేల చెరువుల నిర్వహణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటా' అని చెప్పారు. కృష్ణాజలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటాకోసం కృషిచేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల సైటు మార్చి, పేరు మార్చి, ఖర్చుపెంచినా పాలమూరు-రంగారెడ్డికి ప్రాధాన్యత ఇవ్వలేదని గుర్తు చేశారు. అలాగే తక్కువ ఖర్చుపెడితే పూర్తయ్యే ప్రాజెక్టులు ఎన్నో ఉన్నాయని, వాటిపై కూడా దృష్టిపెడతామని ప్రకటించారు. అమూల్యమైన ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూస్తామని స్పష్టం చేశారు. అనేక రకాల అరోపణలు ఉన్నాయనీ, విచారించి నిగ్గుతేలుస్తామని అన్నారు. రహస్యం, గోప్యం ఉండకూడదనీ, అవినీతి జరగకూడదన్నారు. అందుకే రాతపూర్వక నివేదిక అడిగినట్టు పేర్కొన్నారు. ప్రతిప్రాజెక్టు కొత్తఆయకట్టు లెక్కలు చెప్పాల్సిందేనని అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఆధారంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పోలింగ్ రోజు నాగార్జునసాగర్ డ్యాంపై జరిగిన తంతు అనుమానాస్పదంగా ఉందన్నారు. కాళేశ్వరంపై విచారణ ఉన్నతాధికారులతో చేయిస్తారా ? లేక సీబీడీతోనా అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 'ఇంకా అంతవరకు ఆలోచించలేదనీ, క్యాబినెట్, సీఎంతో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని' చెప్పారు.

ఆ సమాచారమివ్వండి

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై పూర్తి సమాచారం సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీనిపై ప్రత్యేకంగా సమీక్ష చేద్దామన్నారు. సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా ప్రాజెక్టులు ఏలా నిర్మిస్తారు ? నిధులు ఎలా సమీకరించారు ? అని ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు థర్డ్‌పార్టీ చెకింగ్ లేదా ? కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సీడబ్ల్యూసీ అనుమతి ఉందా ? పాత ఆయకట్టును కూడా ఎందుకు కొత్త ఆయకట్టులో కలుపుతున్నారు ? వర్షం వచ్చినప్పుడు నీటిని లిఫ్ట్‌చేయాల్సిన అవసరం లేదు కదా ? నీటిపారుదల శాఖ పారదర్శకంగా, అవినీతికి తావు లేకుండా సమర్థంగా పనిచేయాలి. ఇదివరకు నీటిపారుదలశాఖలో ఏదో జరిగిందని అనుమానాలు ఉన్నాయి, వందేండ్లు ఉండాల్సిన ప్రాజెక్టులు మూడేండ్లకే దెబ్బతినడం ఆందోళనకరం. ఎందుకు అలా జరిగింది ? మంత్రి అధికారులను అడిగారు. దీంతో ఈఎన్సీలు, సీఈలు, ఎస్‌ఈలు తెల్లమొహాలేసినట్టు తెలిసింది. ఒక్క ఈఎన్సీ మురళీధర్ మినహా మరెవరూ జవాబు చెప్పే సాహసం చేయలేకపోయినట్టు సమాచారం. దీంతో ప్రాజెకుల్ల వారీగా పూర్తివివరాలతో సమీక్షకు వస్తామని అధికారులు చెప్పారు.

చెప్పినా రాని స్మితాసభర్వాల్

మాజీ సీఎం కార్యదర్శి, సాగునీటిశాఖ ఇన్‌చార్జీ కార్యదర్శిగా నియమితులైన స్మితాసభర్వాల్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షకు హాజరుకాలేదు. గైర్హాజరుకు ఎలాంటి కారణాలు తెలియజేయలేదు. దీంతో చేసేది లేక ఇంజినీర్ ఇన్ చీఫ్ సి మురళీధర్ జలసౌధ సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్‌ను ఆహ్వానించారు. ఆయన వచ్చే సమయానికి ఈఎన్సీలు, సీఈలు, ఇతర అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలికారు.

వాడీవేడిగా సమీక్ష

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగడంపై మంత్రికి అధికారులు వివరణ ఇచ్చారు. 'మేడిగడ్డ బ్యారేజీ నిర్మానానికి రూ.4600 కోట్లు ఖర్చు చేశాం..అందులోని ఒక పిల్లర్ 1.2 మీటర్లు కుంగడంతో, మరో మూడు పిల్లర్లపై ఆ ప్రభావం పడింది..ముందురోజు సాయంత్రం పిల్లర్ కుంగిన వెంటనే ప్రాజెక్టులో నీటిని తోడేశాం..నీటిని తోడిన తర్వాత పిల్లర్ కుంగడం తగ్గింది" అని అధికారులు మంత్రికి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్ ప్రాజెక్టులపై సమగ్రంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనికి స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇది తీవ్రమైన అంశమనీ, ప్రాజెక్టు సందర్శనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

'అక్కడ ఖర్చు చేసిందెంత ? ఎంత ఆయకట్టుకు నీరిచ్చేందు కు నిర్మాణం జరిగింది ? ఒక్కో ఎకరా సాగుకు అవుతున్న వ్యయమెంత ? అని అధికారులను మంత్రి ప్రశ్నించారు. ఈసమీక్షలో మురళీధర్‌తోపాటు జనరల్ ఈఎన్సీ బి. అనిల్‌కుమార్, కాళేశ్వరం సీఈ వెంకటేశ్వర్లు, సాగునీటిశాఖ సలహాదారు పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విక‌సిత్ భారత్-2047 లక్ష్యం కోసం పనిచేయండి

- విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంపొందించాలి
- వీసీలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికసిత్ భారత్-2047 లక్ష్యానికి అనుగుణంగా విద్యావంతులు, అకడమిక్ నిపుణులు పనిచేయాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కోరారు. నిటి ఆయోగ్, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో వికసిత్ భారత్-2047 వర్క్‌షాప్‌ను నిర్వహించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ వర్క్‌షాప్‌ను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ వికసిత్ భారత్-2047ను ప్రారంభించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆ విజన్‌లో తెలంగాణ, పాండిచ్చేరి ప్రజలు భాగస్వాములవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. దీన్ని అమలు చేయడంపై దృష్టికేంద్రీకరించాలని సూచించారు. కచ్చితంగా అమలు చేయాలనీ, సాకులు చెప్పొద్దని కోరారు. ఆనందంగా చదువు చెప్పే బోధనా పద్ధతులను అనుసరించాలని చెప్పారు. వికసిత్ భారత్-2047లో భాగస్వాములయ్యేలా విద్యార్థులను ప్రోత్సహించాలనీ, వారి ఆలోచనలు ఎంతో ముఖ్యమని విద్యావంతులు, బోధనా సిబ్బందికి సూచించారు. అందరికీ నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ లక్ష్యానికి విద్యార్థులెవరూ దూరం కావొద్దని కోరారు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో నూతన ఆవిష్కరణలు వస్తాయనీ, భారత్ సాధికారత సాధిస్తుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర, ప్రయివేటు విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు, ఐఐటీలు, ఎన్ఐటీలు, ఎయిమ్స్‌కు సంబంధించిన వీసీలు, డైరెక్టర్లు, డీన్లు, బోధనా సిబ్బంది ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఎస్‌కె మహమూద్, వీసీలు డి రవీందర్, టి రమేష్, సిహెచ్ గోపాల్‌రెడ్డి, కట్టా నర్సింహారెడ్డి, కె సీతారామారావు, వి వెంకటరమణ, సురేష్‌బాబు, కవితా దర్యానిరావు, టి కిషన్‌రావు, లక్ష్మీకాంత్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలా ఉన్నారు..!

(మొదటిపేజీ తరువాయి)

తోడ్కోని వచ్చి సాగనంపారు. అలాగే తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేసీఆర్‌ను కలిసి మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. సర్జరీ విజయవంతమైందని డాక్టర్లు తనకు చెప్పినట్టు భట్టి మీడియాతో అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ మాజీ మంత్రులు పి.సబితాఇంద్రారెడ్డి, సత్యవతిరాథోడ్, గంగుల కమలాకర్, చామకూర మల్లారెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు ప్రముఖ సినీనటుడు ప్రకాశ్‌రాజ్, బీఎస్పీ నేత ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, కేసీఆర్‌ను పరామర్శించి, క్షేమసమాచారం తెలుసుకున్నారు. గురువారం రాత్రి ఎర్రవల్లి ఫార్మ్‌హౌజ్ బాత్‌రూంలో జారిపడటంతో కేసీఆర్ ఎడమ తుంటికి తీవ్రగాయమైన సంగతి తెలిసిందే. సోమాజిగూడలోని యశోద ఆస్పత్రి డాక్టర్లు ఆయనకు శుక్రవారం రాత్రి తుంటిమార్పిడికి అపరేషన్ చేశారు. ప్రస్తుతం కేసీఆర్ గత మూడు రోజులుగా ఆస్పత్రిలో ఉంటూ చికిత్స తీసుకుంటున్నారు.

పరామర్శల వెల్లువ

మాజీ సీఎం కేసీఆర్‌కు రాజకీయ నాయకులు, సినిమా పరిశ్రమ నుంచి సోమవారం పరామర్శల వెల్లువ కొనసాగింది. చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను మెగాస్టార్ చిరంజీవి పరామర్శించారు. కేసీఆర్‌ను ఉత్సాహ పరిచే ప్రయత్నం చేశారు. సినిమా పరిశ్రమ పరిస్థితి గురించి చిరంజీవిని అడగ్గా, బాగుందని ఆయన సమాధానమిచ్చారు. కేటీఆర్, కవితతోనూ చిరంజీవి మాట్లాడారు. అలాగే భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్, ఎన్టీవీ చైర్మెన్ నరేన్‌చౌదరి సైతం పరామర్శించినవారిలో ఉన్నారు.

కేటీఆర్‌తో మాట్లాడిన గవర్నర్

కేసీఆర్ ఆరోగ్యం గురించి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ కేటీఆర్‌తో ఫోన్లో మాట్లాడారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రొటెంస్పీకర్ ప్రమాణం సందర్భంగా కూడా మాజీ మంత్రి హరీశ్‌రావుతో కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి అడిగితెలుసుకున్నారు.

రేవంతన్న ..మీతో మాట్లాడాలన్నా..

సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి కేసీఆర్‌ను పరామర్శించిన సంగతి తెలిసిందే. ఆస్పత్రి నుంచి వెళ్లిపోతున్న క్రమంలో 'రేవంతన్నా... రేవంతన్నా.. అని ఒక అమ్మాయి గట్టిగానే పిలిచింది. మీతో మాట్లాడాలన్నా ..మీతో మాట్లాడాలన్నా అని రెండుసార్లు అంది. ఆ పిలుపు విన్న సీఎం రేవంత్ అమ్మాయి వైపు వచ్చారు. అప్పటికే ఆస్పత్రితోపాటు ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది ఆ అమ్మాయిని ఆపేశారు. ఆ అమ్మాయి ఉన్న చోటుకి సీఎం వస్తూ 'అక్కడే ఉండు..అక్కడే ఉండు..నేనే వస్తా అంటూ..ఏంటీ ప్రాబ్లమ్' అని పలకరించారు. 'మా తాతయ్యకు ఒక్కరోజే లక్ష రూపాయలు అయిందన్న..కొంచెం చూడండి అని తన గోడును వెళ్లబోసుకుంది. ప్లీజ్ హెల్ప్ చేయండన్నా..ప్లీజ్ అంటూ ఆయన కాళ్లపై పడే ప్రయత్నం చేసింది. అందుకు ఆమె ప్రయత్నాన్ని అడ్డుకుంటూ వెంటనే సీఎం రేవంత్ స్పందించి సమస్యను పరిష్కరించాలంటూ తన సిబ్బందిని ఆదేశించారు. అమ్మాయిని సముదాయించి అక్కడి నుంచి వెళ్లిపోయే వీడియో సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. సీఎం రేవంత్ స్పందన, ఆయన ఉదారత పట్ల నెటిజన్లు హర్షం వ్యక్తం చేశారు.

ఇదేం తీరు..!

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీయేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి. ఆయా రాష్ట్రాలకు నిధులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఇండియా ఫోరం ఎంపీలు సోమవారం రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక దిగ్బంధనాన్ని నిరసిస్తూ కాంగ్రెస్, టీఎంసీ, ఆమ్ ఆద్మీ పార్టీ, ఎస్పీ, జేడీయూ, డీఎంకే, ఆర్జేడీ, ఎన్‌సీపీ, సీపీఐ(ఎం), సీపీఐ, శివసేన (యూబీటీ) తదితర ఇండియా ఫోరం పార్టీల ఎంపీలు సభను వాకౌట్ చేసి ఆందోళన చేపట్టారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభానికి ముందు సోమవారం ఇండియా ఫోరం నేతలు సమావేశమయ్యారు. పార్లమెంట్‌లోని రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో పార్లమెంటు శీతాకాల సమావేశాల వ్యూహాన్ని రూపొందించారు. రాఘవ చడ్డా (ఆప్), ఎలమారం కరీం (సీపీఐ(ఎం), బినయ్ విశ్వం (సీపీఐ), వందనా చౌహాన్ (ఎన్‌సీపీ), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), డెరిక్ ఓబ్రెయిన్, సుదీప్ బందోపాధ్యాయ (టీఎంసీ), తిరుచ్చి శివ, టిఆర్ బాలు (డీఎంకే), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్పీ), మనోజ్ కుమార్ ఝా (ఆర్జేడీ), మహువా మాంఝీ (జేఎంఎం) తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభలో జమ్మూ-కశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు, 2023 , జమ్మూ-కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. ఈ రెండు బిల్లులపై జరిగిన చర్చలో వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

అనంతరం బిల్లులను ఆమోదించారు. మరోవైపు లోక్‌సభలో అనుబంధ డిమాండ్లు, గ్రాంట్స్ పై చర్చ జరిగింది. అయితే చర్చ జరిగినప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, అధికార పార్టీ సభ్యులు లేకపోవడంపై ప్రతిపక్షాలు నిరసించాయి. టీఎంసీ ఎంపీ సౌగత్ రాయ్ మాట్లాడుతూ సభ మొత్తం ఎడారిలా కనిపిస్తోందని, ఇప్పుడు మాట్లాడటం వల్ల ఏమి ఉపయోగమని అన్నారు. "అధికార పక్షం ఉండకపోతే మాట్లాడటం ఎందుకు?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కలవరపరుస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాలకు, మరికొన్ని రాష్ట్రాలకు మంజూరైన ప్రత్యేక హక్కులు కూడా జమ్మూ కాశ్మీర్‌కు లేకుండా పోయాయని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ తీసుకున్న చర్యకు సంబంధించిన తప్పొప్పులను కూడా ఈ తీర్పు పరిశీలించలేదు. పైగా తిరిగి రాష్ట్ర ప్రతిపత్తిని కల్పిస్తామంటూ సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారని పేర్కొంది. అదే సమయంలో లడఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడాన్ని సమర్థించింది. అంటే పూర్వపు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని పునరుద్ధరించడమనేది జరగదు, అందులో కొంత భాగానికి మాత్రమే రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తారు. అది కూడా ఇంకా కాగితాలపై హామీగానే మిగిలివుంది. ఆశ్చర్యకరమైన అంశమేమంటే, 2024 సెప్టెంబరు 30లోగా జమ్మూ కాశ్మీర్‌కు ఎన్నికలు నిర్వహించాలంటూ భారత ఎన్నికల సంఘాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. అంటే జమ్మూ కాశ్మీర్‌పై కేంద్ర ప్రభుత్వం తన నియంత్రణను ఇంకా కొసాగించడానికి సుదీర్ఘ సమయాన్ని ఇచ్చిందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఒక రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో వున్నప్పుడు, ఆ రాష్ట్ర హోదాను రద్దు చేసినపుడు, ఎన్నికైన శాసనసభ లేని సమయంలో రాష్ట్రపతి నియమించిన గవర్నర్ యొక్క సమ్మతిని ప్రత్యామ్నాయంగా తీసుకోవచ్చా? అని ప్రశ్నించింది. దీనివల్ల, రాష్ట్రపతి పాలన విధించబడినపుడు, దాని సరిహద్దులు మార్చబడినపుడు లేదా రాష్ట్ర హోదాను రద్దు చేసినపుడు ఇతర అన్ని రాష్ట్రాలకూ తీవ్ర పర్యవసానాలు వుంటాయని హెచ్చరించింది.

ఏ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లునైనా వారి అభిప్రాయం తెలుసుకోవడం కోసం సంబంధిత రాష్ట్ర అసెంబ్లీకి రాష్ట్రపతి నివేదించాల్సి వుంటుందని రాజ్యాంగంలోని 3వ అధికరణ పేర్కొంటోంది. కానీ, కొత్త రాష్ట్రాల ఏర్పాటు, ప్రాంతాలు, సరిహద్దులు లేదా ప్రస్తుతమున్న రాష్ట్రాల పేర్లు మార్పుకు సంబంధించి కేంద్రప్రభుత్వమే ఏకపక్షంగా చర్యలు తీసుకోవడానికి అనుమతించడంతో ఈ తీర్పు అనేక సమస్యలకు దారి తీస్తోంది. సమాఖ్యవాదానికి, ఎన్నికైన రాష్ట్ర అసెంబ్లీల హక్కులకు తీవ్ర విఘాతం కలిగించడానికి కూడా దారి తీస్తుందని విమర్శించింది.

జూప్రధాన తీర్పును, దానితో పాటే ఇచ్చిన మరో రెండు తీర్పులను కూలంకషంగా అధ్యయనం చేసిన తర్వాత మాత్రమే సవివరమైన స్పందన వెలువడుతుందని పొలిట్‌బ్యూరో తెలిపింది. ఏది ఏమైనా, ఈ తీర్పు వల్ల మన రాజ్యాంగ ఫెడరల్ వ్యవస్థకు తీవ్ర పర్యవసానాలు కలిగే అవకాశాలున్నాయని స్పష్టమైందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. జాతీయ భద్రతను ప్రస్తావించడం ద్వారా సమగ్రత పేరుతో ఏకపక్ష ప్రభుత్వ వ్యవస్థను బలోపేతం చేసేలా తీర్పు వుందని వ్యాఖ్యానించింది.

మా పోరాటం ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

గృహ నిర్బంధంలో వున్నట్టు మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. తన ఇంటి గేటుకు తాళం వేశారని, మీడియా వారిని తనతో మాట్లాడనివ్వలేదని చెప్పారు. న్యాయం జరుగుతుందనే ఆశతో సుప్రీం తలుపుతు తట్టాం, కోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తామన్నారు. 'మేం విఫలమయి వుండవచ్చు, నిర్ణయం నిరాశను కలిగించవచ్చు.

కానీ ఇదంతా తాత్కాలిక మైన ఎదురు దెబ్బే, మాది రాజకీయ పోరాటం, చట్టపరిధుల్లోనే మా పోరాటం కొనసాగుతుంది." అని చెప్పారు. తనను ఇంటి నుంచి బయటకు వెళ్లడానికి అనుమతించలేదని సీపీఐ(ఎం) నేత ఎం.వై.తరిగామి అన్నారు. మీడియా వారిని కూడా రానివ్వలేదన్నారు.

సంతోషంగా లేరు

ఈ తీర్పుతో జమ్మూ కాశ్మీర్ ప్రజలు సంతోషంగా లేరని మాజీ కాంగ్రెస్ నేత గులాం నబీ అజాద్ వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టే మా చివరి ఆశ, ఆర్టికల్ 370, ఆర్టికల్ 35-ఎలు జమ్మూకాశ్మీర్‌కు సంబంధించిన చారిత్రక అంశాలు. కోర్టు నిర్ణయం మమ్మల్ని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తుందని చెప్పారు. ఈ తీర్పు పట్ల పీపుల్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు సజద్ లోనె తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సుప్రీం రూలింగ్‌ని ఆమోదించి, ఎన్నికలపై దృష్టి పెట్టాల్సిందిగా జమ్ము కాశ్మీర్ చివరి డోగ్రా పాలకుడు మహారాజా హరిసింగ్ మనవడు కరణ్ సింగ్ ప్రజలను కోరారు.

గృహ నిర్బంధాలు లేవు

ఎవరినీ గృహ నిర్బంధంలో వుంచలేదని జమ్మూ కాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా తెలిపారు. ముఫ్తి, అబ్దులాలు చేసిన ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు. కేవలం రాజకీయ కారణాలతో ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు. పుకార్లను వ్యాప్తి చేస్తున్నారన్నారు.

జీవీకే ఈఎంఆర్ఐలో శ్రమదోపిడీ

ప్రశ్నిస్తే తొలగింపులే

- జీవీకేకు సహకరిస్తున్న అధికారులు
- సీఎస్‌కు తెలంగాణ రాష్ట్ర 108 అంబులెన్స్ ఉద్యోగుల జేఏసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవీకే ఈఎంఆర్ఐ యాజమాన్యం శ్రమదోపిడీకి పాల్పడుతున్నదని తెలంగాణ రాష్ట్ర 108 అంబులెన్స్ ఉద్యోగుల జేఏసీ ఆరోపించింది. ప్రశ్నించిన వారిని తొలగిస్తున్న యాజమాన్యానికి ప్రభుత్వ అధికారులే సహకరిస్తున్నారని తెలిపింది. ఈ మేరకు సోమవారం జేఏసీ నాయకులు గద్దగూటి నగేష్, కెసిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వినతిపత్రం సమర్పించారు. సీనియర్ ఈఎంటీలకు రూ.30 వేలు, కొత్త వారికి రూ.14 వేలు, సీనియర్ పైలెట్లకు రూ.28 వేలు, కొత్త వారికి రూ.12 వేలు చెల్లిస్తుండటంతో సీనియర్లను తొలగించి కొత్త వారిని తీసుకునేందుకు యాజమాన్యం ఆసక్తి చూపిస్తున్నదని తెలిపారు. ఇలాంటి యాజమాన్యానికి ప్రభుత్వ అధికారులు సహకరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

తమకు సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరారు. వంద శాతం ప్రభుత్వ నిధులతో నడుస్తున్న సేవలను కలెక్టర్ లేదా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 18 ఏండ్లుగా వంద శాతం ప్రభుత్వ నిధులతో ఒక కార్పొరేట్ సంస్థ 108 అంబులెన్స్ సర్వీస్‌ను నడిపిస్తున్నదని గుర్తుచేశారు. ముందస్తు సమాచారమిచ్చి 8 గంటలు మాత్రమే డ్యూటీ చేసిన ఉద్యోగులను 2018లో తొలగించారనీ, వారికి ఐదేండ్ల జీతం చెల్లించి, వారి లొకేషన్లలో విధులు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. 2018 నుంచి కార్మిక చట్టాలను అమలు చేయడం లేదని తెలిపారు.

పెంచిన జీతం ఇవ్వడం లేదు

ప్రభుత్వం పెంచిన 10 శాతం జీతం జీవికె ఈఎంఆర్ఐ చెల్లించడం లేదని జేఏసీ నాయకులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బకాయిలను ఇప్పించాలని కోరారు.

తెలంగాణ పెండింగ్ డిమాండ్లను
అమలు చేయండి
లోక్‌సభలో కేంద్రానికి బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్ విజ్ఞప్తి

నవతెలంగాణ - న్యూఢిల్లీబ్యూరో

తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఏపీ విభజన చట్టం 2014లోని హామీలు, కాళేశ్వరం లేదా పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలో ఒక ప్రాజెక్ట్‌కు జాతీయ హెూదా, తెలంగాణ అసెంబ్లీ సీట్ల 119 నుంచి 153 కు పెంపు వంటి అంశాలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. సోమవారం లోక్‌సభలో సప్లమెంటరీ డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ అంశంపై చర్చలో బీఆర్ఎస్ పార్టీ తరపున బీబీ పాటిల్ మాట్లాడారు. అత్యంత దారుణమైన ఆర్థిక సంక్షోభం నడుమ భారత్ ఉందన్నారు. ఈ టైంలో కేంద్ర ప్రభుత్వం చేసింది చాలా తక్కువన్నారు. ఇది గ్లోబల్ ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని తగ్గిస్తోందని, ఉపశమనం కోసం కేంద్రం వైపు చూస్తోన్న సామాన్య ప్రజలకు నిరాశకు గురిచేస్తోందని సభకు వివరించారు. అలాగే తెలంగాణకు రావాల్సిన బకాయిలు, ఇతర అంశాలను సభ దృష్టికి తెచ్చారు. జహీరాబాద్ నిమ్జ్‌కు ఫండ్స్ కేటాయింపు, కాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, ప్రతి జిల్లాలో సైనిక్ స్కూల్ ఏర్పాటు, టీఐఈఎస్ కింద జడ్చర్ల కు గ్యాస్ అకేషన్, ఆదిలాబాద్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ రి ఓపెన్, హైదరాబాద్ ఫార్మా సిటీకి ఫండ్స్ రిలీజ్, వరంగల్ మెగా టెక్స్ టైల్స్ పార్క్ కు కేంద్ర సపోర్ట్, సిరిసిల్లాలో మెగా పవర్ క్లస్టర్ కేటాయింపు, ఐటీఐఆర్ రీ కన్సిడరింగ్, ఖమ్మంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుచేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

మరోసారి కలవరపెడుతున్న కోవిడ్

న్యూఢిల్లీ: కరోనా కనుమరుగైపోయిందని అందరూ ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఇలాంటి తరుణంలోనే దేశ ప్రజానీకాన్ని మరోసారి కరోనా కలవరపెడుతోంది. అనూహ్యంగా దేశంలో కరోనా కేసులు పెరిగాయి. కేవలం ఆదివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 166 కరోనా కొత్త కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ సోమవారం వెల్లడించింది. తాజా కేసులతో కలిపి దేశవ్యాప్తంగా మొత్తంగా 895 యాక్టివ్ కేసులున్నాయి. కరోనా వేరియంట్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ వల్లే శీతాకాలంలో కరోనా కేసుల పెరుగుదలకు కారణమని కేంద్రప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కరోనా కేసులు పెరగడంతో శీతాకాలంలో అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సూచించింది. కాగా, కరోనా వైరస్ వ్యాప్తి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 4.44 కోట్ల మంది ఈ వైరస్ బారినపడ్డారు.

హోం మంత్రిగా సుదర్శన్‌రెడ్డి..?

- ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి మంత్రివర్గంలోకి వివేక్
- సీఎం రేవంత్ యోచన
- బీసీల నుంచి వాకిటి శ్రీహరి?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి గెలిచిన పి.సుదర్శన్‌రెడ్డిని రాష్ట్ర హోం మంత్రి పదవి వరించనుందా..? అంటే అవుననే అంటున్నాయి రాజకీయ వర్గాలు. సీఎం రేవంత్‌కు అత్యంత సమీప బంధువు కావటం, గతంలో మంత్రిగా పని చేసిన అనుభవం ఉండటం ఆయనకు కలిసొచ్చే అంశాలని ఆయా వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ ఒకే సామాజిక వర్గానికి కీలక పదవులు కట్టబెట్టారనే విమర్శలు వస్తాయనుకుంటే అప్పుడు దీనిపై ఆలోచన చేసే అవకాశముంది తప్ప సుదర్శన్‌రెడ్డికే హోం మంత్రి పదవి దాదాపు ఖాయమైందని తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కూడా మంత్రివర్గంలో ప్రాతినిధ్యం దక్కలేదు. ఈ నేపథ్యంలో సామాజిక వర్గాల పొందికల ఆధారంగా చెన్నూర్ నుంచి గెలుపొందిన గడ్డం వివేక్‌కు మంత్రి పదవి దక్కనుందని సమాచారం. ఒకవేళ ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేకపోతే... చీఫ్ విప్ పదవిని కట్టబెట్టాలని సీఎం భావిస్తున్నారు.

బీసీ సామాజిక తరగతి గురించి పరిశీలిస్తే... ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ నుంచి గెలిచిన వాకిటి శ్రీహరికి మంత్రివర్గంలో బెర్తు ఖాయమనే చర్చ కొనసాగుతోంది. సీఎం రేవంత్ సొంత నియోజకవర్గమైన కొడంగల్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా 40 నియోజకవర్గాల్లో ముదిరాజ్‌ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అదే సామాజిక తరగతికి చెందిన శ్రీహరికి మినిష్టర్ పదవి ఖాయంగా కనబడుతోంది. మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్కటంటే ఒక్క సీటు కూడా తమకు ఇవ్వలేదంటూ ఆ తరగతికి చెందిన నేతలు, ఆశావహులు ఆందోళన చేసిన విదితమే. ఈ నేపథ్యంలో ఇప్పుడు కాంగ్రెస్ నుంచి గెలిచిన శ్రీహరిని మంత్రివర్గంలోకి తీసుకోవటం ద్వారా ఆ సామాజిక తరగతిని మరింత దగ్గర చేసుకోవాలని సీఎం భావిస్తున్నట్టు తెలిసింది. బీసీ తరగతికే చెందిన వీర్లపల్లి శంకర్ (షాద్‌నగర్) పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. హైదరాబాద్‌తోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి క్యాబినెట్‌లో అసలు ప్రాతినిధ్యమే లేదు. రంగారెడ్డి నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి (ఇబ్రహీంపట్నం), టి.రామ్మోహన్‌రెడ్డి (పరిగి) పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో కాంగ్రెస్ నుంచి ఒక్కరూ ఎమ్మెల్యేగా గెలవకపోవటంతో ఇక్కడి నుంచి ఒకరికి ఎమ్మెల్సీగా అవకాశమిచ్చి, మంత్రిపదవిని కట్టబెడతారనే చర్చ కొనసాగుతోంది.

గత ప్రభుత్వంపై కక్ష సాధింపులుండవు

- ఓఆర్ఆర్ సహా గత ప్రభుత్వ నిర్ణయాలపై సమీక్ష చేస్తాం
- ప్రజా పాలన దిశగా ముందుకెళ్తాం
- ఏపి, తెలంగాణ భవన్ పంపకాలపై నేడు సమీక్ష
- మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి
- ఎంపీ పదవికి రాజీనామా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)తో సహా, గత ప్రభుత్వం నిర్ణయాలపై సమీక్ష చేస్తామని అర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ సర్కార్ తీసుకున్న మంచి, చెడ్డ నిర్ణయాలపై మంత్రివర్గంలో చర్చిస్తామే తప్ప, కక్ష సాధింపు చర్యలకు పోమన్నారు. ఒకటి రెండు నెలల్లో ఢిల్లీలో తెలంగాణ భవన్ డిజైన్ చేసి, మార్చిలో శంకుస్థాపన చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. అదే ఏడాది భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. ఢిల్లీలోని తెలంగాణ, ఏపి భవన్ పంపకాల గురించి నేడు (మంగళవారం) భవన్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి సోమవారం ఢిల్లీ వచ్చిన కోమటిరెడ్డి వెంకట రెడ్డి తన లోక్‌సభ ఎంపీ పదవికి రాజీనామా చేశారు. పార్లమెంట్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. అనంతరం కేంద్ర రవాణా, జాతీయ రహదారులు శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. ఈ భేటిలో రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతి రెడ్డి, ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయింపు, సహకారం అందించాలని కోరారు. అనంతరం ఢిల్లీ తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన రోడ్లను జాతీయ రహదారులుగా మార్చాలని, కేంద్రం నిధులు విడుదల చేయాలని మంత్రిని కోరినట్టు చెప్పారు. హైదరాబాద్-విజయవాడ మధ్య ఉన్న ఆరు లైన్ల రహదారి పెండింగ్ అంశాన్ని మరోసారి మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ అంశంపై పది రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని గడ్కరీ హామీ ఇచ్చారన్నారు. అలాగే రూ. 600 కోట్లతో నల్గొండ బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. నల్గొండ బైపాస్ రోడ్డు గురించి గడ్కరీ సానుకూలంగా స్పందించారని వివరించారు. 14 రోడ్లను జాతీయ రహదారులుగా చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారన్నారు.

100 రోజుల్లో హామీలను అమలు చేస్తాం

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొన్ని హామీలు నెరవేర్చనున్నట్టు మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. 100 రోజుల్లో ఇచ్చిన అన్నీ హామీలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజా పాలన దిశగా కాంగ్రెస్ ముందుకు వెళ్తుందని చెప్పారు. గత తొమ్మిదిన్నర ఏండ్లలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క ఉపాధ్యాయ నియామకం చేపట్టలేదని, ఒక్క ఇల్లు నిర్మించలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆరు వేల పాఠశాలలు మూతబడ్డాయని తెలిపారు. భువనగిరి ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. భువనగిరి ఎంపీగా గెలిపించిన ప్రజలు తనకు పునర్జన్మ ఇచ్చారన్నారు. ఆ నియోజక వర్గ ప్రజలకు ఎప్పటికీ అందుబాటులో ఉంటానన్నారు. నేడు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేను మర్యాదపూర్వకంగా కలవనున్నట్టు చెప్పారు.

14న శాసనసభ స్పీకర్ ఎన్నిక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నూతన శాసనసభ కొలువుతీరిన నేపథ్యంలో స్పీకర్ ఎన్నిక ఈ నెల 14న జరగనుంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఈ మేరకు సోమవారం స్పీకర్ ఎన్నికకు సంబంధించి నియమ నిబంధనలతో శాసనసభ కార్యదర్శి డా.వి.నర్సింహా చార్యులు నోటిఫికేషన్ విడుదల చేశారు. 14న అసెంబ్లీ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభిస్తారు. స్పీకర్ ఎన్నికకు దాఖలైన నామినేషన్లను సభ్యులకు చదివి వినిపిస్తారు. అయితే, అధికార పక్షం కాంగ్రెస్ ఇప్పటికే స్పీకర్ అభ్యర్థిగా సీనియర్ సభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పేరు ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఎన్నిక లాంఛనం కానుంది. ఈనెల 15న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగించనున్న సంగతి విదితమే.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్



నవతెలంగాణ-సంతోష్ నగర్

ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సంతోష్ నగర్ ఇన్స్ స్పెక్టర్ శివచంద్ర పూసపతి రౌడీ షీటర్లను హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఏసీపీ మహమ్మద్ గౌస్ ఆదేశాల మేరకు ఇన్స్ స్పెక్టర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎలాంటి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించవద్దని, లేకుంటే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి రౌడీషీటర్ నెలకు రెండు పోలీస్ స్టేషన్లలో హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐ, ఎస్సైలు, స్థానికులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 7 కేసులు నమోదు



నవతెలంగాణ-సంతోష్ నగర్

చంపాపేట్ డివిజన్ చౌరస్తా యాదిరెడ్డి గార్డెన్ వద్ద సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. సౌత్ జోన్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ఆదేశం మేరకు సీఐ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించగా సుమారు 7 కేసులను నమోదు చేసినట్టు ట్రాఫిక్ ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురు ద్విచక్రవాహనాదారులు, ఇద్దరు ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఎన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహించినా వాహనదారుల్లో మార్పు రావడం లేదన్నారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట చౌరస్తాలో నిత్యం ఆకలి కోసం సూరి అనే వ్యక్తి బిక్షాటన చేస్తున్న సందర్భంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో మూడు నెలలు అయినా అతనికి నయం కాకపోవడంతో స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం మైనార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమ నాయకుడు మహమ్మద్ సలీమ్ ముందుకు వచ్చి మానవతా దక్పథంతో, 108 కి కాల్ చేసి అతన్ని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించాడు.

నవతెలంగాణ-చైతన్యపురి

ఫ్యాన్సీ నెంబర్ల వేలం..

- పోటీపడ్డ వినియోగదారులు
- ఒక్కరోజే ఆర్టీఏకు 45.98లక్షల ఆదాయం
- జేటీసీ పాండురంగ నాయక్





జేటీసీ జెపాండురంగ నాయక్

నవతెలంగాణ-సిటీబ్యూరో

వాహన ఫ్యాన్సీ నెంబర్ల ద్వారా మరోసారి రవాణా శాఖకు కాసుల పంట పండింది. కేవలం ఒక్కరోజులోనే ఆ శాఖ ఖజానాకు భారీ ఆదాయం వచ్చి చేరింది. సోమవారం సెంట్రల్ జోన్‌లోని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన ఫ్యాన్సీ నెంబర్ల ఈ-వేలంలో వినియో గదారులు పోటీపడ్డారు. ఈ వేలం ద్వారా సుమారు రూ.45,98,490 ఆదాయం వచ్చిందని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) జె.పాండురంగ నాయక్ తెలిపారు. ఇందులో కీస్టోన్ ఇన్‌ఫ్రా ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ వారి విలువైన కారు కోసం రూ.17.35లక్షలు వెచ్చించి టీఎస్09 జీఈ 9999 నెంబర్ సొంతం చేసుకుంది. అదే విధంగా లలిత జ్యువెలరీ మార్ట్ ప్రయివేట్ లిమిటెడ్ వారి విలువైన కారు కోసం రూ.3.75లక్షలు చెల్లించి టీఎస్09 జీఎఫ్ 0005 నెంబర్‌ను దక్కించుకుంది.

ఇక ఎన్‌టీకే టాలెంట్ స్టూడియోత్రీ ఎల్ఎల్‌పీ అనే సంస్థ వారి కారు కోసం రూ.3.50లక్షలు వెచ్చించి టీఎస్09 జీఎఫ్ 0001 నెంబర్‌ను సొంతం చేసుకోగా.. డి.వరూదిన్ రెడ్డి వారి విలువైన కారు కోసం రూ.2.32లక్షలు చెల్లించి టీఎస్09 జీఎఫ్ 0099 నెంబర్‌ను సొంతం చేసుకున్నారు. 99 వెంచర్స్ వారి కారు కోసం రూ.2.09లక్షలకుపైగా చెల్లించి టీఎస్09 జీఎఫ్ 0111ను కైవసం చేసుకుంది. అదేవిధంగా న్యూలాండ్ లాబోరేటరీస్ లిమిటేడ్ సంస్థ వారి విలువైన కారు కోసం రూ.1.36లక్షలకుపైగా వెచ్చించి టీఎస్09 జీఈ 0027 నెంబర్‌ను దక్కించుకోగా.. హిల్ థియరీ ఐటీ సోల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ వారి విలువైన కారు కోసం రూ.1.02లక్షలు చెల్లించి టీఎస్09 జీఎఫ్ 0007 నెంబర్‌ను సొంతం చేసుకుంది.



ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ -ఎల్‌బీనగర్

బీఆర్ఎస్ ఎల్.బి.నగర్ నియోజకవర్గ అభ్యర్థిగా మరోసారి అఖండ విజయం సాధించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు, మిదాని కాలనీవాసులు, పలువురు ముస్లిం పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎల్.బి.నగర్ నియోజకవర్గ అభివద్ధి కేవలం సుధీర్ రెడ్డితో సాధ్యం అని తెలిపారు. వారు చేసిన అబివద్దే వారి విజయానికి కారణం అన్నారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివద్ధి చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ అభివద్ధి తన లక్ష్యం అని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు భాస్కర్ సాగర్, గుడాల మల్లేష్, చెన్నగొని మదన్ గౌడ్, గజ్జి అశోక్, గణేష్, కష్ణ, జంగయ్య, భాస్కర్ గుప్తా,యాదగిరి,లింగం శ్రీను,చంద్రశేఖర్ రెడ్డి, అంజయ్య గౌడ్,సలీం,ఖాన్ పాషా,గణేష్ తదితరులు పాల్గొన్నారు.



రజక సంఘం నాయకుల సన్మానం

నాగోల్ : దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మరోసారి శాసనసభ్యులుగా విజయం సాధించడం పట్ల నియోజకవర్గంలోని రజక సంఘం నాయకులు సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.నాగోల్ రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి మహేందర్, బొడ్డుపల్లి మధుల నాయకత్వంలో సీనియర్ రజక సంఘం నాయకులు గ్రేటర్ హైదరాబాద్ రజక సంఘం ప్రధాన కార్యదర్శి చుక్కయ్య, సహదేవ ,కార్తీక్ ,సంజీవ్ కుమార్ , బొడ్డు పల్లి కష్ణలతో పాటు పలువురు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి
- ఎస్.ఎన్.డి.పి.వరద కాల్వల నిర్మాణ పనులపై అధికారులతో మేయర్ సమీక్ష



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మాణంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను సంబంధిత కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎస్ఎన్‌డీపీ నిధులతో చేపట్టిన అభివద్ధి పనులపై అధికారులతో మేయర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జరుగుతున్న వరద కాల్వల నిర్మాణం పనులను డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, కమిషనర్ సుమన్ రావు, ఈఈ కృష్ణయ్యలతో కలసి మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్ అన్ని డివిజన్లలో కోట్లాది రూపాయలతో ప్రత్యేక, మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో అనేక అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు.ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎంతో కషి చేస్తున్నామన్నారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు మేయర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ డీఈఈలు జ్యోతి రెడ్డి, అనురాధ, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, సుర్గంటి అర్జున్, లిక్కి మమత కష్ణారెడ్డి, తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, ఏఈఈలు వివేకానంద సాగర్, రాజు, వినీల్ గౌడ్, ఇంజనీర్ అవినాష్ రెడ్డి,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే గా విజయం సాధించిన సబితా ఇంద్రా రెడ్డిని సోమవారం నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి ఆధ్వర్యంలో ఆర్కేపురం నుంచి మహిళలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సునీతా రెడ్డి మాట్లాడుతూ నియోజ కవర్గాన్ని కోట్లాది రూపాయల నిధులతో ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. అభివృద్ధిని చూసి మరో మారు ప్రజలు భారీ విజయాన్ని కట్టబెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదమ్మ, బుజ్జి భాయి , మహిళలు పాల్గొన్నారు.

ఐఎస్ సదన్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



- కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి

నవతెలంగాణ-సంతోష్ నగర్

ఐఎస్ సదన్ డివిజన్‌ను తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ రోడ్ నెంబర్ 14 లో డ్రయినేజీ లైన్ నిర్మాణం పనులను డివిజన్ కార్పొరేటర్ శ్వేత మధుకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఉన్న డ్రయినేజీ లైన్ సమస్య దీంతో పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కాంట్రాక్టులకు సూచించారు. పూర్తిచేసి అందించాలని అధికారులను కార్పొరేటర్ కోరారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు నేతాజీ నాయక్, బాలు నాయక్, సురేష్, పవన్, సిద్ధు, శాంతి భాయి, శ్రీను, అభిమానులు స్థానిక నాయకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు

వనభోజన కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస గుప్త..



నవతెలంగాణ- నాగోల్

నగరంలోని ట్యాంక్ బండ్ సంజీవని పార్క్, మియాపూర్ నరేన్ గార్డెన్ లో ఆర్యవైశ్య ఐక్యవేదిక, మణికొండ ఆర్యవైశ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజనాల కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక అభివద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ,ఐవీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస గుప్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం వ్యాపారాలకే పరిమితం కాకుండా సామాజిక సేవలలో పాలుపంచుకుంటూ రాజకీయాలలో కూడా రాణించేం దుకు ముందుండాలన్నారు. ఎలాంటి వర్గ విభేదాలకు తావు ఇవ్వకుండా ఆర్యవైశ్యులంతా ఒక్కతాటిపై నిలిచినప్పుడే దేనినైనా సాధించగలుగుతామని అన్నారు. అనంతరం నిర్వాహకులు శ్రీనివాస గుప్త ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆయా విభాగాల అధ్యక్ష ,కార్యదర్శులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలి



- ప్రత్యామ్నాయ మార్గలు చూపించాలి
- వీధి వ్యాపారులు
- సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం : బీఆర్ఎస్ నాయకులు జోగు రాములు

నవతెలంగాణ - చైతన్యపురి

వీధి వ్యాపారులపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలని, తమకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కొత్తపేటలోని వీధి వ్యాపారులు కోరుతున్నారు. సోమవారం కొత్తపేటలో రోడ్డు మీద వ్యాపారాలు చేసుకుంటున్న పండ్ల బండ్లను ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసులు తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎల్బీనగర్ ఎస్సీ సెల్ చైర్మెన్ జోగు రాములు కొత్తపేటకు చేరుకుని వీధి వ్యాపారులకు సంఘీబావం ప్రకటించారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని తెలిపారు. 20 సంవత్సరాల నుంచి కొత్తపేట పండ్ల మార్కెట్ వద్ద పండ్ల అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా మన్నారు. మార్కెట్ ఇక్కడ నుంచి తరలించడంలో కొత్తపేట ప్రాంతంలో బండ్ల మీద వ్యాపారం చేసుకుంటున్నామని తెలిపారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు పెద్ద ఎత్తున్న జరిమానాలు విధిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరచుగా తమ బండ్లలను పోలీస్ స్టేషన్ తీసుకెళ్లడంతో పండ్ల పాడవుతున్నాయని తెలిపారు. తాము రోడ్డు మీద బండ్లు పెట్టకుండా పుట్ పాత్ పై వ్యాపారం చేసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా జోగు రాములు మాట్లాడుతూ ఈ సమస్యను ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడి వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో కొత్తపేట వీధి వ్యాపారులు ప్రదీప్. బాబు, గణేష్, ఆర్మార్, అనిల్, శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు రైతులు పాటించాలి



- క్రీడా డైరెక్టర్ డాక్టర్ బల్

నవతెలంగాణ-హాయత్ నగర్

పత్తి పంట అధిక సాగు కోసం రైతులు వ్యవసాయ అధికారుల,నిపుణుల సూచనలు పాటించాలని క్రీడా డైరెక్టర్ డాక్టర్ ఎస్.కే. బల్ పేర్కొన్నారు. సోమవారం హాయత్ నగర్‌లో ఉన్న కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ(కషి విజ్ఞాన కేంద్రం)లో నిర్వాహకులు డీబీవీ రమణ ఆధ్వర్యంలో ఒక రోజు పత్తి పై అధిక సాంద్రత కోసం ఒక రోజు ఏర్పాటు చేసిన వర్క్ షాప్‌లో భాగంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు పత్తి సాగు చేసేటప్పుడు సాలు సాలుకు మధ్య దూరం 90X60,90X40,90X90 పద్దతిలో విత్తడం ద్వారా ఒక ఎకరాకు దాదాపు 4000 మొక్కల వరకు సాగు చేసుకోవచ్చన్నారు.అదే అధిక సాంద్రత ద్వారా పత్తి సాగు చేసినట్టయితే ఒక ఎకరానికి 20వేల మొక్కల వరకు వస్తాయని వెల్లడించారు.నీటిని రాసి సీడ్స్ కంపెనీ ద్వారా విత్తనం తీసుకుని వారి పొలాల్లో రైతులు విత్తనం వేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టును నాగపూర్‌లోని పత్తి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో రైతులు పొలాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పద్దతిలో సమయానికి విత్తనం విత్తడం ద్వారా,సరైన సమయంలో కలుపు నివారణ,అవసరం బట్టి పురుగు మందు కొట్టడం ద్వారా పంటలో దిగుబడి అధికమవు తాయన్నారు.యాంత్రీకరణ ద్వారా పత్తి సాగు చేయడం వల్ల ఖర్చు తగ్గి, దిగుబడులు పొందవచ్చన్నారు.ఈకార్యక్రమంలో డాక్టర్ విజయ్ కుమార్,ఇంజనీర్ లు,శాస్త్రవేతలు డాక్టర్ కే.వీ రావు,డాక్టర్ శ్రీనివాస్,డాక్టర్ ప్రతుభ, డాక్టర్ రవి శంకర్,వెంకటేశ్వర్లు, రత్నాకర్, సుధాకర్, హారిక,సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఆలయంలో సీఐ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గణేష్ దేవాలయంలో సోమవారం కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి, ఎస్సై జగన్, జీవి నాయుడులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ వైస్ చైర్మెన్‌లు కంచి కష్ణమోహన్, మెట్ట రామ్మోహన్‌లు జలంధర్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించి గణేష్, ఆంజనేయస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి, సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి సీఐ జలంధర్ రెడ్డి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను కబ్జాదారుల నుంచి కాపాడాలని వినతి



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ స్మశాన వాటికను భూకబ్జాదారుల నుంచి కాపాడాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యవర్గ సభ్యురాలు ఈ. అనురాధ వి. విజయలతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 212లో స్మశాన వాటిక కోసం 2005లో కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని భూ కబ్జాదారులు ఆక్రమించడానికి గత కొన్ని సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నారన్నారు. స్మశాన వాటిక కబ్జాను అడ్డుకోవడం కోసం సీపీఐ అనేక రకాల పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో అధికారులు బిజీగా ఉంటారని, తమను ఎవరు పట్టించుకోరని భావించిన కబ్జాదారులు నవంబర్ 17 నుంచి 900 గజాలను కబ్జా చేసి ఫ్రీ కాస్ట్ కాంపౌండ్ వాల్‌ను నిర్మించారని అన్నారు. ఇట్టి విషయాన్ని ఇబ్రహీంపట్నం ఆర్‌డీఓ తో పాటు స్థానిక తాసిల్దారుకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఇట్టి విషయం పై అధికారులు చర్యలు తీసుకోకపోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ కబ్జాదారులు స్మశాన వాటిక స్థలాలను కూడా వదలకుండా కబ్జాలకు పాల్పడుతున్నారని ఇది దుర్మార్గపు చర్య అని ఖండించారు.



ఇటీవల తుంటి గాయంతో సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలం గాణ తొలి సీఎం కేసీఆర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని కోరినట్టు తెలిపారు.

నవతెలంగాణ-చైతన్యపురి

మద్యం దుకాణాన్ని వేరే చోటుకు మార్చాలి



నవతెలంగాణ-నాగోల్/ హాయత్ నగర్

నాగోల్ డివిజన్ పరిధిలోని జైపురి కాలనీ,వీకర్ సెక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే అక్కడి నుంచి తరలించి వేరే ప్రాంతానికి మార్చాలని ఎల్‌బీనగర్ బీఎస్పీ నాయకులు గువ్వల సాయి రామ కష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఉప్పల్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా అక్కడ మద్యం దుకాణం పెట్టడం వల్ల తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని, పాదచారులు,చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంతు,విష్ణు,అశోక్,మోక్ష తదితరులు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. కాలనీవాసుల ఇబ్బందులు



నవతెలంగాణ-చైతన్యపురి

ఆర్కే పురం డివిజన్‌లోని ఆర్కే పురం రోడ్ నెంబర్ 2లో అధికారుల నిర్లక్ష్యంతో కాలనీ వాసుల ఇబ్బందులు పడుతున్నారని ఆరోప ణలు వినిపిస్తున్నాయి. రోడ్డు నెంబర్ 2లోని పార్కు సమీపంలో ఓపెన్ ప్లాట్‌లో ప్రతీరోజు చెత్త వేస్తుండడంతో దుర్వాసన భరించలేక పోతున్నామని రామకృష్ణాపురం రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ సాయికుమార్ తెలిపా రు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి రాత్రి సమయంలో చెత్త వేస్తున్నారని, దాంతో పరిసర ప్రాంత వాసులు, కాలనీ వాళ్ళు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చెత్త వెయ్యకుండా అధికారులు చర్యలు తీసుకోవా లని కోరారు. గతంలో అధికారులకు ఎన్ని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. చెత్త ఎక్కువగా వేస్తుండడంతో దోమల బెడద తీవ్రమైందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.


బాస్ స్వచ్ఛంద సేవలు అభినందనీయం..

- అయ్యప్ప పూజలో ఎమ్మెల్యే రాజాసింగ్



నవతెలంగాణ - ధూల్ పేట్

బాస్ స్వచ్ఛంద సేవలు అభినందనీయమని గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. భాగ్యనగర్ అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో 18పడుల అయ్యప్ప సామూహిక మహపడిపూజ కార్యక్రమాన్ని శబరిమల ఆలయ ప్రధాన మెల్ శాంతి పూజారి విష్ణు నంబూత్రి చేతులమీదుగా వేదమంత్రోత్సరణల మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమానికి ఆయనతో పాటు రాష్ట్ర స్టాప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జనరల్ జాయింట్ ఐజీ శ్రీనివాసులు, డిఐజి సుమతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ శైలజా, సభ్యురాలు ప్రమోదా, తెలంగాణ రాష్ట్ర బలలహక్కుల పరిరక్షణ సభ్యురాలు బండి.అపర్ణ, బాస్ అడ్వైసర్ దేవర రాజేశ్వర్, కట్ట మల్లేశం, కార్పొరేటర్లు జి.శంకర్ యాదవ్, రాకేష్ జైస్వాల్, మిరాల మండి మహంకాళి అలయా చైర్మన్ గాజుల అంజయ్య, ప్రముఖ వ్యాపార వేత్త వీరేందర్ సింఘాల్ లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శబరిమల అయ్యప్ప దేవాలయం తరహాలోనే ఎగ్జిబిషన్ మైదానంలో 18పడులతో సామూహిక అయ్యప్ప మహపడి పూజా శబరిని తలపించే అనుభూతి కలుగుతుందన్నారు. బాస్ అయ్యప్ప పడిపూజలే కాకుండా ఉస్మానియా ఆస్పత్రిలో రోగులకు మంచినీటి అందిస్తుందన్నారు. భోజనం, అల్పాహారం అందజేయడం, రక్తదాన శిబిరాలను నిర్వహించడం గొప్పవిషయం అన్నారు. బాస్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఇతర స్వచ్ఛంద సంస్థలు ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.



ఎమ్మెల్యేగా విజయం సాధించిన పి.సబితా ఇంద్రారెడ్డిని ఆమె నివాసంలో సోమవారం జల్ పల్లి మున్సిపల్ మైనార్టీ నాయకులు కలిసి పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి బొకే అందచేసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో పార్టీ జల్ పల్లి మున్సిపాల్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మహమ్మద్ షర్ఫుద్దీన్, హామీద్ భాయ్‌తో పాటు నాయకులు, షాకీర్ బేగ్, అంజాద్ ఖాన్, సయ్యద్ ఫెరోజ్, సూరెడ్డి కృష్ణారెడ్డి, అలీ మన్సూరి తదితరులున్నారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించిన పత్తికుమార్



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు పత్తి కుమార్, నిజాంసాగర్ మండల ఉపాధ్యక్షులు పాతకోటి రామలింగం, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు జైపాల్‌రెడ్డిలు సన్మానించారు. సోమవారం పొన్నం ప్రభాకర్ మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపల్ మీదుగా హుస్నాబాద్ వెళ్తుండగా మార్గ మధ్యలో తూంకుంటలో మంత్రి కాన్వాయిని ఆపి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మేడ్చల్ నుంచి ఘట్కేసర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ నుంచి ఘట్కేసర్ వరకు సాయంత్రం సమయంలో బస్సు సౌకర్యం కల్పించాలని మండల పరిధిలోని ఘనపూర్ గ్రామస్తులు మేడ్చల్ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ రామారావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడ్చల్ నుంచి ఘట్కేసర్ వరకు ఉదయం సమయంలో బస్ సౌకర్యం ఉందని, సాయంత్రం బస్సు సౌకార్యం లేదన్నారు. దీంతో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు వీలైనంత తొందరగా బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. కారక్రమంలో విద్యార్థులు వై.ప్రవళిక, నిఖిత, అర్చన, వందన, సౌజన్య, రాధిక, ఏర్పుల కుమార్, తప్పెట్ల నరేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ ఎమ్మెల్యే బండారికి ఘన సన్మానం



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యేగా బండారి లక్ష్మారెడ్డి 49వేల426ఓట్ల మెజార్టీతో భారీ విజయం సాధించడంతో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్‌శేఖర్ ఆధ్వర్యంలో బండారి లక్ష్మారెడ్డిని సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో నాచారం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, ఉద్యమకారులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నాచారంలోని పలు కుల సంఘాలు, అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేన్ సభ్యులు కలిసి ఏఎస్ఆర్ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

కార్తీక మాసం సందర్భంగా అన్నదానం



నవతెలంగాణ-కాప్రా

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మల్లాపూర్‌లోని శ్రీ నందీశ్వరాలయ ప్రాగణంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

భక్తాంజనేయ స్వామి ఆలయ ముఖద్వారం ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ ఓం కాళేశ్వర భక్తాంజనేయ స్వామి ఆలయ ముఖ ద్వారం నూతన తలుపులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీ రావు, ఎం.అంజయ్య, చెక్కిళ్ల చంద్రశేఖర్‌గౌడ్, అశోక్‌రెడ్డి, నవీన్ గౌడ్, పూస రమేష్, కుమార్, నగేష్, మహేష్, జంపాల్ రెడ్డి, సత్తిరెడ్డి, భూపాల్, సుబ్బారెడ్డి, ప్రవీణ్, టిల్లు, సంతు పాల్గొన్నారు.

అయ్యప్ప మహాపడి పూజకు హాజరైన ప్రభుదాస్



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ మంగాపురం కాలనీ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజలో స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అయ్యప్పస్వామి ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అశోక్ రెడ్డి, చెక్కిళ్ల చంద్రశేఖర్ గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ ఎమ్మెల్యే బండారికి శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు, పలు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం సైనిక్‌పూరిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనపై మీ అభిమానం, మీ ప్రేమ ఎల్లవేళలా ఉండాలని కోరారు.

కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

అనారోగ్యానికి గురై యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కేటీఆర్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సాయిజెన్ శేఖర్, కొత్త రామారావు, మహేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.



కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.
-నవతెలంగాణ-కాప్రా

రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జనరంజక పాలన

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-శామీర్‌పేట

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కొలువుదీరిందని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జనరంజక పాలన అందిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. సోమవారం పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గ పర్యటనకు వెళ్తుండగా మార్గమధ్యలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి దేవరయాంజల్‌లో డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, రాజీవ్‌గాంధీ, డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించి ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం కల్పించిన ప్రజలందరికీ, కష్టపడిన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలను అమలు చేశామని తెలిపారు. మిగతావి వంద రోజుల్లో అమలు చేస్తామని పేర్కొన్నారు.

అంకముందు తూంకుంట మున్సిపాలిటీలో పర్యటించారు. అనంతరం తూంకుం ట మున్సిపల్ అధ్యక్షులు భీమిడి జైపాల్‌రెడ్డి నివాసం లో తేనేటి విందుకు పొన్నం హాజరయ్యారు. కార్యక్ర మంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారె డ్డి, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాలేష్, కౌన్సిలర్లు సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, రాజపుత్ పూజా భరత్ సింగ్, పోతాయిపల్లి మాజీ ఉపసర్పంచ్ దేవరశెట్టి రాజు, మాజీ సర్పంచ్ బత్తుల కిషోర్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ కమటం కృష్ణారెడ్డి, పెండెం లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు టీ.ఆర్ రవీందర్ గౌడ్, మున్సిపల్ ప్రచార కమిటీ అధ్యక్షుడు చిర్ర రాంచందర్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు లింగంగౌడ్ పాల్గొన్నారు.

సోనియా గాంధీ కలల కోసం పని చేస్తాం



- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

నవతెలంగాణ -కీసర

తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ కలల కోసం నిత్యం ప్రజల కోసం పని చేస్తానని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం నగరంలోని మంత్రి నివాసంలో గోధుమకుంట ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్ గోగుల సరితలు మర్యాదపూర్వకంగా కలిసి పులబొకేను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలన్నారు.

పార్టీ కోసం పని చేసిన వాళ్లకే పదవులు



- జెండా మోసిన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది
- కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-ఉప్పల్

కాంగ్రెస్ జెండా మోసి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన వారికి పార్టీ తగిన ప్రాధాన్యత ఇస్తుందని ఉప్పల్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మినీ శిల్పరామంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలపై ఉప్పల్ ఏ బ్లాక్ పరిధిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి పార్టీ శ్రేణులు తీసుకెళ్లాలని పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పార్టీ ఆరు గ్యారెంటీలు హామీ ఇస్తే, రెండు గ్యారెంటీలు అమలవుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యకర్తలకు తాను అండగా ఉంటానని, సీఎం రేవంతన్న చొరవతో ఉప్పల్ వేగంగా అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంది అఘిరెడ్డి, తవిడబోయిన గిరిబాబు, తోఫిక్, మురళీ గౌడ్, మేకల రామకృష్ణ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జలీల్ పాషా, బోరంపెట కృష్ణ, ఖాజా మౌలానా, తేలికల మోహన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్, విజయ్, కొంపల్లి బాలరాజు, ప్రకాష్ రెడ్డి, రాఫిక్, రాఘవరెడ్డి, రాజు, అమరేశ్వరి ఉన్నారు.

ఉద్దేమర్రిలో మెగా ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-శామీర్‌పేట

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్దేమర్రి సర్పంచ్ యంజాల అనురాధ రవీందర్‌రెడ్డి అన్నారు. మూడు చింతలపల్లి మండలం ఉద్దేమర్రి గ్రామంలో సోమవారం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో మెడిసిటీ హాస్పిటల్ మేడ్చల్ వారు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ యంజాల అనురాధ రవీందర్‌రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి, చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఈ శిబిరంలో 136 మంది రోగులకు షుగర్, బీపీ టెస్టులు చేయగా ఆపరేషన్ అవసర మున్న 66 మందిని మెడిసిటీ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచా యతీ కార్యదర్శి మోహన్, డాక్టర్లు దస్తగిరి, మాజ్, శ్రేష్ఠ, అంజలి, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, నాగార్జున, సత్యనారాయణ, పావని పాల్గొన్నారు.



సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును పరామర్శించడానికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసిన ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి. -నవతెలంగాణ, కాప్రా



సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును పరామర్శిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.
-నవతెలంగాణ, కాప్రా

టీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా నందమూరి సుహాసినిని నియమించాలి

- నీరుకొండ సతీష్ బాబు



నవతెలంగాణ-కాప్రా

తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలిగా నందమూరి వారసురాలు, స్వర్గీయ హరికృష్ణ కుమార్తె, నందమూరి సుహాసినిని నియమించాలని తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరికి బాధ్యత అప్పజెప్పినా, వారు పార్టీని మోసం చేసి పార్టీ ఫిరాయించి కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తారని పేర్కొన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో నందమూరి కుటుంబానికి బాధ్యత ఇవ్వాలని మెజారిటీ కార్యకర్తలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని సతీష్ బాబు తెలిపారు.

మంత్రి సీతక్కను కలిసిన అంగన్‌వాడీ నేతలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్కను సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సెక్రెటరీ బి.శోభారాణి, వైస్ ప్రెసిడెంట్ శివరాణి, భాగ్యరేఖ, మీనాక్షి, తదితరులు కలిశారు. అ సందర్భంగా అంగన్‌వాడీల సమస్యలను మంత్రికి వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

సౌందర్య చికిత్సలకు ప్రసిద్ధి డెర్మా 360 క్లీనిక్



నవతెలంగాణ-సిటీబ్యూరో

డెర్మా 360 క్లీనిక్ సోమవారం తన 4వ శాఖను మాదాపూర్‌లో ప్రారంభించి మూడో వార్షికోత్సవాన్ని జరుపుకుంది. మాదాపూర్‌లోని కావూరి హిల్స్‌లోని అపోలో లైఫ్ స్టూడియో భవనంలోని 4వ అంతస్తులో ఇండియన్ టెలివిజన్ ప్రెజెంటర్ అండ్ నటి అనసూయ భరద్వాజ్ ఈ నూతన క్లీనిక్‌ను ప్రారంభించారు. సౌందర్య వైద్యంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిపుణుడు డాక్టర్ అనురూప్ రాయ్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. డెర్మా 360 క్లీనిక్ తన విలువైన ఖాతాదారులకు చర్మ సంరక్షణ, అందంలో సరికొత్త పురోగతిని తీసుకురావడానికి కట్టుబడి ఉందని ఆయన అన్నారు. డెర్మా 360 అత్యంత అధునాతన నాన్-సర్జికల్ ఫేషియల్ రిజువెనేషన్, సౌందర్య చికిత్సల ఏకీకరణపై దృష్టి సారించే ప్రఖ్యాత స్కిన్, హెయిర్, వెల్‌నెస్ క్లీనిక్. డాక్టర్ అనురూప్ రాయ్ నైపుణ్యం, అంతర్జాతీయ పరిచయంతో మియామిలో స్టెయినర్ ట్రాన్స్-ఓషన్ కోసం పని చేస్తూ అనేక ఏండ్లు గడిపారు. డెర్మా 360 క్లీనిక్ వ్యక్తులు తమ చర్మం, సౌందర్య లక్ష్యాలను సాధించడంలో సహాయపడటానికి అత్యాధునిక విధానాలు, చికిత్సలను అందిస్తుంది.

షరీఫ్ జ్ఞాపకర్థంగా హెూమ్ ఫర్ డిసబుల్ ఆశ్రమంలో అన్నదానం



నవతెలంగాణ-శామీర్‌పేట

కానిస్టేబుల్ షరీఫ్ జ్ఞాపకార్థం సోమవారం శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గంగూడ గ్రామ రెవెన్యూ పరిధిలోని హెూమ్ ఫర్ డిసబుల్ ఆశ్రమంలో శామీర్‌పేట సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... 2020 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ షరీఫ్ శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తుండగా గత సంవత్సరం ఓ వాహనం ఢీ కొట్టడంతో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలిపారు. ఆయన మృతి చెంది ఏడాది కావడంతో అన్నదానం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట ఎస్ఐ లు హారిక, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ సమస్యను తక్షణమే పరిష్కరిస్తా



● పాపిరెడ్డినగర్ అధ్యక్షుడు చంద్రారెడ్డి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

బస్తీలోని ప్రతీ సమస్యను గుర్తించి తక్షణమే పరిష్కరింపజేస్తానని, కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. కాలనీలోని రోడ్డు నెం.9, బ్లాక్-సిలో ఏర్పడ్డ కలుషిత నీటి సమస్యను గుర్తించిన ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన అధికారులు మరమ్మత్తు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం జలమండలి సిబ్బంది చేపడుతున్న పనులను చంద్రారెడ్డి దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిబ్బందితో పాటుగా స్థానిక బస్తీ వాసులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన పంచాయతీరాజ్ అధికారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి అనుసూయ (సీతక్క)ను పలువురు పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం మంత్రిని హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు. మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లా పంచాయతీ అధికారులు రమణమూర్తి, సురేష్ మోహన్, జయసుధ, డీఎల్పీఓ సంధ్య కలిసి మంత్రిని శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాల్లో అభివద్దిని వేగవంతం చేద్దామని సీతక్క సూచించినట్టు వారు పేర్కొన్నారు.

సెల్ టవర్ నిర్మాణాలను ఆపాలి



● సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట

గాజుల రామారం సర్కిల్ షాపూర్ నగర్ ప్రాంతంలో విచ్చలవిడిగా సెల్ టవర్ నిర్మాణాలను ఆపాలని సీపీ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం షాపూర్ నగర్ బస్తీ వాసులతో కలిసి గాజులరామారం సర్కిల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బస్తీ వాసులతో కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలు కానీ లక్ష్మణ్ మాట్లాడుతూ... గాజులరామారం సర్కిల్ సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్, న్యూ షాపూర్ నగర్, కళావతి నగర్‌లో విచ్చలవిడిగా సెల్ టవర్లను భవనాల పైన పెడుతూ ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించటం లేదన్నారు. నిర్మాణాలు చేపట్టినటువంటి భవనాల పైన కూడా టవర్లు నిర్మిస్తుంటే చుట్టుపక్కల ఉన్నటువంటి వాళ్ళు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒక పక్కన నిర్మించినటువంటి భవనానికి ఎలాంటి పర్మిషన్స్ లేకున్నా జీహెచ్ఎంసీ అధికారులు టవర్స్ నిర్మించుకోవడానికి సెల్ టవర్ యజమానులకు పర్మిషన్ ఇస్తున్నారని ఉందా లేదా చూసి కనీసం 300 గజాలు ఉన్న భవనాలకు టవర్స్ ఏర్పాటు చేసుకునే పర్మిషన్ ఇస్తే బాగుంటుందని, ఈ ప్రాంతంలో 60 గజాలు 80 గజాలు 100 గజాల భవనాలలో కూడా టవర్స్ నిర్మిస్తున్నారని ఇలాంటి నిర్మాణాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి పర్మిషన్ లేకుండా చట్ట విరుద్ధంగా నిర్మించిన టవర్స్‌ను మొత్తం తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సూరారం డివిజన్ కార్యదర్శి అంజయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కుంపులో సత్ జ్ఞాన్ హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఆత్మరక్షణకై నేర్చుకునే కుంపు విద్యలో సత్ జ్ఞాన్ హై స్కూల్ వెంకటేశ్వర్ నగర్ విద్యార్థులకు సోమవారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించబడింది. దీనిలో 100 మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను చాటి తగు బెల్టులు సాధించారు. దీనికి ముఖ్యఅతిథిగా సత్ జ్ఞాన్ హై స్కూల్ కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశం పాల్గొని విద్యార్థులను అభినందించారు. వీరిలో గెలుపొందిన వారికి గోల్డ్ సిల్వర్, బ్రాంజ్ మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. లయన్ చింతల మల్లేష్ మాట్లాడుతూ...ఆకతాయిల ఆగడాల నుంచి బాలికలు తమను తాము రక్షించుకోవడం, శారీరక ధృఢత్వం సాధించడం, మానసి కోల్లాసం కలిగించేందుకు ఆత్మరక్షణ విద్య ఎంతో ఉపయోగపడుతుంది. కుంపు నేర్చుకుంటే బాలికల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని, ధైర్యంగా ఆకతాయిల వేధింపులను ఎదుర్కొంటారన్నారు. ఏదో ఒకరూపంలో వేధింపులకు గురవుతున్న తరుణంలో ఈ విద్య ఎంతో ప్రయోజనం కలిగించనుందన్నారు. ఈ కార్యక్రమంలో వాయుపుత్ర స్కూల్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్, గ్రాండ్ మాస్టర్ పాముల వినోద్ కుమార్, ఇన్స్ట్రక్టర్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు క్రీడల నిర్వహణపై సదస్సు



నవతెలంగాణ-మల్కాజిగిరి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ పురస్కరించుకొని మేడ్చల malkajgiri జిల్లాలో ఉన్న విలాంగులకు క్రీడలు నిర్వహించాలనే అంశం పైన సదస్సు నిర్వహించారు. డిసెంబర్ 03.12 ప్రపంచ వికలాంగుల దినోత్సవం ఆ రోజు ఎలక్షన్ కోడ్ ఉండడం వల్ల క్రీడలు నిర్వహించలేదు . కావున ఈ నెల తేది.13.12న మానసిక వికలాంగులకు శారీరక వికలాంగులకు వినికిడి లోపం వారికి కంటి చూపు లేని వారికి అందరికీ కలిపి హెలెన్ కెల్లర్ విద్య సంస్థలో ఈ క్రీడలు నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధంచిన వాల్ పోస్టరస్ విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టంట్ డైరెక్టర్ కృష్ణ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ యాదగిరి, హెలెన్ కెల్లర్ విద్య సంస్థల చైర్మెన్ పాఠాన్ ఉమర్ ఖాన్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎన్.వినయ్, ఆర్.కృష్ణ, నాయక్ సాక్ష్యం నేషనల్ ఆర్గనైజేషన్ excutive మెంబర్ ఆర్.శంకర్ నాయక్, వివిధ సంఘాల నాయకులతో కలిసి ఈ వాల్ పోస్టర్ విడుదల చేశారు.

నాణ్యత పాటించకుంటే ఉపేక్షించేది లేదు



● బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఏర్వ.శంకరయ్య

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

డ్రయినేజీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే ఉపేక్షించేది లేదని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, ఆదర్శనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు ఏర్వ. శంకరయ్య అన్నారు. సోమవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్‌లో సుమారు రూ.72 లక్షలతో జరుగుతున్న భూగర్భ డ్రయినేజీ పనులను సొసైటీ డైరెక్టర్లు, సంక్షేమ సంఘంనాయకులు, స్థానికులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు ఎం.దుర్గ, వి.ఆంజనేయులు, కే.నాగభూషణం, నాగదేశి రవికుమార్, చంద్రశేఖర్, పీవీఎల్.నాంచారమ్మ సంక్షేమ సంఘం నాయకులు కోటేశ్వరరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



● కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండ, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అధికారులకు తెలియచేశారు. సోమవారం డివిజన్ పరిధిలోని అలీ తలబ్ చెరువు అలుగు (తూము) నుండి నీరు బయటికి వెలువడుతుందని తెలియడంతో ఇరిగేషన్ అధికారులతో కలిసి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ అలీ తలబ్ చెరువు అలుగు (తూము) నుండి నీరు బయటికి వెలువడుతుందడంతో వెంటనే వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. నీరు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా జేసీబీ సహాయంతో మరమ్మతులు చేయించడం జరిగిందన్నారు. ఔట్ లెట్ ద్వారా వెలువడు తున్న నీటి ప్రవాహం ద్వారా చెరువు దిగువున గల కాలనీలు, లోతట్టు ప్రాంతా లు ముంపుకు గురి కాకుండా ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ఇరిగేషన్ అధికారులు తగు చర్యలు తీసుకో వాలన్నారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ రతన్ నాయక్, నాయకులు కుమార స్వామి, మాధవ్, కాలనీ వాసులు హరి సురేష్, కోటేశ్వర్ రావు, విజయ్, నాగేశ్వర్ రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ఎంఎల్ఆర్ఐటీ'ని సందర్శించిన జెడీ లక్ష్మీనారాయణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలను సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థులతో కలిసి మాట్లాడారు. కాలేజీలోని వివిధ విభాగాలు, క్రీడా సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్తులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ చాలా అవసరం అన్నారు. క్రీడలకు కూడా కొంత సమయం కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కళాశాలలో విద్యతోపాటు క్రీడలకు కూడా అన్ని అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, డైరెక్టర్‌లు శ్రేయారెడ్డి, ధీరన్‌రెడ్డి, కోశాధికారి మర్రి మమతారెడ్డి, డీన్ రాధికాదేవి, అరుంధతి హాస్పిటల్ డీన్ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

కళ్లెం పాఠశాలలో 2000-2001 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు తమకు విద్యనందించిన గురువుల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికి ఒకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ, గురువులకు పాద నమస్కారం చేస్తూ తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. గురువులు మాట్లాడుతూ తాము విద్యాబుద్ధులు నేర్పించిన వారు మంచి స్థాయిలో ఉన్నందుకు గర్వంగా ఉందన్నారు. మీరంతా సమాజ నిర్మాణానంలో భాగస్వాములు కావాలని, ఆత్మీయ సమ్మేళనం మధుర స్మృతులకు వేదిక అన్నారు. తదనంతరం విద్యార్థులు గురువులను సన్మానించి అంబేద్కర్ మెమెంటోను జ్ఞాపికగా అందించారు. ఈ కార్యక్రమంలో గురువులు రామచంద్రారెడ్డి, టి.ఐలయ్య, బద్రుద్దీన్, ఎం.ఐలయ్య, సుకుమారి, పూర్వ విద్యార్థులందరూ పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా ఆగని కబ్జాల పర్వం

● సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కబ్జాకు కాదేది అనర్హం అన్న చందంగా భూ కబ్జాదారులు ఉన్నారని, ప్రభుత్వాలు మారిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట, గాజులరామారం డివిజన్ పరిధి ఖాళీ స్థలాలలో వారి పరంపరను నాయకుల, అధికారుల అండదండలతో కొనసాగిస్తున్నారని సీపీఐ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ.ఉమా మహేష్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, అధికారంలోకి వస్తే కబ్జాలను అరికట్టి, కబ్జాదారుల పై కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్, ప్రభుత్వం వచ్చినప్పటికీ కబ్జాదారులు అవేమి పట్టించుకోకుండా పట్టపగలు అధికారుల కబ్జాలు చెయ్యడం ఘోరమని అన్నారు. అధికారులకు కబ్జాల గురించి తెలిసీ కూడా ఉదాసీనత వ్యవహరించడం వల్ల పేద ప్రజలను కబ్జాదారులు లక్షల్లో మోసంచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు కండ్లు తెరిచి వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 348/1, జగద్గిరిగుట్ట, గాజులరామరంలో సర్వేనెంబర్ 342,326,307,306, లలో ఉన్న మొత్తం ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని ఈ విషయంపై మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను కలిసి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతామని తెలిపారు. లేనిపక్షంలో ప్రజాదర్బార్‌లో సీఎం. రేవంత్ రెడ్డికి వినతిపత్రం ఇస్తామని పేర్కొన్నారు.

17న అల్వాల్‌లో బ్రహ్మోత్సవాలు



● ఆలయ వంశపారంపర్య చైర్మెన్ రాజా గోపాల్ సెంచర్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అల్వాల్‌లోని బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 17 వ తేది బ్రహ్మోత్సవాల అంగరంగ వైభవంగా నిర్వహించమనున్నట్లు ఆలయ వంశపారంపర్య చైర్మెన్ రాజా గోపాల్ సెంచర్ తెలిపారు. సోమవారం ఆయన దేవాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 17 వ తేదీన బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ బ్రహ్మోత్సవాలు విజయ వంతానికి భక్తులు,ప్రజలు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వీరేశం, మునిసిపల్ సూపర్డెంట్ స్వామి, గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ ప్రసన్న కుమారి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ స్థానిక పోలీస్ సిబ్బంది వెంకట రామిరెడ్డి, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కానిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, దొడ్ల వెంకటేష్ గౌడ్. పండాల సతీష్ గౌడ్, శ్రీహరి, మాజీ కార్పొరేటర్ రంగారావు, పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సమస్యలను త్వరగా పరిష్కరించండి

● చెరుకుపల్లి భరత సింహారెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో కుత్బుల్లాపూర్ గ్రామంలో కుత్బుల్లాపూర్ గవర్నమెంట్ హై స్కూల్‌లో శానిటైజషన్ , కాంపౌండ్ వాల్ గేట్ వీరిగిపోయింది. పిల్లలకు తీవ్రమైన ఇబ్బంది కల్గుతుందని హెడ్ మాస్టర్ కమల్ సింగ్ చెరుకుపల్లి భరత సింహారెడ్డి తెలియజేశారు. వెంటనే స్పందించిన భరత్ సింహారెడ్డి కుత్బుల్లాపూర్ గవర్నమెంట్ స్కూల్‌లో సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకొని నూతనంగా మన ఊరు - మన బడి కార్యక్రమంలో సాంక్షన్ అయిన నిధులతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలనీ సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో 132 జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు పులి బలరాం, నార్లకంటి దుర్గయ్య, సాయిలు, సందీప్ గౌడ్, వీరేశం, లక్ష్మి, వనజ, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పరిశీలించిన మర్రి



నవతెలంగాణ-మల్కాజిగిరి/నేరెడ్‌మేట్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సోమవారం మల్కాజిగిరిలోని బండ చెరువు, ఆర్.కే.పురం చెరువులను స్థానిక కార్పొరేటర్లు రాజ్యలక్ష్మితో కలిసి పరిశీలించారు. చెరువు పరివాహక కాలనీల ప్రెసిడెంట్‌లతో కలిసి ఇరిగేషన్, పురపాలక, హెచ్ఎండీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. చెరువులో గుర్రపు డెక్క, దోమల నివారణ చెరువుల సుందరీకరణ తదితర అంశాల పై అధికారులతో మాట్లాడి అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో కలిసి ముందుకు పోవాలని ఆదేశించారు. ఇక్కడి సమస్యను శాశ్వత పరిష్కారం కల్పించాలని అధికారులకు సూచించా రు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటి కమిషనర్ రాజు, డీఈ జగన్మోహన్, ఎంటమాలజీ ఎస్ఈ. దుర్గా ప్రసాద్, డిఈ.లౌక్య, ఏఈ. శ్రీనివాస్, సుజాన, ఇరిగేషన్ ఏఈ. ఈ పృథ్వి, కార్పొరేటర్లు మీన ఉపేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: మల్కాజిగిరి చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొని, తనను మీ కుటుంబంలో ఒకనిగా అనుకొని కష్టపడి పని చేశారని తెలిపారు. మీ అందరికీ రుణపడి ఉంటానని పేరుపేరునా ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. మీకు ఏ అవసరం వచ్చినా తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటూ మీ సమస్యలను తన సమస్యలు గా భావించి అండగా ఉంటానని పేర్కొన్నారు. వ్యాపారాల కు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా మీకు తోడు ఉండి మీ కష్టాల్లో భాగస్వామ్యం అవుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమ ంలో చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.రాజు, ఉపాధ్యక్షులు విజయ్, కోశాధికారి రాజేష్, గోపాల్, యాప్రాల్ శ్రీనివాస్ రెడ్డి, నరేష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.



మర్రిని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ప్రగతి బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

బాచుపల్లి కుత్బుల్లాపూర్ దుండిగల్ మండలాలలోని ప్రభుత్వ, ప్రభుత్వం స్కూల్స్ విద్యార్థిని విద్యార్థులు బాలోత్సవాల సందర్భంగా నిర్వహించిన 13 రకాల ఈవెంట్స్‌లో పాల్గొని వారి నైపుణ్యాలను ప్రదర్శించారు. నిర్వాహకులు ప్రగతి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ఎస్ మాధవి, సుందరయ్య భవన్ నిర్వహణ కన్వీనర్ సిహెచ్ మల్లయ్యచారి, పీపుల్స్ ట్రస్ట్ సమన్వయకర్త సిహెచ్ కష్టారావు ఈ సందర్భంగా మాట్లాడారు. బాల బాలికలలోని వారి టీం నైపుణ్యాన్ని వెలికి తీసే దానికోసం మొట్టమొదటిసారి ఈ ప్రయత్నం చేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బాల బాలికలు వారిలో నైపుణ్యాన్ని ప్రదర్శించటానికి ఒక వేదికగా ప్రగతి విద్యానికేతన్ నిర్వహించడం మంచి అవకాశంగా భావిస్తున్నా అన్నారు. విద్యార్థిని విద్యార్థుల మనోవికాసానికి, ఉల్లాసానికి, ఉత్సాహానికి వారిలోని ప్రతిభను వారు తెలుసుకునే విధంగా భవిష్యత్తులో వీరి నైపుణ్యాన్ని పెంచుకునే దానికోసం కృషి చేస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రగతి బాలోత్సవ కమిటీ చేసిన తొలి ప్రయత్నంలోనే మూడు మండలాల పరిధిలో 36 స్కూలుకు సంబంధించిన విద్యార్థులు సుమారు 1600 మంది పాల్గొన్నారు. భవిష్యత్తులో ఈ బాలోత్సవ కార్యక్రమాన్ని విస్తతస్థాయిలో నిర్వహించే దానికోసం ప్రయత్నిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ అల్పాహారం మధ్యన విందు ఏర్పాటు కూడా చేయటం జరిగిందన్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ప్రగతి సెంట్రల్ స్కూల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి. పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ అధినేత డి దయాకర్ రెడ్డి బహుమతి ప్రదానోత్సవం చేశారు. ఈవెంట్స్‌లో ప్రతిభ కనబరిచిన టీమ్స్‌కు మొదటి రెండు మూడు బహుమతులతో పాటు రెండు ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ స్వతంత్ర కార్పొరేటర్స్ ఆర్ శ్రీరాములు, బి.వెంకట రామయ్య, మొన్డెం సుజాత, కాలనీ ఫౌండర్స్ సోమిరెడ్డి, సూర్య ప్రకాష్, బాల వెంకటేశ్వరరావు, శంకర్‌రావు, వాలంటీర్లుగా ఎం చంద్రశేఖర్, బాలపీరు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, యువనేతకు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

యువ నాయకులు, విద్యావంతుడు, హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌కి శుభాకాంక్షలు తెలిపేందుకు కుత్బుల్లాపూర్‌కి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్దకు చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నేను ఎన్నడూ మర్చిపోని విధంగా ఇంతటి అఖండ విజయాన్ని అందించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

జగద్గిరిగుట్ట: అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వివేకానంద్ రాష్ట్రంలోనే భారీ మెజార్టీతో గెలిచిన సందర్భంగా సోమవారం ఆయన నివాసం వద్ద రంగారెడ్డి నగర్ డివిజన్, విజయనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మొహమ్మద్ రియాజ్, ఉపాధ్యక్షులు బాలునేత, నందనగర్ అధ్యక్షులు బి.కార్తీక్ గౌడ్, స్థానిక నాయకులు సాముల బ్రహ్మం, రాజశేఖర్‌లు కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తాము అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.



ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మెన్ మన్నే రాజు, మాజీ కౌన్సిలర్ రంగా రావు, డివిజన్ అధ్యక్షులు పోలె శ్రీకాంత్, సీనియర్ నాయకులు ప్రభాకర్ ముదిరాజ్, శ్రీనివాస్, రవి, వారాల వినోద్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ విజయ దుర్గ దేవస్థానంలో నవచండీ యాగం

కుత్బుల్లాపూర్: సోమవారం 130 సుభాష్ నగర్ డివిజన్ సూరారం మార్కెట్ రోడ్డులో గల శ్రీ విజయ దుర్గ దేవస్థానంలో ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ శ్రీరామశర్మ చక్రధారి, దేవస్థాన అధ్యక్షులు వెంకట స్వామి గార్ల ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్న నవ చండీ యాగం కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పీ.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పీ.వివేకానంద్ మాట్లాడుతూ దైవ చింతనతో మానసిక ప్రశాంతతో పాటు పనుల్లో విజయం చేకూరుతుందన్నారు.

కుత్బుల్లాపూర్: కార్తీక మాసం చివరి రోజు, చివరి సోమవారం కావడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా శైవక్షేత్రాలతో పాటు అన్ని ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. సూరారం శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో చివరి సోమవారం సందర్భంగా శ్రీ ఉమామహేశ్వర కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి హంపి పీఠాధిపతులు విద్యారన్న భారతి స్వామీజీ, స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, లాండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఆఫీసర్స్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఏర్పాట్లలో మహిళలు కార్తీకదీపం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ ఉమామహేశ్వర దేవాలయ ధర్మకర్త ముద్దాపురం మదన్ గౌడ్ కుటుంబ సమేతంగా భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా ముద్దాపురం మదన్ గౌడ్ తగు జాగ్రత్తలు తీసుకున్నారు.ఈ కార్తీకమాసం నెల రోజుల నుండి వివిధ అలంకరణలతో స్వామి వారు దర్శనం ఇచ్చారు. ఉదయం 4 గంటల నుండి క్యూ లైన్‌లో గంటల తరబడి నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు.అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.



చివరి సోమవారం కావడంతో భక్తులతో కిక్కిరిసిన శ్రీ ఉమామహేశ్వర క్షేత్రం



యాంత్రిక జీవనానికి అలవాటు పడిన ప్రజలకు ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సోమవారం గాజులరామారం డివిజన్ జగద్గిరిగుట్ట శివాలయంలో శివ స్వాముల ఇరుముడి పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రావుల శేషగిరి,(అయ్యప్ప స్వామి)కొలుకుల జగన్ (శివస్వామి) మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి, యువజన విభాగం సీనియర్ నాయకులు కొలుకుల జైహింద్, డివిజన్ బీసీ సెల్ అధ్యక్షులు పీర్తి విటల్, ఎస్సీ సెల్ అధ్యక్షులు చుండూరు దాసు, డివిజన్ యువజన విభాగ అధ్యక్షులు రాయి విగ్నేష్, శివ స్వాములు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మాకు ఉచితంగా సౌకర్యం కల్పించాలి

అబ్బాయిల ఆందోళన వ్యక్తం



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9 నుండి ఆర్టీసీ బస్సుల్లో తాము ఇచ్చిన హామీల్లో భాగంగా మహి ళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ల్లో ప్ర యాణ సౌకర్యం కల్పించిన విషయం తెల్సిందే. దానిలో భాగంగా ఒక వైపు మహిళలు పురుషు లు సమానం అని చెపుతున్న పాలకులు మరి అదే స్ఫూర్తితో ఆర్టీసీ బస్సు ల్లో తమకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం మధ్యాహ్నం తార్నాక బస్టాండ్ ఎదుట కొంతసేపు ధర్నా చేపట్టారు. మహిళలతో పాటుగా తమకు సౌకర్యం కల్పించాలని కోరారు. మరొక ఇది చూస్తున్న అక్కడే ఉన్న మహిళలు ,పురుషులు కొంత సేపు నవ్వుతూ ఉండి పోయారు. తరువాత పోలీసులు సర్ది చెప్పి అక్కడ నుండి విద్యార్థులను తీసుకు వెళ్లారు.

కవితా దుందుభి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఓయూ సాహిత్య వేదిక

నవతెలంగాణ-ఓయూ

ఓయూ సాహిత్య వేదిక ఆరవ వార్షికోత్సవం సందర్భంగా డిసెంబర్ 14 మధ్యాహ్నం 2గంటలకు జరుగుతున్న "కవితాదుందుభి" కార్యక్ర మానికి విద్యార్థులు, పరిశోధకులు, సాహిత్యాభిలాషులు హాజరై విజయ వంతం చేయాలని ఓయు ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపల్ చింతా గణేష్, తెలుగు శాఖ అధ్యక్షులు చింతకింది కాశీం కోరారు. ఓయూ సాహిత్య వేదిక కవితా దుందుభి కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణలో బాగంగా పాల్గొ న్న చింతా గణేష్ మాట్లాడుతూ ఓయూలో సాహిత్య విలువలను పెంపొ ంది ంచే ఇటాంటి కార్యక్రమాలు ఇంకా ఎన్నో జరగాలని, వాటికి ఆర్ట్స్ కాలేజీ నుండి పూర్తి సహకారంఉంటుంది అనిచెప్పారు.ఓయూలో సాహిత్య చర్చ ల కోసం 2017లో పరిశోధక విద్యార్థులు నిర్మాణం చేసిన ఓయూ సాహి త్య వేదిక అనే సంస్థ చేస్తున్న కవితా దుందుభి కార్యక్ర మానికి అందరూ హాజరై కవితా గానాన్ని వినాలన్నారు. ఈ కార్య క్రమంలో ఓయూ సాహి త్య వేదిక కార్యవర్గ సభ్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేబీఎస్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సోమవారం జేబీఎస్‌లో ఆకస్మికంగా తనిఖీచేశారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. బస్సులో ఎక్కిన మహిళలను కలిసి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశా మని చెప్పారు. ప్రయాణికులు కూడా సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తిచేశారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే అధికారుల దృష్టికి తెచ్చేందుకు ప్రత్యేకంగా కాల్‌సెంటర్ ఏర్పాటు చేసినట్టు వివరించారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

ద్విచక్ర వాహనదారుడిని తప్పించబోయిన రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న సంఘటన బోయిన్‌పల్లిలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే చిన్న తోకట్ట మీదగా ఎదురెదురుగా రెండు ఆర్టీసీ బస్సులు వస్తుండగా మధ్యలో నుంచి ఓ వాహనదారుడు క్రాస్ చేయబోయాడు. దాంతో ఆ వాహనాదారున్ని తప్పించేందుకు ఆర్టీసీ డ్రైవర్లు ఆకస్మిక బ్రేక్ వేశారు. దీంతో రెండు బస్సులు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. బస్సు లో ఉన్న ప్రయాణికులకు పెద్ద ప్రమాదం ఏమీ జరగ్గలేదు కానీ స్వల్పంగా కొంత మందికి గాయాలయ్యాయి. రెండు బస్సులు ఢీకొనడంతో అక్కడ రాకపోకలు కొంత సేపు నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దీంతో బోయిన్‌పల్లి పోలీసులు రంగ్గంలో దిగి గాయాలైన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే రాంగ్ సైడ్ నుంచి వచ్చిన ద్విచక్ర వాహనదారుల వివరాలు కూడా తెలుసుకొని చర్యలు తీసుకునే పనిలో బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

సంకేత్ సంస్థ అధ్వర్యంలో నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహ కారాలు ఎల్లప్పుడూ అందిస్తానని మాజీమంత్రి, సనత్ నగర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్ నగర్ నుండి మూడోసారి భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా సోమవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని నివాసం వద్ద తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సంకేత్ సోషల్ అవేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మురళీ అధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సనత్ నగర్ లోని రవీందర్ నగర్ కాలనీ కి చెందిన విజయ్ ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు, ప్రశాంత్, ఇంకా నియోవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందినవారుతలసానిశ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రెట్టించిన ఉత్సాహంతో సేవలు అందిస్తా

- హ్యాట్రిక్ విజయం మా బాధ్యతను పెంచింది పద్మారావు గౌడ్



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గంలో నిరంతరం తాను ప్రజలకు అందుబాటులో నిలిచి తన వంతు సేవలు అందించానని, సీతాఫల మండీలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు శ్రమించానని, అందుకే ప్రజలు తనను ఆదరించారని పద్మారావు గౌడ్ అన్నారు. ఎం ఎల్‌ఏగా ఎన్నికయ్యాక తొలిసారిగా పద్మారావుగౌడ్ సోమవారం సికింద్రాబాద్ నియోజకవర్గంలో పర్యటి ంచారు. సీతాఫలమండీలోని ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలను నిర్వహిం చారు.ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ కు స్థానికులు, కార్యకర్తల నుంచి ఘన స్వాగతం లభించింది. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయ చరిత్రను తిరగరాస్తూ ఏకంగా 45 వేల ఓట్ల ఆధిక్యతను సొంతం చేసుకొని విజయాన్ని సాధించడంతో పాటు హ్యాట్రిక్‌ను పొందగలిగారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఎం ఎల్ ఏ క్యాంపు కార్యాలయానికి చేరుకొని అభినందించారు.ఎంఎల్‌ఏగా తనకు కల్పించిన అధికారాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తానని అయన పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, వారి సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు.కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ లతో పాటు యువనేత రామేశ్వర్ గౌడ్, కరాటే రాజు నాయకులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల్లో మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులోఉండాలి

- తెలంగాణ డీఎంఈ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డి



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

మారుమూల ప్రాంతాల్లో కూడా మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని తెలంగాణ డీఎంఈ డైరెక్టర్ డాక్టర్ రమేష్ రెడ్డి అన్నారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ (ఐపీఎస్) - తెలంగాణ స్టేట్ బ్రాంచ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకియాట్రీ, అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ అధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 'మానసిక సేవలను స్థాపించడం' అనే థీమ్‌తో 9వ మిడ్ టర్మ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన రమేష్ రెడ్డి ప్రారంభించారు. గౌరవ అతిథిగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, ఎర్రగడ్డ మెడికల్ సూపరింటెండెంట్, తెలంగాణ మెంటల్ హెల్త్ అథారిటీ సీఈవో డాక్టర్ ఉమా శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్‌లో అద్భుతమైన సూచ నలు అందించే చర్చలు జరుగుతాయన్న నమ్మకం ఉందన్నారు. ఈ రంగంలో నిపుణులు వచ్చారని, మన దేశంలో ఉన్న పరిమితులు, మనోరోగ చికిత్స సేవలు తెలుసని తెలిపారు. ఈ రంగంలో అర్హత కలిగిన నిపుణుల లభ్యత చాలా ముఖ్యమైన పరిమితుల్లో ఒకటన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు బోధనా సంస్థలలో అటువంటి నిపుణులు ఎంతమంది ఉన్నారన్నదే ప్రశ్న అన్నారు. మానసిక వైద్యం వైద్య కళాశాలలకే పరిమితమైందన్నారు. అక్కడ కూడా పూర్తి స్థాయిలో లేదన్నారు. కేవలం ఎంసీఐ లేదా ఎన్ఎంసీ కోసం మాకు ఒక విభాగం ఉండేదన్నారు. ఈ వైద్య సంస్థలలో అవి నామమాత్రపు విభాగాలుగా ఉన్నాయన్నారు. భారత ప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిడితో ఈ రోజు సుప్రీం కోర్టుతో సహా న్యాయ వేదికలు, దేశంలోని వివిధ ప్రాంతాలలో, ముఖ్యంగా సంస్థలలో మనోరోగ చికిత్స సేవలను అమలు చేయాలని పట్టు బడుతున్నాయని తెలిపారు. ఇకపై మనోరోగ్న చికిత్సను విస్మరిం చలేమన్నారు. మానసిక ఆరోగ్య చట్టం అమలుతో ప్రతి ఒక్కరూ దీనిని మరింత శాస్త్రీయ పద్దతిలో అమలు చేయడం తప్పనిసరి అవుతుందని చెప్పారు. మనకు చట్టాన్ని అమలు చేయడానికి ఒక నిర్దిష్ట సంస్థ ఉందని, ఆ సంస్థకు డాక్టర్ ఉమా శంకర్ సీఈవో అన్నారు. ఆయన చాలా మంచి పని చేశారన్నారు. ముఖ్యంగా నియమాలు, నిబంధనలు రూపొందించడంలో ఈ సంస్థ సంస్థలను తనిఖీ చేయడం ప్రారంభించిందని తెలిపారు. ఈ ప్రత్యేక రంగాన్ని దోపిడీ చేసే వారు చాలా మంది ఉన్నారన్నారు. ఎందుకంటే, సేవల అవసరం ఉందని, ప్రయివేటు రంగంలో ఈ సేవలు సాధారణ ఆస్పత్రులలో అందించబడవన్నారు. సహజం గానే పునరావాస కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయన్నారు. ఈ కేంద్రాలు రోగ్గులను దోపిడీ చేస్తున్నాయన్నారు. కొన్ని పునరావాస కేంద్రాలు సినిమాల్లో చూపించిన మాదిరి చేస్తున్నాయన్నారు. పునరావాస కేంద్రాలకు సరైన నియంత్రణ లేకపోవడంతో కేవలం డబ్బు కోసం రోగ్గులను తీసుకెళ్లి ఆ తర్వాత అక్కడ వదేస్తున్నారన్నారు. ఇప్పుడు పనులు మరింత క్రమపద్ధతిలో సాగుతాయని, రాబోయే రోజుల్లో క్రమబద్ధీకరించబడతాయని నమ్మకం ఉందన్నారు. అదే సమయంలో వైద్య సంస్థలు, వైద్య కళాశాలలు మానసిక వైద్య సేవలను మెరుగుపరచడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతి జిల్లాలో దాదాపుగా ఒక వైద్య కళాశాల ఉందన్నారు. ఈ కళాశాలల్లో మానసిక వైద్య విభాగాలు ఉన్నాయన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్, సెకండరీ కేర్ ఆస్పత్రుల్లో నియమించబడిన మానసిక వైద్యుల సహకారంతో వారి సేవలను జిల్లా మొత్తానికి విస్తరింపజేయడం చాలా ముఖ్యమన్నారు. వైద్య కళాశాలలలో ఈ సేవలను తప్పనిసరి చేశామన్నారు. అనేక మంది విద్యా ర్థులు వివిధ ఒత్తిళ్ల కార ణంగా ఆత్మహత్యలకు పాల్పడటం చూస్తున్నామన్నారు. అటువంటి విద్యా ర్థులకు కౌన్సెలింగ్ అవసరమన్నారు. ప్రతి వైద్య కళాశాలలో ఒక ప్రత్యేక ప్రాంతాన్ని కలిగి ఉండటాన్ని తప్పనిసరి చేశామన్నారు. మానసిక రోగులను డిశ్చార్జ్ చేసేటప్పుడు ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు, కుటుంబాలు వారిని వెనక్కి తీసుకోవడానికి ఇష్టపడటం లేదని చెప్పారు. వారిని తిరిగి సమాజానికి పంపేలోపు వారిని ఉంచడానికి గృహాలు అందుబాటులో లేవన్నారు. అందువల్ల, మనం బహుళ రంగాలపై దృష్టి పెట్టాలన్నారు. అప్పుడే ఉత్తమమైన మానసిక వైద్య సేవలను అందించగలుగుతామని తెలిపారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ - తెలంగాణ స్టేట్ బ్రాంచ్ ఈ సదస్సు నుంచి కొన్ని మంచి సూచనలతో ముందుకు రావడం చాలా ముఖ్యమై నదన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వాలు పని చేయడానికి, మెరు గైన సేవలను అందించడానికి ఇది ఒక ఆధారమన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో విద్యాపరమైన సెషన్‌లు మాన సిక చికిత్స, డి-అడిక్షన్ సేవలు, చైల్డ్ సైకియాట్రీ, పున రావాసం, టెలిసైకియాట్రీ, వృద్ధాప్య సేవలు, నర్సింగ్ హోమ్‌లు మొదలైన మానసిక ఆరోగ్య సంరక్షణ అంశాల స్పెక్ట్రమ్‌ను కవర్ చేశాయి. ఈ చర్చలు సమగ్ర మానసిక ఆరోగ్యాన్ని స్థాపించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాయి. ఈ కార్యక్రమంలో ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ జనరల్ సెక్రటరీ, తెలంగాణ మెంటల్ హెల్త్ అథారిటీ సీఈవో డాక్టర్ అరవింద బ్రహ్మ, ఐపీఎస్ - టీ ఎస్ బీ వైఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ అశోక్ కే అలీంచందానీ, డాక్టర్ నేహా మహేంద్ర గాలా, ఆర్గనైజింగ్ ట్రెజరర్ నరేష్ వడ్లమాని, ఐపీఎస్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ మిన్హాజాఫర్ నసీరాబడి, ఐపీఎస్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి విశాల్ ఆకుల, ఐపీఎస్ తెలంగాణ రాష్ట్ర శాఖ కోశాధికారి డాక్టర్ అనిత రాయరాల, గౌరవ సంపాదకులు డాక్టర్ ఫణికాంత్ కొండపర్తి, అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సీవోవో అపర్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అపోలో మెడికల్ కాలేజీ హైదరాబాద్, చిత్తూరులో రెండు మెడికల్ కాలేజీ క్యాంపస్‌లలో పనిచేస్తుంది. హైదరాబాద్ క్యాంపస్ జూన్ 2017లో ఎంసీఐ నుంచి యూజీ గుర్తింపు పొందింది. 53 సీట్లతో 18 విభా గాలలో పీజీ మెడికల్ కోర్సులను స్థాపించే ప్రక్రియలో ఉంది. చిత్తూరులోని మెడికల్ కాలేజ్ క్యాంపస్ 150 మంది ఎంబీబీఎస్ విద్యార్థులతో 8వ బ్యాచ్‌కి అగస్టు 2024లో ప్రవేశం కల్పిస్తోంది. అపోలో గ్రూప్ చిత్తూరు నగ్గరంలో నాలెడ్జ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇది చిత్తూరులోని సాధారణ ప్రజలకు, భారతదేశంలో విభిన్న విద్య, ఉపాధి అవకాశాలు అందిస్తుంది.

డిమెన్షియా వ్యాధిపై ఒక్క రోజు అవగహన సదస్సు

- ముందస్తు రోగనిర్ధారణనుతో వ్యాధి నిర్మూలన
- పవిత్రా గంగాధరన్



నవ తెలంగాణ-బంజారాహిల్స్

ప్రస్తుత జీవనశైలి ఆహారపు అలవాట్లతో తెలివితేటలు, జ్ఞాపకశక్తి,వివేకాన్ని క్రమంగా క్షీణింప చేసే డిమెన్షియా వ్యాధికి ప్రస్తుతం ఎలాంటి చిక్సిత లేదనీ అందుకే దీన్ని నివారించుకోవటానికి జీవనశైలి మార్పులు అలాగే సమయపాలన ఎక్కువగా ఎలక్ట్రానిక్ వస్తు వుల వినియోగం వల్ల ప్రస్తుతం భారతదేశంలో 8.8 మిలియన్ల మంది ప్రజలు అస్థిరమైన జీవితాన్ని కొనసాగిస్తున్నారని ఈ ధోరణ ఇలాగే కొనసాగితే జ్ఞాపకాలు,వ్యక్తిత్వం క్షీణింప చేయటం ద్వారా దేశంలో 2036 నాటికి ఈ సంఖ్య 17 మిలియన్లకు పెరుగుతుందని ఒక అంచనా ప్రకారం తెలిపారు.ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ మద్దతుతో డిమెన్షియా ఇండియా అలయన్స్ సోమవారం బం జారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్‌లో "డిమెన్షియా వ్యాధి పై అవ గహన కొరకే ఉచిత వర్క్‌షాప్"ని క్షేత్ర అసిస్టెడ్ లివింగ్,కేర్ హాస్పిటల్స్ హెరిటేజ్ ఫౌండేషన్ సహకా రంతో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు.ముందుగా జాయింట్ సెక్రటరీ పవిత్రా గంగాధరన్, మాట్లా డుతూ చిత్తవైకల్యం అనేది వృద్ధాప్యం యొక్క సాధారణ భాగం కాదని స్పష్టం చేశారు. ఇది తరచుగా తప్పుగా అర్థం చేసుకోబడుతుందనీ చిత్తవైకల్యంతో జీవిస్తున్న వ్యక్తులు వారి కుటుంబ సంరక్షకులు (తీవ్రమైన జ్ఞాపకశక్తి కోల్పోవడం, దిక్కుతోచని స్థితి,సంచరించడం దారితప్పిపోవడం, తెలిసిన పనులు చేయడంలో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యం చేసే పనులు పరిమిత సామాజిక నైపుణ్యాలు,సవాలు చేసే ప్రవర్తనలు వంటి లక్షణాల వల్ల కలిగే అపారమైన శారీరక, ఆర్థిక, భావోద్వేగ సామాజిక భారాన్ని హైలైట్ చేసింది దీర్ఘకాలిక ఆధారపడటం) "సమర్థవంతమైన సంరక్షణ, చికిత్స ప్రణాళికలతో ముందస్తు రోగ నిర్ధారణ చిత్తవైకల్యం ఈ ప్రభావాన్ని తగ్గించడానికి కొంత ఆశను అందిస్తుందని నొక్కిచెప్పారు. అనం తరం కేర్ హాస్పిటల్ న్యూరాలజీ చీఫ్ డాక్టర్ జేఎంకే మూర్తి నేతృత్వంలోని డిమెన్షియా కేర్ రం గంలోని నిపుణులు డిమెన్షియాపై అవగాహన కల్పించేందుకు ఈ వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. న్యూరా లజిస్టులు డాక్టర్ వై.మురళీధర్ రెడ్డి,డాక్టర్ సయ్యద్ ఉస్మాన్,డాక్టర్ శ్యామ్ జైస్వాల్ డిమెన్షియా యొక్క ప్రారంభ లక్షణాలనూ అలాగే రోగనిర్ధారణ గురించి ప్రేక్షకులకు తెలియజేశారు.చిత్తవైకల్యం ఉన్న వ్యక్తులకు ముందస్తు నుండి పరిస్థితి యొక్క అధునాతన దశల వరకు సంరక్షణ ప్రణాళికను రూపొం దించారు. మానసిక వైద్యనిపుణులు డాక్టర్ హరిణి అట్టూరు డిమెన్షియా మానసిక లక్షణాలపై వివరిం చారు.మనస్తత్వవేత్త డాక్టర్ హేమలత చిత్తవైకల్యం యొక్క న్యూరోసైకోలాజికల్ అసెస్‌మెంట్ గురించి మాట్లాడగా, డెంటిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ ఆకుల చిత్తవైకల్యం సంరక్షణలో దంత పరిశుభ్రత పాత్రను హైలైట్ చేస్తూ మాట్లాడారు. డిమెన్షియా ఇండియా అలయన్స్ లాభాపేక్ష లేని, కుటుంబ సంరక్షణ కేంద్రీ కృత జాతీయ సంస్థ కమ్యూనిటీ ఔట్రీచ్ ప్రోగ్రామ్‌లలో చురుకుగా పాల్గొంటుందనీ విద్యా వర్క్‌షాప్‌లను నిర్వహిస్తుందనీ తెలిపారు.రెండు కీలక సేవలు నేషనల్ హెల్ప్‌లైన్ (8585990990 ఆన్‌లైన్ మెమరీ క్లినిక్ (డెమ్‌క్లినిక్) కుటుంబ సంరక్షకులు,సంస్థాగత సర్వీస్ ప్రొవైడర్లు యువతకు మద్దతునిచ్చే కారణాన్ని సాధించడానికి ఆసక్తిని కలిగి ఉన్న వారికి వివిధ రకాల సభ్యత్వాలను అందిస్తుందనీ మరిన్నివివరాలు www.dementia-India.orgలో అందుబాటులో ఉన్నాయన్నారు.

ముగిసిన గిరిజన ఆశ్రమ పాఠశాలలు జిల్లా జోనల్ స్థాయి క్రీడలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

ముగిసిన తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల వసతి గృహాల తొమ్మిది జిల్లాల జోనల్ స్థాయి క్రీడలు ఆదివారం రాత్రి ముగిశాయి ముగింపు కార్యక్రమానికి బోయిన్పల్లి సిఐ లక్ష్మీనారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

ఓవర్ అల్ ఛాంపియన్స్ విన్నర్స్‌గా హైదరాబాద్ జిల్లా.. రనర్స్ గా వికారాబాద్ పిలిచిందిగిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యం బోయినపల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ లో జరిగిన. ఈ క్రీడలలో వివిధజిల్లాకు చెందిన ఎనిమిది వందల మందిబాల బాలికలు పాల్గొనికబడ్డీ, ఖోఖో, వాలి బాల్, చెస్, క్యారంబోర్డు, టెన్నికాయిట్ వారి ప్రతిభను చూపారు. ముగింపు వేడుకలు బోయినపల్లి ఇన్స్పెక్టర్ లక్ష్మి నారా యణరెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నాగ య్య, తెలంగాణ గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్టర్ సంధ్యా రాణి, తెలంగాణ ఫిస్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మెన్ జం పన్న ప్రతాప్ బోయిన్పల్లి ఎస్సై నాగేంద్రబాబు , విజయ్ కాంత్‌లు ముఖ్య అతిధులు పాల్గొని పలుగుని ముగింపు పోటీలను ప్రారంభించి నేత లకు బహుమతులను సర్టిఫికెట్లను అం దజేశారు. బోయినపల్లి హాస్టల్ ప్రిన్సి పాల్ బానోతు లాలూ నాయక్, అ యనకు సహకరి ంచిన బాలికల హాస్టల్ ప్రిన్సిపాల్ జ్యో తి,నీలిమ, మాధు రిను తెలంగాణ గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్టర్ సంధ్యా రాణి అభినందించారు.

తక్కువ ధరకు నిత్యావసర వస్తువులు అందించడమే లక్ష్యం

తెలుగురాష్ట్రాల బిజినెస్ మెంటర్ శ్రీనివాస్ శరకడం..



నవతెలంగాణ-బంజారాహిల్స్

కేంద్ర ప్రభుత్వ స్టార్ట్ అప్ ఇండియా స్ఫూర్తితో 1280 మండలాల నుంచి 1280 ఇండివిడ్యువల్ బిజినెస్ పర్సన్స్, రెండు తెలుగు రాష్ట్రాల్లో 101 స్టాక్ పాయింట్స్ 4 వేర్ హౌసెస్‌తో చేయబడుతున్న ఎంటీఎఫ్, ద్వారా నిత్యావసర వస్తువులు,లాప్ టాప్, మొబైల్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు,బట్టలు,వివిధ గిఫ్ట్ ఐటమ్స్ తక్కువ ధరలో ప్రజలకు జనవరి 2024 నుంచి అందజేయనున్నారు. సోమవారం బంజారా హిల్స్ లోని ఓ హెూటల్లో ఎంటీఎఫ్ ఆవిష్కరిం చడంతోపాటు 5 రకాల పప్పులను, 6 కేజీల బాక్స్‌గాదాల్ డీల్స్ కాంబో పేరుతో రూపొందించబడిన ప్రొడక్ట్‌ను ప్రముఖ సినీ నటి అప్సర రాణి, బిగ్ బాస్ ఫేమ్ జస్వంత్ పడాల పాల్గొని లాంఛ్ చేశారు. ఎంటీఎఫ్ మెంబర్స్ వారిని అవార్డుతో సత్కరించారు. అనంతరం సీఈఓ శ్రీనివాస్ శరకడం మాట్లాడుతూ.. 2014 లో స్థాపించిన ఐఎస్ఓ సర్టిఫైడ్ డిజిటల్ మార్కెటింగ్ కంపెనీ ఓపెన్ డీజీ విన్యూత్న మార్కెటింగ్ స్టార్ట్ అప్ ద్వారా '1280 మండలాల నుంచి 1280 స్టార్ట్ అప్స్ 3 వేల మందికి ఉపాధి' సాధ్యం చేస్తున్నామన్నారు. డైరెక్ట్ మ్యానుఫ్యాక్చరర్ల నుంచి ప్రోడక్ట్స్ అందడం వలన వినియోగ్గదారునికి కూడా తక్కువ ధరలో ఇచ్చేందుకు సాధ్యపడుతుందని తెలిపారు. రైతుల దగ్గర నుండి సప్లై చేయడం ద్వారా మధ్యలో మిడిల్ మాన్ ఎక్కువగా లేకపోవడం వల్ల చాలా తక్కువ మార్జిన్ తీసుకోవడం వల్ల, కస్టమర్‌కి చాలా తక్కువ రేట్ కి ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ఎవరైతే ఉత్పత్తిదారులు ఉంటారో ఎవరైతే ప్రోడక్ట్ సప్లయర్స్ ఉంటారో మీ మార్కెటింగ్ చేయడానికి మేము 100 శాతం హెల్ప్ చేస్తామనీ రెండు రాష్ట్రాల్లో కూడా విస్తరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల నుంచి 80 ప్లస్ స్టాకిస్టులు, పిక్ పే ప్యాక్ బిజినెస్ హెడ్ పి రాకేష్, హైదరాబాద్ ఈవెం ట్స్ సందీప్ చారీ, ప్రముఖ ఇండస్ట్రియలిస్ట్ యర్రమనేని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం బకాసురులను శిక్షించాలి



1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి

నవతెలంగాణ-బంజారాహిల్స్

కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలకూ పాల్పడిన బకాసురులను సీబీసీఐడీచే విచారణ చేయించి దోషులను రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి డిమాండ్ చేసింది. సోమవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సమితి అధ్యక్షులు మేచినేని కిషన్ రావు,సెక్రటరీ జనరల్ డి.సుదర్శన్‌రావులు విలేకరులతో మాట్లాడుతూ.. గోదావరి జలాల వినియోగ్గ అథారిటీ విషయంలో 12 మంది చీఫ్ ఇంజనీర్లు గోదావరి మీద ఎలాంటి మెగా ప్రాజెక్టు కట్టవద్దని 1999లోనే సూచించారన్నారు.ఈ విషయాన్ని కేసీఆర్ దృష్టికి సైతం తాము తీసుకెళ్లామన్నారు. అయితే ఇవేమి లెక్కపెట్టకుండా అంత పెద్ద ప్రాజెక్టును నిర్మించార న్నా రు. ఈ నిర్మాణాల్లోని అవక తవకలపై నిజాలు నిగ్గు తేలేందుకు నిపుణుల కమిటీని వేయాలన్నారు. తెలం గాణ సాధకుల చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియ జేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం వంద ఎక రాల్లో స్మృతి వనం ఏర్పా టుచేయాల్సిన అవసరం ఉంద న్నారు. ఇందుకోసం నగరంలో వంద ఎకరాల్లో అమర వీరుల, సాధకుల చరిత్రను తెలియజెప్పేలా ఈ స్మృ తివనాన్ని తీర్చిదిద్దాలన్నారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లామని,ఆయన సాను కూలంగా స్పందించారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశ గా చొరవ చూపాలని, వీలైనంత త్వరగా నిర్మాణం చేపట్టాలన్నారు. నిధులు, నియామకాలు, నీళ్ల విషయంలో గ్గత ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వాన్ని నడవలేదన్నారు. ఉద్యమకారులు లేకుంటే తెలంగాణ లేదనే విషయాన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలన్నారు. ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం తొలిప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరారు. ఉద్యమకారుల సమితికి ముఖ్యమంత్రి కోరిన సమయంలో కలిసేందుకు అవకాశం కల్పించాలన్నారు.

న్యాయ విద్యా సీట్లు స్పెషల్ ఫేస్ క్రింద భర్తీ చేయండి



నవతెలంగాణ-ఓయూ

యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న 3 సంవత్సరాల మరియు 5 సంవత్సరాల (న్యాయ విద్య) సీట్లను స్పెషల్ ఫేస్ ద్వారా పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని టీఎస్‌లా సెట్ కన్వీనర్ ప్రొ.పి.రమేష్ బాబుకు సోమవారం విద్యార్థులు వినతిపత్రం అందజేశారు.ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ,సామాజిక తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తాళ్ల అజయ్‌లు మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలోలా(న్యాయ విద్య) అడ్మిషన్లను భర్తీ చేయడంలో భాగంగా ఫైనల్ ఫేస్ అనంతరం కూడా యూనివర్సిటీలలో ఖాళీగా ఉంటున్నటువంటి 3 సంవత్సరాలుఐదు సంవత్సరాల లా అడ్మిషన్లను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ మరియు సామాజిక తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్ లు అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్.పి.రమేష్ బాబుకి వినతి పత్రం అందజేశారు. న్యాయవిద్యను చదువుకోవడానికి గ్రామీణ ప్రాంతాల విద్యార్థిని విద్యార్థులు చాలా ఆసక్తిగా ఉన్న ఈ సందర్భంలో యూనివర్సిటీలలో ఉన్న ఆ ఖాళీలను ప్రత్యేక దృష్టితో తప్పకుండా భర్తీ చేయాలని కన్వీనర్ కి విజ్ఞప్తి చేయడం జరిగింది. వారు కూడా ఈ సంవత్సరం ఎలాంటి ఖాళీలు లేకుండా పూర్తి స్థాయిలో భర్తీ చేస్తామని అన్నారు.

'వాహిని' పలు కళా ప్రక్రియలకు వేదిక

నవతెలంగాణ-కల్చరల్

వాహిని సంస్థ పిల్లలకి యువతకు భిన్న కళా ప్రక్రియలలో శిక్షణ ఇస్తూ జాతి సంస్కృతిని పరిరక్షణలో భాగస్వామ్యులు అయినారని వివిధ రంగ ప్రముఖులు ప్రశంసించారు. శ్రీ త్యాగ రాయ గాన సభ ప్రధాన వేదిక పై ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ద్వితీయ వార్షికోత్సవం నృత్య వాయిద్య సంగీత భరితంగా జరిగింది. బాలలు పాడిన శ్లోకాలు, పిల్లలు చేసిన శాస్త్రీయ నృత్యాలు యువత వీణా వాదనంతో ప్రేక్షకులు పరవశించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న విద్యా వేత్త డాక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ జాతి మనుగడకు సంస్కృతి ఆధారమని కళలే సంస్కృతికి చిరునామా అన్నారు. తల్లి దండ్రులు పిల్లల ప్రథమ గురువులనీ వారికి సంస్కృతిని నేర్పితే సమాజంలో పలు రుగ్మతలు నివారించవచ్చని అయన అన్నారు వాహిని నిర్వహణలో లక్ష్మీ ప్రియ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. జర్నలిస్ట్ స్వప్న మాట్లాడుతూ కళలు ఆత్మ విశ్వాసం మానసిక స్థైర్యం ఇస్తాయని అన్నారు. నిద్ర ఆహారంతో పాటు కళల అభ్యాసం నిత్య జీవితం లో భాగం కావాలని అప్పుడు ఎలాంటి ఒత్తిడి నైన తట్టుకొనే శక్తి వస్తుందని వివ రించారు. వాహిని సంస్థ చిన్నారులకు సైతం కళలో శిక్షణ ఇవ్వటం అభినందనీయం అని ఇందుకు సహకరిస్తున్న గురువులను ప్రశంస లు అన్నారు. ప్రముఖ వాయులీన నిపుణులు అచుత కుమారి గాన సభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తి దీపారాధన చేసి కార్యక్రమాన్ని ఆరంభించగా సంస్థ స్థాపకురాలు శంకరమంచి లక్ష్మీ ప్రియ స్వాగతం పలికారు



రాబోయే ఎన్నికలకు అధికారులు సంసిద్ధంగా ఉండాలి

- ఎన్నికల విషయంలో అధికారులకు మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ సూచనలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

త్వరలో జరగబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పటిష్టమైన నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా రాబోయే ఎన్నికలకు అధికారులందరూ సంసిద్ధంగా ఉన్నారని, ఈ విషయంలో వారితో సమావేశాలు, సమీక్షలు నిర్వహించి ఎన్నికల విధుల గురించి తెలియజేస్తున్నామని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటిస్తూ అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. ఎన్నికల విధులు నిర్వహించడంలో ఎప్పటికప్పుడు సమీక్షలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు సూచనలు చేసి ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరిచేస్తున్నట్టు తెలిపారు. ఓటరు జాబితాను మరోసారి సమగ్రంగా పరిశీలిస్తామన్నారు. తొలగించిన ఓటర్ల వివరాలు సమగ్రంగా ఇంటింటి సర్వే చేపట్టి పరిశీలిస్తామన్నారు. డూప్లికేట్ ఓట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్ స్లిప్పులను బీఎల్వోల ద్వారా పంపిణీ చేశామని వివరించారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, ఆయా కారణాల వల్ల ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్లను మరోమారు క్షుణ్ణంగా పరిశీలించి, పోలింగ్ స్టేషన్ వారీగా క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి, అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తామని వివరించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్, రాబోయే రోజుల్లో అన్ని ఎన్నికలను మరింత పకడ్బందీగా నిర్వహించాలని ఈఆర్వోలకు సూచించారు. ఓటరు స్లిప్పుల విషయంలో బీఎల్వోలతో సమన్వయం చేసుకుంటూ పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలని, అక్కడ అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు సమకూర్చాలని, 1,450 ఓట్ల కంటే ఎక్కువగా ఉంటే ఆక్సలరీ పోలింగ్ స్టేషన్ కింద అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అందుకు సంబంధిత అధికారులు సమాయత్తం కావాలని ఆదేశించారు. ఓటరు లిస్టులో చనిపోయిన వారు ఉంటే వారి సంబంధీకుల వద్దకు వెళ్ళి తెలుసుకుని వారి అంగీకారంతో ఓటరు లిస్టులో నుంచి వారి పేర్లను తొలగించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిన వారి ఓట్లు, మరణించిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లు జాబితా నుంచి తొలగించామని, తొలగించిన ఓట్లకు సంబంధించి సంపూర్ణ సమాచారం అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని, తొలగించిన ఓట్ల వివరాలు మరోసారి పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అవసరమైన డాక్యుమెంట్లు ఉన్నాయో లేవో ధ్రువీకరించాలని పేర్కొన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో బూత్ స్థాయి అధికారులు కీలకపాత్ర పోషిస్తారని, జిల్లా వ్యాప్తంగా అన్ని ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, ఈఆర్వోలు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



- డీఆర్వో వెంకటాచారి
- హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి
- 17 ఫిర్యాదులు స్వీకరణ
- ఆసరా పెన్షన్, డబుల్ బెడ్ రూం ఇండ్లపై..

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా రెవిన్యూ అధికారి వెంకటాచారి అన్నారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కార నిమిత్తం ప్రజలు సమర్పించే దరఖాస్తులపై అధికారులు ఎక్కువ దృష్టి కేంద్రీకరించి.. ఎప్పటి ఫిర్యాదు అప్పుడే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 17 ఫిర్యాదులు స్వీకరించగా.. అందులో ఆసరా పెన్షన్, డబుల్ బెడ్ రూమ్, తదితర ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్డీవో సూర్య ప్రకాష్, సికింద్రాబాద్ ఆర్డీవో రవికుమార్, ప్రణాళిక అధికారి సురేందర్, బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న, ఎస్సీ కార్పొరేషన్ అధికారి యాదయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఐఏఆర్ఈ కళాశాలలో
ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ రీజినల్ మీట్




నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్, ఏఐసిటిఈ ఆధ్వర్యంలో భారతదేశంలో ప్రతిష్టాత్మకమైన 20 నగరాలలో నిర్వహించే ఇన్స్టిట్యూషన్స్, ఇన్నోవేషన్ కౌన్సిల్ సెల్ రీజినల్ మీట్ 2023 కార్యక్రమాన్ని కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మను శ్రీ గుజ్జు ఏఐసిటీఈ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ డైరెక్టర్, అసిస్టెంట్ ఇన్నోవేషన్ డైరెక్టర్ ఎమ్మెల్సీ దీపిక సాహూ,కె.వి చౌదరి అడ్మిన్ డైరెక్టర్ బాల నగర్, ప్రో రాంజీ ఐఐటి హైదరాబాద్,,కళాశాల ప్రిన్సిపల్ ఎల్వి నరసింహ ప్రసాద్ హాజరై ఇలాంటి గొప్ప కార్యక్రమం ఐఏఆర్ఈ కళాశాల నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

భారత దేశంలో ప్రతిష్టాత్మకమైన 20 నగరాలలో ప్రతీ సంవత్సరం నిర్వహించే ఈ కార్యక్రమానికి మొత్తంగా 120 కళాశాలలు, 40 పాఠశాల,20 డిగ్రీ కళాశాలలు ,20 ఎంట్రా ప్రెన్యూర్స్, 48 ఎన్నో వే టర్లతో కలిపి 1500 మంది విద్యార్థులు పాల్గొని ఇన్నోవేషన్ లో కొత్తగా తయారు చేసినటువంటి వస్తువులు ఉద్యమి బజార్లో 20 స్టాల్స్ నందు వస్తువులను విక్రయించారని తెలిపారు. తాము తయారు చేసినటువంటి వస్తువులు వినియోగదారులకు ప్రొడక్ట్స్ వివరాలను వివరించారు. రీజినల్ మీట్లో భాగంగా పోస్టర్ గ్యాలరీ ఏర్పాటు చేసి ప్రతి ఒక్క కళాశాల అఛీవ్మెంట్స్ అందరికీ తెలిసేలా తమ అమూల్యమైన సలహాలను అందరికీ వివరించారు. అనంతరం యుక్తి ఇన్నోవేషన్ ఛాలెంజ్ భాగంగా ఈ కార్యక్రమంలో హాజరైనటువంటి ఇనోవేటర్లు తమ నూతన ఆవిష్కరణలను జ్యూరీ మెంబర్స్ కు అందించి విలువైన సూచనలు పొందారు. రౌండ్ టేబుల్‌లో భాగంగా హైదరాబాద్ లోని వివిధ ఇన్నోవేషన్ల నుండి ప్రతినిధులు హాజరై తమ విలువైన సూచనలు విద్యార్థులు అందించారు. పోస్టర్ గ్యాలరీ, ఇన్నోవేషన్ నుంచి ఉత్తమ కళాశాల ఉత్తమ ఆవిష్కరణలను గుర్తించి వారిని కళాశాల చైర్మెన్ మరి రాజశేఖర్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ సిహెచ్. సత్తిరెడ్డి ,కళాశాల ట్రెజరర్ బి .రాజేశ్వరరావు,ప్రిన్సిపల్ ఎల్వి నరసింహ ప్రసాద్ ఆవిష్కరణ తిలకించి ఆనందాన్ని వ్యక్తపరుస్తూ ఇలాంటి కార్యక్రమాలు ప్రతీ సంవత్సరం తమ కళాశాలలో నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల ప్రసాద్ రెడ్డి, డాక్టర్ షేక్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ కే రఘురాం మోహన్ రెడ్డి, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.





బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా రామరాజు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ బీసీఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రామరాజు వర్మ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌గౌడ్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండి సమస్యలపై సంఘటిత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బీసీఉద్యోగి సంఘం సభ్యులుగా చేరి ఈ నెలలో నిర్వహించబోయే మెంబర్‌షిప్ డ్రైవ్‌లో పాల్గొని సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు..

రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బీసీ ఉద్యోగుల సంఘం శుభాకాంక్షలు తెలిపింది. సోమవారం సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బందం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షులు డి.రమ, ఉపాధ్యక్షులు చక్రధర్, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మహేంద్రసాగర్, తదితరులు పాల్గొన్నారు.

కుంటలో దూకి ఆత్మహత్యకు యత్నించిన తల్లి, కూతురు

- తల్లిని కాపాడిన గ్రామస్తులు, కూతురు కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు

నవతెలంగాణ-శామీర్ పేట

తల్లి, కూతురు కుంటలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బొమ్మరాసిపేట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు , గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మరాసిపేట గ్రామానికి చెందిన కలమ్మ, ఆమె కూతురు కవిత ఇద్దరూ సోమవారం మధ్యాహ్నం అందాజా 3గంటల సమయంలో గ్రామంలోని అబ్బన్న కుంటలో దూకి ఆత్మహత్యకి ప్రయతించారు. ఇది గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే గ్రామస్తులు కలమ్మ ను కాపాడారు. అయితే కవిత కనపడలేదు. రక్షణ సిబ్బంది సాయంతో కవిత కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. కాగా కలమ్మని చికిత్స నిమిత్తం సిద్దిపేట జిల్లా వంటిమామిడి లోని ఆర్‌వీఎంకు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు



సురేష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసిన రాజీవ్ గృహకల్ప వాసులు

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డిని 130 డివిజన్ కార్పొరేటర్ కార్యాలయం వద్ద రాజీవ్ గృహకల్ప వాసులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ 2023 ఎన్నికల ఫలితాల్లో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేగా కేపీ వివేకానంద భారీ మెజారిటీతో గెలవటం అంటే వారి పనితనానికి ప్రజల బ్రహ్మరథం పట్టారన్నారు అన్నారు. ఎమ్మెల్యే వివేక్ ఉదయం 7గంటల నుండి రాత్రి 10గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేశారని ఆ పనుల ఫలితమే మూడో సారి హ్యాట్రిక్ విజయం అన్నారు. ఇప్పటికి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల సాధకాలు, బాధకాలు, కష్టాలు, నష్టాలు, బాధల్లో ఎమ్మెల్యే వివేకానంద తోడు ఉన్నారని ఈ సందర్భంగా సురేష్ రెడ్డి గుర్తు చేశారు. ఆసేవలు గుర్తుంచుకున్న కుత్బుల్లాపూర్ ప్రజలు మూడో సారి రాష్ట్ర టాపర్‌గా 85,576 ఓట్లు మెజారిటీతో గెలుపు తిలకం దిద్దరని తెలిపారు. ఎమ్మెల్యే సారధ్యంలో కార్పొరేటర్లు ప్రజలకు సేవ చేయటం సంతోషంగా ఉందని అన్నారు. ఎమ్మెల్యేకు గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు,నాయకుడికి, ప్రజా బంధువులకు, ప్రజా ప్రతినిధులకు, తన డివిజన్ ప్రజలకు మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో సూరారం రాజీవ్ గృహకల్ప అధ్యక్షుడు శివ గౌడ్ ఆధ్వర్యంలో రేఖ, సంధ్యా వారి మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.

కీసర సర్పంచ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి



- దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేయాలి
- బీజేపీ కీసరశాఖ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ రెడ్డి
- ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

కీసర సర్పంచ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ కీసరశాఖ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేయాలని సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీసర సర్పంచ్ మాధురి వెంకటేష్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చి 45 రోజులు గడుస్తున్నా, ఎలాంటి సమాధానం ఇవ్వకుండా దాటవేస్తున్నారన్నారు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. కీసర గ్రామ పంచాయతీలో రూ.66, 13,867 నిధులను దుర్వినియోగం చేసిన సర్పంచ్‌ని వెంటనే పదవి నుంచి తక్షణమే తొలగించి, ఆ నిధులను రికవరీ చేసి, చట్టరీత్యా తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఇందుకు సంబంధించిన వినతిపత్రం అందజేశారు.

ఈ ఏడాది అక్టోబర్ 20వ తేదీన కీసర సర్పంచ్‌కు జిల్లా అదనపు కలెక్టర్ షోకాజ్ నోటీస్ ఇచ్చారని, దీనిపై ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని కూడా కోరారని తెలిపారు. (2019-2020) లో కీసర గ్రామ పంచాయతీలో జరిగిన ప్రజాధనం దుర్వినియోగంపై సదరు సర్పంచ్ ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. జరిగిన ఇంత పెద్ద కుంభకోణంలో రూ.66,13,867లు ప్రభుత్వానికి చెల్లించాలని కూడా ఆ షోకాజ్ నోటీసులో అధికారులు పేర్కొన్నారని, అయినా ఇప్పటి వరకు ఉలుకూ పలుకూ లేనందున, సదర్ సర్పంచ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేయాలని శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్‌కు సమర్పించిన వినతి పత్రంలో కోరారు.

IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT :: AT : HYDERABAD.
O.S.No. 4859 of 2023

Between :-
Mr. Ravi kiran Goli and others. ......Plaintiffs
And
The Tahsildar Office, Museerabad Mandal, Hyderabad District.
And
All concern. ....Defendants

NOTICE

TO,
The Tahsildar Office, Museerabad Mandal, Hyderabad District.
And
All concern. ....Defendants

Please take notice that, the above said Plaintiffs has instituted Suit against the Defendants under Order VII Rule 1 to 6 R/w. Section 26 C.P.C. Suit for "DECELARATION- THT THE PLAINTIFFS ARE THE LEGAL HEIS AND SUCCESSORS OF LATE. SMT. G ARA JYOTHI @ G SRI JYOTHI". As such you are directed to appear before the said court on **28.12.2023** at 10.30 A.M, either in person or through pleader. If you fail to appear before the said court, then the matter will be decided Ex-Parte.

(By Order of Court)
RK Associates
B.Gangadhar Rao
Advocate
Offical Address 1-8-855/4/1, Sri Ram Nagar, Nallakunta Hyderabd.44.

IN THE COURT OF HON'BLE II JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT : L.B.NAGAR
O.S.NO. 640 OF 2023

BETWEEN:-
Sri M.Kiran Singh, S/o. Gopal Singh, 41 Yrs Employee Parmanent adderess.5-56/B Bhavani Nager Gaddiannaram Saroor Nager Mo. And Now R/o.1-9-252/10, Ramnagar Hyderabad. .....Plaintiff
And
1.Maheth Shoba Bai, D/o. Gopal Singh, 59 Yrs House Wife and R/o.18-1561/2, Vasai Nagar Colony, Miryalaguda, Nalgonda District, TS. And other .....Defendants

PUBLIC NOTICE

That above suit is filed for declaration of legal heirs of deceased M. Narender singh S/o. Gopal singh Age: worked as chief accounts officer in the office of Commissioner of police Hyderabad resided under the limits of H.No. 5-123 Road No.8, Bhavani Nagar, P&T Colony, Saroor Nagar Rangareddy District, TS. That above case is posted for Appearance of Defendants on **21/12/2023** and hence he is directed to appear before this Hon'ble Court on the said date at **10.30 AM** failing which, matter will be decided setting Defendant exparte and no claim of whatsoever nature will be entertained thereafter.

(BY ORDER OF COURT)
N.HARISH KUMAR,
N.SHOBHA RANI,
ADVOCATES
102, SMR Complex, Behind Rush Hospital, Suchithra X Roads M.M.Dist, Hyderabad-50067, TS.
Ph: 9849186851, 9032985585

IN THE COURT OF THE MACT CUM III Addl Chief Judge City Civil Court AT: HYDERABAD, TELANGANA
O.P.NO 1311 OF 2023

Between:
Bontha Bujji & Another .....Petitioner
AND
Neeraj Kumar & Another .....Respondents

To,.
Mahaveer Prasad, S/o.Sundaram, Age: Major, Occ: Owner of the TATA Ace Bearing No:AP 09TB 3170, R/o: 1-11-18/3/P, Bhavani colony, Premavathipet, Rajendra nagar, Ranga Reddy R2

Whereas the above named Petitioners have filed the above O.P. against you and another for grant of compensation under the M. V. Act.
Please take notice that the above O.P. stands posted to **16-12-2023** for your appearance, you are required to appear before Hon'ble Court at **10:30 a.m.** on the above date either in person or through an advocate, failing which the matter will be decided exparte

// BY ORDER OF THE COURT//
C.SATISH KUMAR REDDY
ADVOCATE
Plot No: 36/1#3-125/36 Shanthinagar Colony, Uppal, Hyderabad-39, Cell: 9440039530

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE (EXCISE COURT) AT NALGONDA.
O.S.NO.335 OF 2016

Between:
Dasari Raju ...Plaintiff
AND
Dasari Mallaiah and others ...Defendants.

To,
D5-Dasari Vikas S/o.Bharath Kumar, Aged: 23 years, Occ: Un Employee,
D6-Dasari Tejswini D/o.Bharath Kumar, Aged: 19 years, Occ: Student,
Both are R/o.H.No.12-2-709/C/140, Padmanabha Nagar, Nanal Nagar, Mehedipatnam, Hyderabad.

Take notice that the Plaintiff has filed the above suit for Declaration of title and Mandatory injunction in respect of the plaint schedule property against you and others. The said O.S. is posted to 22-12-2023 for your appearance.

Hence, you are hereby directed to appear in person or through an Advocate before the court on 22-12-2023 at 10-30 A.M., without fail, failing which the matter will be decided against you as per law.

// BY ORDER OF THE COURT//
NUKALA NARASIMHA REDDY
NUKALA SANDHYA RANI
Advocates,Nalgonda.
Nalgonda
Date:11.12.2023.

PUBLIC NOTICE
(Document Lost)

The General Public is hereby informed that Sri. Chandupatla Krishna Reddy, S/o. Sri. Chandupatla Raji Reddy, R/o. H.No. 1-8-502, Near Ekashila Park, Balasamudram, Hanamkonda, Warangal Dist, had availed Housing Loan from SBI, RACPC Secunderabad, bearing H/L A/c No.31133907675, on 15.04.2010 for purchase of Double Bedroom Flat No. C05-310, Third Floor in EMERALD Sector, with plinth area of 766.61 Sq.ft, together with undivided share of land 11.50 Sq. Yds out of total 1232.90 Sq. Yds in Sy. No. 35, situated at Sadbhavana Township, Pocharam (V), Ghatkesar (M), Medchal-Malkajgiri Dist, and bounded by North: Flat No.309, South: Stair Case, East: Open to Sky & West: Corridor, purchased from the Andhra Pradesh Rajiv Swagruha Corporation Ltd., (APRSCL), Hyderabad, Rep by its authorized officer, Sri. B. Udai Kumar, S/o. Gopinath, General Manager & Estate Officer of the Corporation and executed a Sale Deed Reg. as Doc.4112/2012, dt. 07.08.2012 in the O/O SRO/Narapally. Subsequently, the said H/L A/c was migrated to RACPC Banjara Hills. At the time of availing the Housing Loan, he offered the same as collateral security and the said original Sale Deed was deposited in the bank to create an equitable mortgage. But the said Original Sale Deed was either misplaced during in transit or not traceable at both ends. On 24.02.2022 Sri. Chandupatla Krishna Reddy had closed his Housing Loan and approached the bank for release of his Original Sale Deed Documents. As such, the SBI RACPC Banjara Hills had lodged a complaint with the P.S. Banjara Hills, Hyderabad to investigate and issue a FIR for non-traceable certificate of the said document to avoid any future legal complications for transfer of property in the name of any third party. In case, if any person has found or any objection or claim in respect of the above said property, they may contact the undersigned within 7 (SEVEN) days from the date of publication of this notice, failing which any claim thereafter will not be entertained under any circumstances.

CH.GOVARDHAN RAO
M.A, LL.B. MBA, CAIIB, PGDCA, PGDIRPM, DBCL. ADVOCATE
H. No. 4-190/42, Phase-1, Bhaskar Rao Nagar Colony, Sainikpuri, Secunderabad-500 094. (T.S) Mob. No. 9441300650

IN THE COURT OF THE HON'BLE VI ADDL. DISTRICT JUDGE RANGA REDDY DISTRICT AT: KUKATPALLY
O.S.No. 104 of 2023

Between:
T.Prabhakar Rao .....Plaintiff
And
Manikionda Sayamma & Others ....Defendants

To,
1) Manikionda Sayamma, W/o. late Muthiah, R/o.1-24, Gachibowli village, Serilingampally Mandal, Ranga Reddy district, Hyderabad.
2)S.V.Badari Narayan, S/o.late Venkata Chary, R/o.1-2-593/59, Flat no.503, Lotus Gagan Vihar Apartments, Gagan Mahal, Domalguda, Hyderabad
3) Srinivas R.Satuluri. S/o.late Venkata Chary, residing at 3, Cardinal Road, Kommodel, New Jersey 07733 USA
4) Kommanduri Janaki, W/o.K.K. Narayan, R/o.D-Block, G-1, SBI Officers Quarters, Opp Hyderabad Central University, Gachibowli, Hyderabad-500 019
5)Padmavathi Nandyal,W/o. Ranganath Nandyal, R/o.462-B. first floor, 15th cross, Ideal Homes Town ship, Rajarajeshwari Nagar, Bamgaluru - 50 0989
6)D.Venkateshwar Rao S/o. D.Pattabhi Ramaiah, R/o.8-3-319, Yellareddyguda, Hyderabad .....Defendants

Take notice that the Plaintiff filed suit against you for Declaration and Perpetual Injunction. The suit stands posted to **05.01.2024** for your appearance before the above court and if you fail to appear in person or by an advocate on **05.01.2024 at 10.30 am** before the above court, you will be set ex parte and the case will be decided on merits in your absence.

(BY ORDER OF THE COURT)
M/s.P.BALAJI VARMA & ASSOCIATES, ADVOCATES
#6-3-570/1, 6th floor, Diamond Block, Rockdale Compound, Somajiguda, Hyderabad-500 082.

పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లు రికవరీ చేసి బాధితులకు అప్పగింత



నవతెలంగాణ-ముషీరాబాద్

దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాధితులు పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు పోలీసులు తిరిగి అప్పగించారు. ఈ మేరకు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రికవరీ చేసిన రెండు లక్షల విలువచేసే 12 ఫోన్ లను గాంధీ నగర్ డివిజన్ ఏసీపీ రవికుమార్ చేతుల మీదుగా బాధితులకు అప్పగించారు. ఏసీపీ రవి కుమార్ మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్న చోరీకి గురైన ఆందోళన చెందకుండా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే చాలని, ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితుడికి అందజేస్తామని తెలిపారు. రిపోర్ట్ చేసిన అనతి కాలంలోనే 12 ఫోన్లు రికవరీ చేసిన క్రైమ్ టీంను ఈ సందర్భంగా ఏసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్ రెడ్డి, డిఐ వర ప్రసాద్, డిఎస్ఐ శ్రీకాంత్, క్రైమ్ టీం తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నవతెలంగాణ-హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని ద్వారకా తిరుమల నగర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్ జీహెచ్ఎంసీ ఏ.ఈ నాయక్ హేమ్ నాయక్ కలిసి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీల రోడ్డు నిర్మాణం విషయంలో పూర్తి నాణ్యతతో కూడిన మెటీరియల్ వాడి, పారదర్శకంగా పనులు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ అభివృద్ధి పనులను వీలైనంత తొందరగా చేపట్టి త్వరగతిన నిర్మాణాలను పూర్తిచేసి ప్రజలకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారకా నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాల్ రెడ్డి , వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, బిక్కు నాయక్, స్థానిక నాయకులు గోపిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి , శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పడిపూజ సామాగ్రి అందజేయడం గొప్ప విషయం

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ - ముషీరాబాద్

అయ్యప్ప మాల వేసుకున్న స్వాములకు ఉచిత పడిపూజ సామాగ్రి అందజేయడం గొప్ప విషయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి సేవా వ్యవస్థాపకులు తలారి వినోద్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు ఉచితంగా పడి పూజా సామాగ్రిని సోమవారం అందజేశారు. అడిక్‌మెట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై సామాగ్రిని స్వాములకు అందచేశారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ... ప్రతి ఏటా అయ్యప్ప మాలధారణ వేసుకునే స్వాములు నిర్వహించే పడి పూజలకు పూజా సామాగ్రిని ఉచితంగా వినోద్ గురు స్వామి అందచేయడం గొప్ప విషయమన్నారు. శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి సేవా వ్యవస్థాపకులు తలారి వినోద్ కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ... గత 20 ఏళ్లుగా నిస్వార్థంగా స్వాములకు పడి పూజ సామాగ్రిని ఉచితంగా అందచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జైసింహా, స్వాములు తలారి సుశీల, తలారి చంద్ర మోహన్, తలారి శ్రీకాంత్ ముదిరాజ్, దయాకర్ రెడ్డి, వై.శ్రీనివాస్, విక్రమ్, శరన్, నక్క మహేందర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ ముషీరాబాద్ డివిజన్ వర్కింగ్ ప్రసిడెంట్ కొండా శ్రీధర్ రెడ్డి, మచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు అజయ్ ముదిరాజ్, భాస్కర్ నేత, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో

ఆటో డ్రైవర్ల ఆదాయానికి గండి

తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ ఆందోళన



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మహాలక్ష్మి పథకంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటో డ్రైవర్ల ఆదాయానికి గండి కొడుతుందని, గత రెండు రోజుల్లో బేరాలు లేక ఆదాయం తగ్గి ఆటో డ్రైవర్లు కొట్టుమిట్టాడుతున్నారని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ ఆందోళన వ్యక్తం చేసింది. సోమవారం హిమాయత్ నగర్ లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ అత్యవసర సమావేశం జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం (ఏఐటీయూసీ) అధ్యక్షతన నిర్వహించారు. జేఏసీ కో-కన్వీనర్ లు వి.కిరణ్ (ఐఎఫ్‌టీయు), బి.శ్రీకాంత్ (సీఐటీయు), జి.మల్లేష్ గౌడ్ (ఐఎన్ టీయుసీ), సి.హెచ్.బాల నరసింహ (బీఆర్‌టీయు), ఎండీ. అమానులా ఖాన్, ఎంఏ.సలీం (ఆటో జేఏసీ), మీర్జా రఫాత్ బైగ్ (ఆటో ఓనర్స్ అసోసియేషన్) తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.వెంకటేశం మాట్లాడుతూ గత 10 సంవత్సరాలలో వంద శాతం ఇంధన చార్జీలు, రవాణా టాక్స్‌లు పెరిగిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సారి కూడా ఆటో మీటర్ చార్జీలు పెంచకుండా ఆటో డ్రైవర్ల బ్రతుకులను అధోగతి పలు చేసిందని ఆరోపించారు. రవాణా రంగా కార్మికుల సమస్యలను విస్మరించినందుకే కేసీఆర్ సర్కార్‌ను చిత్తుగా ఓడించామన్నారు. ఆటో డ్రైవర్లకు నష్టం జరిగిన ప్రజలకు మేలు చేసే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని జేఏసీ తరపున స్వాగతిస్తున్నామని ఆయన ప్రకటించారు. పేరుకుపోయిన సమస్యల పరిష్కరానికి గత ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం వల్ల ఆటో డ్రైవర్ల ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిందని, ఈ సమస్యల కారణంగా చాలా మంది డ్రైవర్లు అద్దె, రుణాలు, తమ పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు రవాణా రంగా కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, అర్హులైన ప్రతి ఆటో డ్రైవర్లకు రూ.12 వేలను అందజేయాలని, 100 శాతం పెరిగిన ఇంధన, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వెంటనే ఆటో మీటర్ చార్జీలు పెంచాలని సీఎం ఎ.రేవంత్ రెడ్డిని బి.వెంకటేశం విజ్ఞప్తి చేశారు .ఈ సమా వేశంలో ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు కొం రెల్లి బాబు, ప్రధాన కార్యదర్శి సిహెచ్. జంగయ్య, గౌరవ అధ్యక్షులు ఎండి.ఒమర్ ఖాన్, సంయుక్త కార్యదర్శి ఎస్.కె.లతీఫ్, జేఏసీ నగర నేతలు ఎం.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కరానికి నా వంతు కృషి చేస్తా



జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు మధుయాష్కీ గౌడ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

వాటర్ బోర్డులోని సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు మధుయాష్కిగౌడ్ తెలిపారు. వాటర్ బోర్డ్‌లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వాటర్ బోర్డు ఎండి దాన కిషోర్ దృష్టికి తీసుకెళ్లారు. జలమండలి ప్రధాన కార్యాలయంలో దాన కిషోర్‌ను కలిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వాటర్ బోర్డులో ఒక్క పోస్టును కూడా భర్తీ చేయలేదన్నారు. దాదాపు 1000 పోస్టుల వరకు వాటర్ బోర్డులో ఖాళీలు ఉన్నాయని తెలిసిందన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించలేదని ధ్వజమెత్తారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కేవలం రూ. 15 వేల వేతనాలే చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానిరి కృషి చేస్తానని హామీ నిచ్చారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో రోషన్ ధామ్ మురికి వాడలో నల్లా కనెక్షన్లు లేపోవడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎండీ దానకిషోర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎండీ ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో మంచినీటి తాగునీటి, మురుగునీటి సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే అధికారులను ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఆనంద రెడ్డి, రాజ్, అశోక్, శంకర ప్రకాష్, దేవేందర్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత విభావరిలో ఉల్లాసంగా పాల్గొన్న విద్యార్థులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

దిల్‌సుఖ్‌నగర్‌లోని పుల్లారెడ్డి మెమోరియల్ స్కూల్ ఆవరణలో సోమవారం జరిగిన 26వ వార్షిక వైజయంతి మ్యూజిక్ కన్సర్వేటరీ ఆధ్వర్యంలో 'పరువం వాన' పేరిట జరిగిన సంగీత విభావరిలో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు వారి వారి స్థాయిలను బట్టి సంగీత విభావరిలో పాల్గొన్ని తమ గానంతో అహుతులను ఆకట్టుకున్నారు. కేశవ చారి, ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

రేపు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా బంద్

నవతెలంగాణ-సిటీబ్యూరో

కష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై పథకం ఫేజు - 3లో కోదండాపూర్ పంపింగ్ స్టేషన్ వద్దనున్న 2375 ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్ హెడర్ పైపు లైనుకు భారీ లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీని అరికట్టడానికి మరమ్మతు పనులు చేపడుతున్నారు. దాంతో ఈ నెల 13, బుధవారం ఉదయం 5 గంటల నుంచి మరుసటి రోజు గురువారం ఉదయం 5 గంటల వరకు ఈ మరమ్మతు పనులు జరుగుతాయి. ఈ క్రమంలో 24 గంటలపాటు డివిజన్ 1 నుంచి 20 పరిధిలోని శాస్త్రీపురం, బండ్లగూడ, భోజగుట్ట, షేక్‌పేట్, ఆళ్లబండ, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, ప్రశాసన్ నగర్, లాలాపేట్, సాహేబ్ నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, సైనిక్‌పురి, మౌలాలి, స్నేహపురి, గచ్చిబౌలి, మాదాపూర్, అయ్యప్పసొసైటీ, బుద్వేల్, కిస్మత్‌పూర్, బోడుప్పల్, ఫిర్జాదీగూడా, ధర్మసాయి తదితర ప్రాంతాలల్లో నీటి సరఫరా ఆపేస్తారు. వినియోగదారులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని జలమండలి అధికారులు కోరారు.

సమస్యల పరిష్కారమే యూనియన్ లక్ష్యం

టీఎన్జీవో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు రవిప్రకాశ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సమస్యల పరిష్కారమే యూనియన్ లక్ష్యం అని టీఎన్జీవో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు రవి ప్రకాశ్ అన్నారు. ఇటీవలే జరిగిన జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో కో-ఆప్షన్ పద్ధతిని అనుసరించి ఎన్నికైన సభ్యుల పరిపాలనా బదిలీల కారణంగా ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించింది. సోమవారం ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రవి ప్రకాష్ అధ్యక్షతన శామీర్‌పేట యూనిట్ ఎన్నికలను ఎన్నికల అధికారి పాలుబై ఈశ్వర్, జిల్లా కార్యదర్శి భరత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శిగా గంగుల రవి యాదవ్ (వ్యవసాయ విస్తరణ అధికారి), శామీర్‌పేట్ మండల అధ్యక్షులు శైల్ పైల్వాన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ (అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్) మండల కార్యదర్శిగా నూతనంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ శామీర్‌పేట యూనిట్‌లోని సభ్యులందరి సమస్యలు, ఆకాంక్షలు, సంక్షేమాన్ని సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే యూనియన్ సమిష్టి లక్ష్యం అన్నారు. ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామన్నారు. టీఎన్జీవో యూనియన్ నినాదం "ఐక్యతే బలం" అని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొన్నందుకు యూనియన్ తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తూ యూనియన్ హక్కులను సాధించడానికి, ఉద్యోగులందరి అభివద్ధి కోసం పాటు పడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఈసీ సభ్యులు శ్రీచంద్, ఐటీఐ శాఖ అధ్యక్షులు రవీందర్, పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ అధ్యక్షులు భాస్కర్, మేడ్చల్ యూనిట్ అధ్యక్షులు శ్రీనివాస్, వినయ్ షిర్లీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించండి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

కలెక్టరేట్‌లో ప్రజావాణికి 53 అర్జీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా వివిధ సమస్యలపై ఫిర్యాదులను సమర్పించడానికి వచ్చిన ప్రజల నుంచి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి 53 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తే ఫిర్యాదుదారులకు మేలు కలుగుతుందని తెలిపారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులు పరిష్కారం అయ్యిందా..? లేదా..? అనే సమాచారాన్ని ఫిర్యాదు దారునికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు అర్జీదారులకు సమాచారం అందించాలని సూచిం చారు. జిల్లా అధికారులు సైతం ప్రజావాణి ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నవతెలంగాణ-ముషీరాబాద్

ఇండ్లలో పని చేస్తున్న యువతి అదృశ్యమైన ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ లక్నో ప్రాంతానికి చెందిన సావిత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి గత 15 సంవత్సరాలుగా హిమా యత్ నగర్ ప్రాంతంలో ఇండ్లలో పని చేసుకుంటూ నివాసం ఉంటుంది. ఆమెకు ఐదుగురు కుమార్తెలు సంతానం ఉండగా మూడవ కుమార్తె అయినటువంటి అర్చన (18) హిమాయత్ నగర్ వీధి నెంబర్ 5లో ఒక ఇంట్లో గత మూడు సంవత్సరాలుగా పని మనిషిగా పనిచేస్తుంది. రోజు లాగానే పనికి వెళ్తానని బయటికి వచ్చిన అర్చన ఎంతకు ఇంటికి తిరిగి రాకపోవడంతో అర్చన పనిచేస్తున్న ఇంటి యజమానికి కుటుంబ సభ్యులు ఫోన్ చేసి ఆరా తీయగా తన ఇంటికి అర్చన రాలేదని ఇంటి యజమాని తెలియ జేశారు. దీంతో స్థానిక దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వయం ఉపాధితో యువత రాణించాలి



నవతెలంగాణ-సంతోష్ నగర్

ఉద్యోగుల కోసం నిరీక్షించకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని రాణించాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ అన్నారు. యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్ శంకర్ నగర్ పరిధిలోని లక్కీ రెస్టారెంట్ పక్కన ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన ఆల్ బైక్ ద రాయల్ అరేబియన్ రెస్టారెంట్‌ను డివిజన్ కార్పొరేటర్ ముజఫర్ హుస్సేన్, మిరాజ్ సలీం బైగ్, ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి మహమ్మద్ అబ్దుల్ హన్నన్, అబ్దుల్ సమీద్ నిర్వాహకులతో కలిసి ప్రారంభిం చారు. నిర్వాహకులు మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

'ఎల్ రాయల్స్ లగ్జరీస్ కిడ్స్ స్టోర్' ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పిల్లలకు సంబంధించిన అన్ని రకాల ఫ్యాషన్ కోసం 'ఎల్ రాయల్స్ లగ్జరీస్ కిడ్స్ స్టోర్'ను ప్రముఖ పారిశ్రామికవేత్త పింకీరెడ్డి సోమవారం ప్రారంభించారు. పిల్లలకు సంబంధించిన అన్ని వర్గాల ఫ్యాషన్ స్టైల్స్ అందుబాటులో ఉన్నాయి. ఇండియాలోనే ప్రముఖ 33 మంది డిజైనర్లు రూపొందించిన ఫ్యాషన్ వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. పరిశ్రమ మార్గదర్శకులు వర్ష కేడియా, సౌమ్య రెడ్డితో స్థాపించబడిన 'ఎల్ రాయల్స్' కేవలం పిల్లలకు ఫ్యాషన్ డెస్టినేషన్ కాకుండా ఒక విజన్‌గా రూపొందించారని తెలిపారు. సౌమ్యరెడ్డి యూఎస్ఏలోని బెంట్లీ కాలేజ్, లండన్‌లోని కాస్ బిజినెస్ స్కూల్‌లో గ్రాడ్యుయేట్, 'ఎల్ రాయల్స్'కు అంతర్జాతీయ నైపుణ్యాన్ని సాధించారు. తన విద్యా నేపథ్యం గ్లోబల్ ఎక్స్‌పోజర్‌తో, సౌమ్య ఫ్యాషన్ రిటైల్‌పై ప్రత్యేకమైన దక్పథాన్ని కలిగి ఉంది. ఒక తల్లిగా, ఆమె మార్కెట్లో అంతరాన్ని గుర్తించింది. పిల్లలకు ఫ్యాషన్‌లో అత్యుత్తమమైన వాటిని అందించడానికి 'ఎల్ రాయల్స్'ను సహ-స్థాపించింది. వర్ష, సౌమ్య కలిసి 'ఎల్ రాయల్స్' అనే లగ్జరీ కిడ్స్ స్టోర్‌ను స్థాపించారు. ఈ కార్యక్రమంలో జయంతిరెడ్డి, ఉషా సంఘి, మౌలికారెడ్డి, అర్పితా గుప్తా, అంజు పొద్దార్, శ్రేయారెడ్డి, మల్లికారెడ్డి, వీణారెడ్డి, అనుశ్రీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన సన్మానం..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

నగరానికి వచ్చిన బీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌ను బీఆర్ఎస్ యువ నాయకుడు మేకల విష్ణువర్ధన్ మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు ఉచిత బస్ పాసులు ఇచ్చి బస్సుల సంఖ్యను పెంచాలి..

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మాలోతు శ్రీమాన్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఇంటర్ నుండి, పీజీ చదువుతున్న విద్యార్థులందరికీ బస్సు పాసులను ఉచితంగా ఇచ్చి బస్సుల సంఖ్యను పెంచాలని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ సిటీ జిల్లా ఉపాధ్యక్షులు మాలోతు శ్రీమాను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో, నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి కేజీ, పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని విజ్ఞప్తి చేశారు.

కే పార్టీ ఫ్యాషన్ షోలో సినీతారల సందడి



నవతెలంగాణ-సిటీబ్యూరో

లయన్ కిరణ్ ఆధ్వర్యంలో ఇంద్రలోక్ థీమ్‌తో కూడిన కే పార్టీ ఫ్యాషన్ షో. స్టైల్, ఫ్యాషన్ షో, ఫన్, డ్యాన్స్, స్టైల్‌తో కూడిన ఈవెంట్ అందరినీ అబ్బుర పర్చింది. తారామతి బారాదరి లయన్ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంద్రలోక్ థీమ్‌తో కే పార్టీ ఫ్యాషన్ షో అందరిని మైమరిపించింది. ప్రతి ఏడాదీ లయన్ కిరణ్ తన బర్త్ డే సందర్భంగా నిర్వహించే కే పార్టీ ప్రత్యేక థీమ్‌లతో నిర్వహిస్తూ ఉంటారు. ఇప్పుడు ఇంద్రలోక్ థీమ్‌తో నిర్వహించిన కె పార్టీ ఫ్యాషన్ షో లో సెలబ్రిటీలు, పొలిటీషియన్స్, బిజినెస్ మాన్స్, చాలా సరదాగా, స్టైల్ స్టేట్‌మెంట్‌లతో మెరిసి పార్టీలో ఎంజాయ్ చేశారు. సుచిరిండియా సీఈఓ లయన్ కిరణ్ హోస్ట్ చేసిన ఈ కార్యక్రమంలో సినీ తారలు తరలివచ్చారు. నటుడు సాయి కుమార్, అనూప్ రూబెన్స్, ఆర్పీ పట్నాయక్, బిగ్‌బాస్ అశ్విని, సరయు, మిత్ర శర్మ ఖయ్యూమ్, సోహైల్, కనిష్క, భూపాల్, మధుసుధన్, శివారెడ్డి, ఇంటర్నేషనల్ మోడల్స్ ఫ్యాషన్ షో, రాజకీయాలు, వ్యాపారవేత్తలు, తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

డబుల్ గోల్డ్ మెడల్స్ సాధించిన సెయింట్ జోసెఫ్ విద్యార్థి



విద్యార్థి రాఘువర్షినీని అభినందించిన కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మారెడ్డి..



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఫర్ ఉమెన్ 2023-24 పోటీలు జరిగాయి. ఈ పోటీలో కింగ్ కోఠి సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల విద్యార్థిని బి రాఘువర్షిని డబుల్ గోల్డ్ మెడల్స్ (100 మీటర్లు, 200 మీటర్లు) సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థి రాఘువర్షినీని సోమవారం కళాశాలలో కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆంటోని సాగయారాజ్ ఫిజికల్ డైరె క్టర్ డాక్టర్ కే.శ్రీధర్ రెడ్డి తదితరులున్నారు.



ఇంటికి కళ తెచ్చే కార్నేషన్!



అందమైన రంగురంగుల పూలను బహుమతిగా ఇవ్వడం చూస్తూనే ఉంటాం. చేస్తూనే ఉంటాం. అయితే కొంతమంది బయటి నుంచి కొనివ్వకుండా ఇంటిలోనివి ఇస్తుంటారు. ఇలా ఇచ్చే వాటిలో గులాబీలు ముందు వరుసలో ఉంటాయి. కాని ఎప్పుడూ అవే ఇస్తే ఏం బాగుంటుంది? వీటితో పాటూ కొత్తగా కంటికింపుగా ఉండే కార్నేషన్ పూలను అందుకోసం ఎంచుకోవచ్చు. కేవలం శుభాకాంక్షలు తెలిపేందుకే కాదు.... అలంకరణకూ ఇవెంతో ఉపయోగపడతాయి.

ఈ పూల మొక్కలు రెండు రకాలుగా లభిస్తాయి. ఒకటి, పొడవైన కాడతో ఉండే కట్ ఫ్లవర్. ఇంకొకటి, కుండీల్లో చిన్నగా పెంచుకోగలిగే వీలున్న రకం. పూల బొకేలుగా ఇవ్వడానికీ, అలంకరణ వంటి అవసరాల కోసం మొదటి రకాన్ని ఎక్కువగా ఉపయోగిస్తే... రెండోది అభిరుచీ, అందం కోసం పెంచుకుంటుంటారు. ఇవి పుట్టింది యూరప్‌లోనే అయినా ప్రపంచ వ్యాప్తంగా మూడొందల రకాల్లో, అనేక రంగుల్లో ఈ మొక్క లభిస్తోంది. ఒక్క మనదేశంలోనే రెండొందల రకాలు అందుబాటులో ఉన్నాయి. ఎరుపు, తెలుపూ, పసుపూ, గులాబీ వంటి రంగుల్లోనే కాకుండా రెండు, ఐదారు వర్ణాల మేళవింపుగా పూసేవీ లభిస్తున్నాయి. ఇవి ఏడాదికొకసారి నాటుకుని, శాశ్వతంగా పెంచుకునే రకాల్లో దొరుకుతాయి. విత్తనాల ద్వారా ఉత్పత్తయ్యే మొక్కల్లో అధిక శాతం ఏడాదికొకసారి పెంచుకునేవే. టిష్యూ కల్చర్, కాండం కత్తిరించి పెంచేవి పెరెన్నియల్ రకాలు. వీటిని నేలలో నాటితే రెండు, మూడడుగుల పొడవు వరకూ పెరుగుతాయి.

సున్నితమైన మొక్క..

వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండే చల్లని ప్రదేశం దీనికి అనుకూలం. అలాని ఎండ తగలకూడదని కాదు. పద్దెనిమిది నుంచి ఇరవై ఐదు డిగ్రీల వరకూ నేరుగా ఎండ తగిలేలా చూసుకోవాలి. అంతకంటే ఎక్కువైనప్పుడు పాక్షికంగా నీడ ఉండేలా షేడ్ నెట్ ఏర్పాటు చేసుకోవాలి. కుండీల్లో పెంచు కుంటూ బాల్కనీల్లో పెట్టుకునేప్పుడు తూర్పు, పడమర దిశల్లో ఉంచుకోవాలి. రోజులో కనీసం నాలుగు గంటలు ఎండ తగి లేలా చూసుకుంటే మొక్క ఆరోగ్యంగా ఎదిగి, ఏడాదంతా పూలు పూస్తుంది. వీటిని నాటేందుకు క్షారతత్వం ఉన్న సార వంతమైన మట్టిని ఎంచుకోవాలి. అందులో తగిన పాళ్లలో సేంద్రియ ఎరువు కలిపి కుండీల్లో నింపుకోవాలి. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు తప్ప నీటి అవసరం పెద్దగా ఉండదు. రోజు విడిచి రోజు నీళ్లు పోసినా సరిపోతుంది. ఈ మొక్కకు నీళ్లు ఎక్కువయితే ఆకులు పండిపోతాయి.

మొక్క నుంచి పువ్వుని కత్తిరించాక పదిహేను రోజుల పాటు తాజాగా ఉంటుంది. ఒకవేళ చెట్టుకే వాడిపోతే దాన్ని కిందవరకూ కత్తిరించుకోవాలి. లేదంటే అది కుళ్లిపోవడం, క్రిమికీటకాలు దాడి చేయడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఈ మొక్కకి క్రిమి కీటకాల సమస్యా ఎక్కువే. వాటిని ముందుగానే నివారించడానికి తరచూ వేప నూనె చల్లుతూ ఉండాలి. మార్కెట్లో లభించే కార్బన్ డైజమ్ ఫంగిసైడు నీళ్లలో తడిపి మొక్క వేళ్ల వద్ద చల్లాలి. కట్ ఫ్లవర్ తరహా మొక్కలు పది నుంచి యాభై రూపాయల్లో లభిస్తాయి. రకరకాల రంగుల్లో ఉండి, బహుమతులుగా ఇవ్వగలిగినవి. రెండొందల రూపాయల్లో దొరుకుతాయి.



తెలుసుకోవడం ఎలా..?



ఈ ఆధునిక ప్రపంచంలో చాలామంది ఏదో ఒక సమస్యతో ఒత్తిడికి లోనవుతున్నారు. దీనివల్ల సమస్య పరిష్కారం కాకపోగా ఇతర అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. అయితే చాలా మంది పెద్దవాళ్లు మాత్రమే ఒత్తిడికి లోనవుతారని అనుకుంటారు. కానీ ఇది పొరపాటు, పిల్లలు సైతం ఒత్తిడికి లోనవుతున్నారని పలు పరిశోధనలు చెబుతున్నాయి. ఇలాంటి సందర్భాలలో తల్లిదండ్రులే పిల్లలకు సరైన పరిష్కార మార్గం చూపించగలుగుతారు. అయితే పిల్లలు ఒత్తిడికి గురవుతున్నట్టు ఎలా తెలుసుకోవాలో చాలా మంది తల్లిదండ్రులకు తెలియడం లేదు. అలాంటి వారి కోసం నిపుణులు కొన్ని సలహాలు ఇస్తున్నారు. పిల్లలు ఒత్తిడికి లోనైనప్పుడు కొన్ని రకాల లక్షణాలు కనిపిస్తాయని వారు చెబుతున్నారు. అవి ఏంటో? చిన్నారులను ఒత్తిడి నుంచి ఎలా బయట పడేయాలో తెలుసుకుందాం రండి...

కొంతమంది పిల్లలు ఒత్తిడికి లోనైనప్పుడు తలనొప్పి, కడుపు నొప్పి వంటి సమస్యలతో బాధ పడుతుంటారు. అయితే ఇవి సాధారణంగా కూడా వస్తుంటాయి. అయితే ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేని పిల్లల్లో తరచుగా ఈ సమస్య వస్తుంటే దానిని ఒత్తిడి కిందే పరిగణించాలి. టీచర్లు ఇచ్చిన హోమ్ వర్క్ చేయలేక పోవడం, పరీక్షలకు సరిగా సన్నద్ధం కాకపోవడం వంటి వాటి వల్ల కూడా పిల్లలు ఒత్తిడి గురయ్యే అవకాశం ఉంది. ఇలాంటివి తల్లిదండ్రులకు చెబితే ఎక్కడ తిడతారోననే భయం కూడా వారిలో ఉండే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో పిల్లలను మీరే దగ్గరకు తీసుకొని అసలు సమస్యేంటో నెమ్మదిగా అడిగే ప్రయత్నం చేయాలి. అలాగే వారికి ధైర్యం చెబుతూ సమస్యను ఎలా పరిష్కరించాలో ఆలోచించాలి.

ఫోన్ ఎక్కువగా వాడుతుంటే

సాధారణంగా పిల్లలు ఎక్కువగా ఫోన్లలో ఆటలు ఆడడానికి అసక్తి చూపుతుంటారు. కొన్ని ఆటల వల్ల పెద్దగా ఇబ్బంది లేనప్పటికీ కొన్ని మాత్రం పిల్లల్లో ఒత్తిడిని పెంచుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో పిల్లలు ఒత్తిడికి గురవుతున్నామన్న విషయం కూడా వారికి తెలియదట. అలా అని వారిని అసలు ఫోన్లకే దూరం చేయడం కూడా మంచిది కాదు. ఒకవేళ వారికి ఫోన్ ఇచ్చినా దానికంటూ కొంత సమయం కేటాయించండి. అలాగే వారు ఆడే ఆటలు, చూసే వీడియోలపై కూడా ఓ కన్నేసి ఉంచడం ఎంతైనా అవసరం.

తినే విధానం...

మనం ఆహారం తీసుకునే విధానంలో ఒత్తిడికి లోనవుతున్నామో లేదో తెలిసిపోతుందట. ఇది కేవలం పెద్దలకే కాదు.. పిల్లలకు కూడా వర్తిస్తుంది. మీ పిల్లలు అంతకుముందు కంటే ఆహారాన్ని ఎక్కువ మోతాదులో తీసుకోవడం కానీ, తక్కువగా తీసుకోవడం కానీ జరుగుతుంటే దానిని ఒత్తిడి కిందే పరిగణించాలి. వారు ఏదైనా విషయాన్ని ఎక్కువగా ఆలోచించడం వల్ల ఇలా చేస్తుండచ్చు. మీ పిల్లలు కూడా ఇలానే చేస్తుంటే వారి సమస్యను తెలుసుకొని పరిష్కరించే ప్రయత్నం చేయండి. దాంతో వారిలో ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది.

ఏకాగ్రత తగ్గుతోందా?

ఒత్తిడిలో ఉన్నప్పుడు మనం ఏ పనీ సరిగ్గా చేయలేం. ముఖ్యంగా చదువు విషయంలో ఇది ప్రస్ఫుటంగా కనిపిస్తుం ది. అయితే ఒత్తిడి అనేది ఎప్పుడూ బయటి అంశాలపైనే ఆధా రపడి ఉండదు. కొన్ని సందర్భాల్లో మనం చేసే పనులను సరి గా నిర్వర్తించనప్పుడు కూడా ఒత్తిడికి లోనవుతుంటాం. అలాగే పిల్లలు కూడా చదువు విషయంలో కొన్ని లక్ష్యాలు పెట్టుకుం టారు. అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోతే కొన్నిసార్లు ఒత్తిడి కి లోనవుతుంటారు. అలాంటప్పుడు వారికి అండగా ఉంటూ తగిన సహకారం అందించాలి. ఇలా చేయడం వల్ల పిల్లల్ని ఒత్తిడి నుంచి బయటపడేయచ్చు.

తరచుగా వస్తుంటే...

కొంతమంది వారికి వచ్చిన సమస్యను పెద్దదిగా చూసు కొని తీవ్ర ఒత్తిడికి లోనవుతుంటారు. దాంతో ఏదైనా మాట్లాడు తున్నప్పుడు మౌనంగా ఉండడం లేదా మధ్యలోనే వెళ్లిపోవడం వంటివి చేస్తుంటారు. పిల్లలు కూడా ఇలా చేసే అవకాశం ఉంది. కొంతమంది పిల్లలు ఒత్తిడికి లోనైనప్పుడు రాత్రుళ్లు పక్క తడుపుతుంటారు. చిన్న పిల్లల్లో అయితే ఇది పెద్ద సమస్య కాదు.. కానీ స్కూలుకి వెళ్లే వయసున్న వారు కూడా ఇలా చేస్తుంటే వాళ్ల ఒత్తిడి చెందుతున్నారని భావించాల్సిందే. కొంతమంది పిల్లలకు పీడ కలలు వస్తుంటాయి. అయితే అవి ఎప్పుడో ఒకసారి అయితే ఫర్వాలేదు కానీ తరచుగా వస్తుంటే అది ఒత్తిడి సమస్యేనని భావించాలి. మీ పిల్లల్లో కూడా ఇలాంటి లక్షణాలు ఉంటే ఒకసారి కూర్చోబెట్టి మాట్లాడండి. వారి సమస్యను తెలుసు కునే ప్రయత్నం చేయండి. వారికి కావాల్సిన సహాయం చేసి చూడండి. ఒకవేళ అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే నిపుణులను సంప్రదించే ప్రయత్నం చేయండి.

పార్లమెంట్ స్వతంత్రతపై నీలినీడలు

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభ నుంచి తనను బహిష్కరించడాన్ని అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. ఆధారాల్లేకుండా, వచ్చిన ఆరోపణలపై సరైనా దర్యాప్తు చేయకుండానే తనపై చర్యలు తీసుకున్నారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఎన్డీఏ పాలనలోనే అధికం

గడచిన నాలుగు లోక్‌సభలలో (యూపీఏ పాలనలో రెండు, ఎన్డీఏ పాలనలో రెండు) జరిగిన సస్పెన్షన్ల చిట్టాను పరిశీలిద్దాం. 2004 నుండి ఇప్పటి వరకూ మొత్తం 144 మంది సభ్యులు సస్పెన్షన్‌కు గురయ్యారు. మొదటి పది సంవత్సరాలలో... అంటే యూపీఏ హయాంలో 50 మంది సభ నుండి సస్పెండ్ అయితే ఎన్డీఏ పాలనలో 95 మందిపై సస్పెన్షన్ వేటు పడింది. ఇక్కడ చెప్పుకోవాల్సిన విశేషమేమంటే ఎన్డీఏ పాలనలో ఒక్క బీజేపీ ఎంపీని కూడా సస్పెండ్ చేయలేదు. 2014లో ఎన్నికైన 16వ లోక్‌సభలో అత్యధికంగా 81 మంది సస్పెండ్ అయ్యారు. ఒక్క 16వ సమావేశంలోనే 49 మందిపై వేటు పడింది. కాంగ్రెస్, అన్నా డీఎంకే, టీడీపీకి చెందిన సభ్యులనే ఎక్కువగా సస్పెండ్ చేశారు.

కోర్టు నిర్ణయంతో తిరిగి సభలోకి...

ఈ సంవత్సరంలో అనర్హత వేటు పడిన ఎంపీల విషయానికి వస్తే ఎన్సీపీకి చెందిన లక్షద్వీప్ సభ్యుడు మహమ్మద్ ఫైజల్, కాంగ్రెస్ అగ్రనేత, వాయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీలపై అనర్హత వేటు వేశారు. అయితే న్యాయస్థానాలు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో వారిద్దరూ తిరిగి సభలో ప్రవేశించారు. దాడి, అల్లర్ల కేసులో ఎటావా నుండి ఎన్నికైన బీజేపీ సభ్యుడు రామ్ శంకర్ కథేరియాకు ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు రెండు సంవత్సరాల జైలుశిక్ష విధించినప్పటికీ న్యాయస్థానం నుండి స్టే పొందడంతో ఆయనను అనర్హుడిగా ప్రకటించలేదు.

పార్లమెంట్ పనితీరు అధ్వాన్నం

గడచిన పది సంవత్సరాల కాలంలో పార్లమెంట్ పనితీరు అధ్వాన్నంగా ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చట్టసభకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు ఆ విధిని గాలికి వదిలేశారు. 2020 సెప్టెంబర్‌లో మూడు వివాదాస్పద వ్యవసాయ బిల్లులను సభలో ఎలాంటి ఓటింగ్ జరపకుండానే, సభలో గందరగోళం నెలకొన్న సమయంలోనే, వాటిపై ఎలాంటి చర్చ చేపట్టకుండానే ఆమోదించడం పార్లమెంట్ పనితీరు దారుణంగా ఉన్నదని చెప్పడానికి ఓ ఉదాహరణ. చట్టసభలలో ప్రతిపక్షాల అభిప్రాయాలకు విలువే లేకుండా పోతోంది. ప్రజాస్వామ్యానికి సంబంధించిన ఏ సూచికను చూసినా మన స్థానం అట్టడుగునే కన్పిస్తోంది.

తగ్గుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

- రాష్ట్రం మీదుగా క్రిందిస్థాయిలో గాలులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. చాలా జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల లోపే నమోదవుతున్నాయి. గడిచిన 24 గంటల్లో కొమ్రం భీం అసిఫా జిల్లాలో 10.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రం మీదుగా కిందిస్థాయిలో గాలులు వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. 24 జిల్లాల్లో 15 డిగ్రీల లోపే రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల పాటు కూడా చాలా జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల లోపు నమోదయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలోనే రాత్రిపూట చల్లని గాలులు వీస్తున్నాయి. ఉదయం 9 గంటల దాకా చలి వణికిస్తున్నది. ఇదిలా ఉండగా, జూన్ ఒకటో తేదీ నుంచి డిసెంబర్ పదో తేదీ వరకు రాష్ట్రంలో కురవాల్సిన దానికంటే తక్కువ వర్షపాతం 23 జిల్లాల్లో నమోదైంది. +20 నుంచి +59 శాతం వరకు నమోదైన జిల్లాలు సిద్దిపేట, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, రాజన్నసిరిసిల్ల, మెదక్, జగిత్యాల, వరంగల్ ఉన్నాయి. జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాల్లో కురవాల్సిన దానికంటే -20 శాతం నుంచి -59 శాతం వరకు లోటు వర్షపాతం రికార్డయింది. మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

మధ్యప్రదేశ్ కొత్త సీఎం మోహన్ యాదవ్

(మొదటిపేజీ తరువాయి)

నో అనేసింది. ఆ రాష్ట్ర రాజధాని భోపాల్‌లో సోమవారం జరిగిన శాసనసభా పక్ష సమావేశంలో మధ్యప్రదేశ్ కొత్త సీఎంగా మోహన్ యాదవ్‌ను ఖరారు చేశారు. జగదీశ్ దేవరా, రాజేంద్ర శుక్లా డిప్యూటీ సీఎంలుగా ఎంపికయ్యారు. నరేంద్ర సింగ్ తోమర్‌కు అసెంబ్లీ స్పీకర్ బాధ్యతలు అప్పగించారు.

మధ్యప్రదేశ్‌లో ఉత్కంఠకు తెర

బీజేపీ పాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి ఎవరికి దక్కుతుందనే విషయమై వారంరోజులకుపైగా కొనసాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. శాసనసభా పక్ష సమావేశంలో మోహన్ యాదవ్ పేరుపై ఏకాభిప్రాయం కుదిరింది. మోహన్ యాదవ్ ఉజ్జయిని సౌత్ ఎమ్మెల్యే. మోహన్ యాదవ్ సంఘ్‌కు సన్నిహితుడు. అయితే శాసనసభా పక్ష సమావేశంలో మోహన్ యాదవ్ పేరును శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రతిపాదించినట్టు సమాచారం. కాగా శాసనసభా పక్ష సమావేశం జరుగుతున్న సమయంలో ప్రహ్లాద్ పటేల్, శివరాజ్ సింగ్ చౌహాన్ మద్దతుదారులు పార్టీ కార్యాలయం వెలుపల నినాదాలు చేశారు. అధిష్టానం వ్యూహాత్మకంగా శివరాజ్ సింగ్ చేత సీఎంగా మోహన్ పేరును ప్రకటించేలా చేయటంతో.. సీఎం కుర్చీ ఆటకు తెరపడింది.

ఛత్తీస్‌గఢ్ తరహాలో మధ్యప్రదేశ్‌లో కూడా బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే రాజస్థాన్‌లో సీఎం ఎంపిక అంత ఈజీ కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రేసులో...

ముఖ్యమంత్రి రేసులో సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌తో పాటు జ్యోతిరాదిత్య సింధియా, నరేంద్ర సింగ్ తోమర్, కైలాశ్ విజయవర్గీయ, ప్రహ్లాద్ పటేల్, వీడీ శర్మ పేర్లు వినిపించాయి. అయితే ఈ రేసులో మోహన్ యాదవ్ పేరు ప్రస్తావనలోకి రాలేదు. అంతేకాదు శాసనసభా పక్ష సమావేశానికి ముందు జరిగిన ఫొటో సెషన్‌లో కూడా మోహన్ యాదవ్ వెనుక వరుసలోనే కూర్చున్నారు. కేవలం సంఘ్ సభ్యుడు కావటంతో సీఎం అయ్యారని శివరాజ్ సన్నిహితులు వాపోతున్నారు.

మోహన్ యాదవ్‌కు రూ.45 కోట్ల ఆస్తులు..రూ.9 కోట్ల అప్పులు

ఉజ్జయిని సౌత్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ మోహన్ యాదవ్ బీఎస్సీ, ఎల్ఎల్‌బీ, పీహెచ్‌డీలో పట్టా పొందారు. శివరాజ్ ప్రభుత్వంలో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన ఆస్తుల విలువ రూ.42 కోట్లు ఉంటే.. అప్పు దాదాపు రూ.9 కోట్లుగా చూపారు. అలాగే ఆయన వద్ద రూ.1.41 లక్షల నగదు ఉండగా, ఆయన భార్య వద్ద రూ.3.38 లక్షల నగదు ఉంది. బ్యాంకుల్లో సీఎం మోహన్ , అతని భార్యకు వేర్వేరు బ్యాంకుల్లోని ఖాతాలలో రూ.28,68,044.97 డిపాజిట్లున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన అఫిడవిట్‌లో మోహన్ యాదవ్ ఈ సమాచారాన్ని ప్రస్తావించారు. ఈయన రాష్ట్రంలో అత్యంత ధనిక నాయకుల్లో ఒకరు. మధ్యప్రదేశ్ 2018 అసెంబ్లీ ఎన్నికలకు గరిష్ట ఆస్తులను ప్రకటించిన మధ్యప్రదేశ్ టాప్-3 మంత్రులలో, భూపేంద్ర సింగ్ మొదటి స్థానంలో ఉండగా, మోహన్ రెండో స్థానంలో ఉన్నారు.

షేర్-బాండ్లలో పెద్ద పెట్టుబడి

ఎన్నికల అఫిడవిట్ ప్రకారం.. మోహన్ యాదవ్ తన భార్యతో కలిసి పలు కంపెనీల షేర్లు, డిబెంచర్లు, బాండ్లలో రూ.6,42,71,317 ఇన్వెస్ట్ చేశారు. పొదుపు ఖాతాల్లో డబ్బులు కూడా జమ చేశారు. సమాచారం ప్రకారం బజాజ్ అలయన్స్‌లో ఆయన దాదాపు రూ.3 లక్షల విలువైన పాలసీని కలిగి ఉన్నారు. భార్య పేరు మీద రిలయన్స్ నిప్పన్, బజాజ్ అలియాంజ్‌లో రూ.9 లక్షల కంటే ఎక్కువ విలువైన బీమా పాలసీ ఉంది.

బంగారం..కారు..

ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రకారం...మోహన్ యాదవ్ వద్ద దాదాపు 140 గ్రాముల బంగారం ఉంది. మార్కెట్ విలువ సుమారు రూ.8 లక్షలు. ఆయన భార్య వద్ద 250 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.2 కిలోల వెండి ఉంది. వీటి విలువ సుమారు రూ.15.78 లక్షలు. వీటితో పాటు రూ.22 లక్షల విలువైన ఇన్నోవా కారు, రూ.72 వేల విలువైన సుజుకీ స్కూటర్ ఉన్నాయి. ఆయుధాలను పరిశీలిస్తే.. రూ.80 వేల విలువైన రివాల్వర్, రూ.8 వేల విలువైన 12 బోర్ గన్ కూడా ఉన్నాయి.

కోట్ల విలువైన భూములు

డాక్టర్ మోహన్ యాదవ్ దంపతులకు కోట్ల విలువైన భూమి ఉంది. దాదాపు రూ.15 కోట్ల విలువైన వ్యవసాయ భూమి ఉంది. ఇది కాకుండా ఉజ్జయినిలో మోహన్ యాదవ్ పేరిట సుమారు కోటి రూపాయల విలువైన ప్లాట్ ఉంది. ఆయన భార్య పేరు మీద దాదాపు రూ.6 కోట్ల విలువైన రెండు వ్యవసాయేతర భూములున్నాయి. అలాగే భార్యాభర్తల పేర్లపై రూ.6 కోట్లకుపైగా విలువైన ఇండ్లు, ఫ్లాట్లు ఉన్నాయి.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 58 ఏండ్ల డాక్టర్ మోహన్ యాదవ్ ఉజ్జయిని సౌత్ స్థానం నుంచి బీజేపీ టిక్కెట్‌పై 95,699 ఓట్లతో విజయం సాధించారు. కాంగ్రెస్‌కు చెందిన చేతన్ ప్రేమనారాయణ యాదవ్‌పై 12,941 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు.

ప్రభుత్వ రంగ స్టీల్ సంస్థల్లో భారీగా ఖాళీలు

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగాలను కుదించుకుంటూ వస్తోంది. సోమవారం రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే అడిగిన ప్రశ్నకు కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ప్రభుత్వ రంగ స్టీల్ పరిశ్రమల్లో ఉన్న ఖాళీలు, ఉద్యోగాల కోత వివరాలు స్పష్టమయ్యాయి. మొత్తం ఏడు ప్రభుత్వ రంగ స్టీల్ పరిశ్రమల్లో 11,572 ఖాళీలున్నాయి. ఈ ఖాళీలు ఏడాదికేడు పెరుగుతూ వస్తున్నాయి. అలాగే రెండు ప్రభుత్వ రంగ స్టీల్ సంస్థల్లో 13,983 ఉద్యోగాలు తగ్గాయి.

వైజాగ్ స్టీల్ ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్))లో మొత్తం 19,795 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా అందులో 5,124 ఖాళీలు ఉన్నాయి. అలాగే 2019 ఏప్రిల్ 1లో 2,221 పోస్టులు ఖాళీగా ఉండగా, 2023 ఏప్రిల్ 1 నాటికి ఖాళీలు 5,124కు పెరిగాయి. అలాగే 2019లో 2,221 ఖాళీలు, 2020లో 2,229, 2021లో 3,030, 2022లో 4,099, 2023లో 5,124కు పెరిగాయి.

నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ)లో మొత్తం 5,247 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా అందులో 628 ఖాళీలు ఉన్నాయి. అలాగే 2019 ఏప్రిల్ 1లో 561 పోస్టులు ఖాళీగా ఉండగా, 2023 ఏప్రిల్ 1 నాటికి 628కు పెరిగాయి. కుద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీ లిమిటెడ్ (కెఐఓసీఎల్)లో మొత్తం 2,738 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా అందులో 2,084 ఖాళీలు ఉన్నాయి. అలాగే 2019 ఏప్రిల్ 1లో 1,898 పోస్టులు ఖాళీగా ఉండగా, 2023 ఏప్రిల్ 1 నాటికి 2,084కు పెరిగాయి.

మెకాన్ లిమిటెడ్ కంపెనీలో మొత్తం 1,897 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా, అందులో 838 ఖాళీలు ఉన్నాయి. అలాగే 2019 ఏప్రిల్ 1లో 646 పోస్టులు ఖాళీగా ఉండగా, 2023 ఏప్రిల్ 1 నాటికి 838కు పెరిగాయి.

ఎంఎస్‌టీసీ లిమిటెడ్ కంపెనీలో మొత్తం 484 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా, అందులో184 ఖాళీలున్నాయి. అలాగే 2019 ఏప్రిల్ 1లో 126 పోస్టులు ఖాళీగా ఉండగా, 2023 ఏప్రిల్ 1 నాటికి 184కు పెరిగాయి.

మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఓఐఎల్)లో మొత్తం 6,880 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా, అందులో 1,269 ఖాళీలు ఉన్నాయి. అలాగే 2019 ఏప్రిల్ 1లో 912 పోస్టులు ఖాళీగా ఉండగా, 2023 ఏప్రిల్ 1 నాటికి ఖాళీలు 1,269కు పెరిగాయి. ఎంఓఐఎల్‌లో 2019 ఏప్రిల్ 1 నాటికి 6,960 పోస్టులు ఉండగా 2023 ఏప్రిల్ 1 నాటికి 80 కుదించి, 6,880కి చేరాయి.

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో మొత్తం 60,631 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులుండగా, అందులో 1,445 ఖాళీలు ఉన్నాయి. సెయిల్‌లో 2019 ఏప్రిల్ 1 నాటికి 74,534 పోస్టులు ఉండగా, 2023 ఏప్రిల్ 1 నాటికి 13,903 పోస్టులు కుదించి, 60,631 పోస్టులకు చేర్చారు.

గ్యాస్ సబ్సిడీకి భారీ కోత

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కార్ గ్యాస్ సబ్సిడీకి భారీగా కోత విధించింది. ఐదేండ్లలో రూ.30,244 కోట్లు కోత పెట్టింది. దీంతో దేశంలోని సామాన్య ప్రజలకు ఇది తీవ్ర భారంగా మారింది. రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2018-19లో రూ.37,209 కోట్లుగా ఉన్న గ్యాస్ సబ్సిడీ 2022-23 నాటికి రూ.6,965 కోట్లకు తగ్గింది.

సంవత్సరం	సబ్సిడీ (రూ. కోట్లల్లో)
2018-19	రూ.37,209
2019-20	రూ.24,172
2020-21	రూ.11,896
2021-22	రూ.1,811
2022-23	రూ.6,965

పెట్రోలియం పీఎస్‌యూల్లో ఖాళీలు

పెట్రోలియం మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో 2,920 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలీ అన్నారు. రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ ఎఎ రహీం అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 డిసెంబర్ 5 నాటికి పెట్రోలియం పీఎస్‌యూల్లో 2,920 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

వైద్యానికి సుస్తీ..

(మొదటిపేజీ తరువాయి)

అత్యవసర సేవలందించేందుకు 1,014 మంది కాంట్రాక్టు, 1,582 మంది అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన సేవలందించే వారు ఉన్నారు. మరో నాలుగు వేల పోస్టులు ఖాళీగా ఉండటంతో క్షేత్రస్థాయిలో సేవలు ఏ స్థాయిలో అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికలకు ముందు నిర్వహించిన నర్సుల పరీక్షా ఫలితాలు వెల్లడైతే 757 మంది వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో సేవలందించేందుకు అందుబాటులోకి వస్తారు. పరీక్షలు పూర్తయినప్పటికీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాటి ఫలితాలను నిలిపేసిన సంగతి తెలిసిందే. వాటిని వేగంగా భర్తీ చేస్తే కొంత మేరకు సిబ్బంది కొరత తగ్గే అవకాశముంది.

ఎందుకిలా?

ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చే డిమాండ్లతో ఆస్పత్రులనైతే పెంచారు. ఆస్పత్రుల అప్ గ్రేడేషన్‌కు అనుమతించారు. ఒక వైపు కొత్త ఆస్పత్రుల మంజూరు, పాత ఆస్పత్రుల అప్‌గ్రెడేషన్‌తో బెడ్ల సంఖ్య పెరిగింది. అందుబాటులోకి సేవలొచ్చాయనే ప్రచారంతో వచ్చే రోగుల సంఖ్యా పెరిగింది. ఒక వైపు జిల్లాకో మెడికల్ కాలేజీతో, వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లా ఆస్పత్రులు బోధనాస్పత్రులుగా ఉన్నతీకరించడంతో వైద్య విధాన పరిషత్‌లోని సిబ్బంది డీఎంఈ పరిధి ఆస్పత్రుల్లోనే సేవలందిస్తున్నారు. అదే సమయంలో పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఉన్నతీకరించడంతో ఆ ఆస్పత్రులు వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వచ్చాయి. అదే సమయంలో ఆ ఆస్పత్రులకు తగినంత సిబ్బందిని సమకూర్చడం మాత్రం జరగలేదు. ఉన్నతాధికారులు తాత్కాలికంగా సిబ్బందిని అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు సర్దుబాటు చేస్తూ సేవలకు మరీ విఘాతం కలగకుండా ప్రయత్నిస్తున్నప్పటికీ, సిబ్బంది పూర్తి స్థాయిలో వస్తే తప్ప సామాన్యులకు ప్రభుత్వ వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందే పరిస్థితి లేదు. కొత్త సర్కారు వీటికి పరిష్కారం చూపిస్తుందని ఆశిద్దాం.

అద్దె కట్టలేదని ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే డిస్పెన్సరీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలు చేస్తున్న ఏడుగురు తమకు ఎనిమిది నెలలుగా వేతనాలు కూడా రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ఓ వైపు 2024 టీ20 ప్రపంచకప్ ముంగిట సన్నాహక మ్యాచులు ఐదే మిగిలి ఉండగా.. మరోవైపు వరుణుడు సన్నద్ధతను అడ్డుకుంటున్నాడు. పొట్టి ప్రపంచకప్ బెర్త్‌ల వేటలో భారత్, దక్షిణాఫ్రికా జట్లలో కుర్రాళ్లు పోటీపడుతుండగా బంతి పడకుండా వర్షం ఆటంకం కలిగిస్తోంది. తొలి టీ20 వర్షార్పణం కాగా.. నేడు రెండో టీ20కి సైతం వర్షం ముప్పు పొంచి ఉంది. ఇరు జట్లు ఆటపై ధ్యాస పెట్టినా.. వరుణుడు కరుణిస్తేనే నేడు పోర్ట్ ఎలిజబెత్‌లో పరుగుల వేట!!. భారత్, దక్షిణాఫ్రికా రెండో టీ20 పోరు నేడు.

వరుణుడు ఆడనిస్తాడా?

- రెండో టీ20కి వర్షం ముప్పు
- నేడు భారత్, దక్షిణాఫ్రికా ఢీ

రాత్రి 8.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



నవతెలంగాణ- పోర్ట్ ఎలిజబెత్

డర్బన్ పోరు వర్షార్పణంతో.. ఆతిథ్య దక్షిణాఫ్రికా, పర్యాటక టీమ్ ఇండియా ఇక తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నాయి. మూడు మ్యాచుల సిరీస్ ఇక రెండు మ్యాచ్‌లకు పరిమితం కావటంతో.. నేడు విజయం సాధించిన జట్టు సిరీస్ కోల్పోయే ప్రమాదంలో ఉండదు. ఆ స్వేచ్ఛతో చివరి మ్యాచ్‌లో దుమ్మురేపవచ్చు. దీంతో పోర్ట్ ఎలిజబెత్‌లో విజయమే లక్ష్యంగా ఇరు జట్లు బరిలోకి దిగుతున్నాయి. ప్రపంచకప్ బెర్త్‌లు ఆశిస్తున్న క్రికెటర్లు భయమెరుగని బ్రాండ్ ఆట చూపించేందుకు ఎదురు చూస్తున్నారు. టీ20 సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌కు ఒక్క రోజు విరామమే ఉండటంతో..తప్పిదాలు సరిదిద్దుకునేందుకు ఇరు జట్లకు సమయం లేదు. వ్యూహాత్మకంగా, బౌలింగ్ బృందాలకు ఇది కఠిన సవాల్ విసురుతోంది.

భయమెరుగని బ్రాండ్!

సూర్యకుమార్ సారథ్యంలో టీమ్ ఇండియా కుర్రాళ్లు భయమెరుగని బ్రాండ్ క్రికెట్ ఆడుతున్నారు. స్వదేశంలో ఆసీస్‌తో సిరీస్‌లోనూ ఈ జోరు చూశాం. ఇప్పుడు సఫారీ గడ్డపై సైతం మనోళ్ల వికెట్‌కు పెద్దగా విలువ ఇచ్చే అవకాశం కనిపించటం లేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఈ బ్రాండ్ క్రికెట్‌ను ముందుండి నడిపిస్తుండగా.. చివర్లో రింకూ సింగ్, జితేశ్ శర్మలు మరో స్థాయికి తీసుకెళ్తున్నారు. పవర్‌ప్లేలో యశస్వి ధనాధన్‌తో ప్రత్యర్థి బౌలర్లు మానసికంగా వెనుకంజ వేస్తున్నారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్లకు ఇది గొప్పగా ఉపయోగపడుతోంది. అయితే, యశస్వి పవర్‌ప్లే దాటి ఆడితే జట్టు మరింత లాభపడుతుంది. ఆ దిశగా జైస్వాల్ మరింత దృష్టి సారించాల్సి ఉంది. శుభ్‌మన్ గిల్ రాకతో రుతురాజ్ గైక్వాడ్ బెంచ్‌కు పరిమితం కానున్నాడు. తుది జట్టులో ఒక్క స్పిన్నర్‌కు అవకాశం దక్కితే.. కుల్దీప్ యాదవ్, రవి బిష్ణోయ్ మధ్య పోటీ ఉండనుంది. ఈ ఏడాది రవి బిష్ణోయ్ మెప్పించే మాయ చేస్తున్నాడు. ఆసీస్‌తో సిరీస్‌లో టాప్ వికెట్ టేకర్‌గా నిలిచి ఆకట్టుకున్నాడు. మరోవైపు రీ ఎంట్రీలో కండ్లుచెదిరే మ్యాజిక్ చేస్తున్న కుల్దీప్ యాదవ్‌ను పక్కనపెట్టడం సైతం జట్టు మేనేజ్‌మెంట్‌కు అంత సులువైన నిర్ణయం కాబోదు. దీపక్ చాహర్ అందుబాటులో లేకపోతే అతడి స్థానంలో ముకేశ్ కుమార్ ఆడనున్నాడు. అర్షదీప్ సింగ్ ఆరంభంలో, ఆఖర్లో పరుగుల నియంత్రణ పాటించాలని జట్టు కోరుకుంటుంది. అతడు మరీ ఎక్కువగా పరుగులు సమర్పిస్తున్నాడు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ పేస్ విభాగానికి సారథ్యం వహించనున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా ఫినిషర్ పాత్ర కోసం రింకూ సింగ్, జితేశ్ శర్మ పోటీపడుతున్నారు. ఇద్దరూ భీకర ఫామ్‌లో కనిపిస్తున్నారు. భారత ఇన్నింగ్స్ ద్వితీయార్థంలో రింకూ సింగ్, జితేశ్ శర్మ బ్యాటింగ్‌పై ప్రత్యేక ఫోకస్ ఉండనుంది.



మిల్లర్ మెరిసేనా?

ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున అద్భుతాలు చేసిన ఆటగాడు డెవిడ్ మిల్లర్. చివరి పది ఓవర్లలో మిల్లర్ మెరుపులు అసాధారణం. నేడు 100వ టీ20 మ్యాచ్ ఆడనున్న డెవిడ్ మిల్లర్ నుంచి దక్షిణాఫ్రికా ఆ తరహా ప్రదర్శన ఆశిస్తోంది. డెత్ ఓవర్లలో ఊచకోత కోసే మిల్లర్.. సాధించాల్సిన రన్‌రేట్ 13కు పైగా ఉన్నప్పటికీ ప్రత్యర్థులకు చుక్కలు చూపించిన సందర్భాలు ఉన్నాయి. వందో మ్యాచ్‌లో గుర్తుండిపోయే ఇన్నింగ్స్ ఆడేందుకు మిల్లర్ సిద్ధమవుతున్నాడు. వైట్‌బాల్ ఫార్మాట్‌లో డికాక్ లేకపోవటంతో.. హెండ్రిక్స్ అవకాశాలు దక్కించుకుంటున్నాడు. కానీ సత్తా చాటితేనే జట్టులో నిలుస్తామనే సంగతి అతడికి బాగా తెలుసు. కుర్రాళ్లు చాన్స్ కోసం ఎదురుచూస్తున్న తరుణంలో హెండ్రిక్స్ తనదైన మ్యాజిక్ చేయాల్సి ఉంది. సఫారీ జట్టులో ఎక్కువగా కుర్ర క్రికెటర్లు బరిలోకి దిగుతున్నారు. యువ జట్టుతోనే టీ20 ప్రపంచకప్ వేటకు వెళ్లాలని సఫారీల ఆలోచన. బర్గర్, మార్కో జాన్సెన్, స్టబ్స్, మాథ్యూలు కీలకం కానున్నారు.,

పిచ్, వాతావరణం

పోర్ట్ ఎలిజబెత్‌లో నేడు వర్షం సూచనలు ఉన్నాయి. మ్యాచ్ ముంగిట, మ్యాచ్ సమయానికి సైతం వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. డర్బన్‌లో మ్యాచ్ టైమ్‌లో వర్షం సూచనలు లేకపోయినా.. కుండపోత కనిపించింది. ఇక్కడ మ్యాచ్ టైమ్‌లో వర్షం సూచనలు ఉండటంతో అభిమానుల్లో ఆందోళన కనిపిస్తోంది. ఎస్‌ఏ20 లీగ్‌లో ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో స్వల్ప స్కోర్లు నమోదయ్యాయి. సఫారీలు సైతం ఇక్కడ రెండు టీ20లే ఆడారు. గెలుపోటముల రికార్డు 1-1గా ఉంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), రింకూ సింగ్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, ముకేశ్ కుమార్, రవి బిష్ణోయ్, మహ్మద్ సిరాజ్, అర్షదీప్ సింగ్.

దక్షిణాఫ్రికా : రీజా హెండ్రిక్స్, మాథ్యూ, ఎడెన్ మార్క్‌రామ్ (కెప్టెన్), హెన్రిచ్ క్లాసెన్ (వికెట్ కీపర్), డెవిడ్ మిల్లర్, ఫెరేరా, మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్, జెరాల్డ్, బర్గర్, షంషి.



సంజయ్‌ని తప్పించండి

క్రీడాశాఖ మంత్రికి రెజ్లర్ల వినతి

న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్ష రేసు నుంచి బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ అనుచరుడు సంజయ్ సింగ్‌ను తప్పించాలని అగ్రశేణి రెజ్లర్లు, ఒలింపిక్ పతక విజేతలు సాక్షి మాలిక్, బజరంగ్ పూనియాలు సోమవారం కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను కోరారు. భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా 12 ఏండ్లలో బ్రిజ్‌భూషణ్ ఎన్నో ఆగడాలకు పాల్పడ్డాడని, మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించాడని రెజ్లింగ్ క్రీడాకారులు జంతర్‌మంతర్ వద్ద రెండు దఫాలుగా ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. రెజ్లర్ల నిరసనను విరమింపజేసేందుకు.. బ్రిజ్‌భూషణ్ సింగ్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఎవరూ రానున్న ఎన్నికల్లో పోటీ చేయరనే హామీ క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఇచ్చారు. కానీ డిసెంబర్ 21న ప్రత్యేక సర్వ సభ్య సమావేశంలో జరుగనున్న ఎన్నికల్లో బ్రిజ్ భూషణ్ అత్యంత సన్నిహితుడు సంజయ్ సింగ్ అధ్యక్ష పదవికి పోటీపడుతున్నారు. దీంతో రెజ్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిజ్‌భూషణ్ పదవిలో లేకపోయినా.. అతడి సన్నిహితుల ద్వారా మళ్లీ సమాఖ్యను నడిపిస్తాడని, మల్లయోధుల ఆందోళనకు అర్థమే లేకుండా పోతుందని ఈ సందర్భంగా క్రీడాశాఖ మంత్రితో బజరంగ్, సాక్షి తెలిపారు. సోమవారం క్రీడామంత్రి అనురాగ్ ఠాకూర్‌ను స్టార్ రెజ్లర్లు కలిశారు.

అతడు తప్పుకోకుంటే...

'క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌ను కలిశాం. గతంలో ఇచ్చిన హామీ గుర్తు చేశాం. బ్రిజ్‌భూషణ్ అనుచరులు ఎవరూ ఎన్నికల్లో నిలబడకుండా చూస్తామని మాట ఇచ్చారు. సంజయ్ సింగ్... బ్రిజ్‌భూషణ్‌కు అత్యంత సన్నిహితుడు. అతడు అధ్యక్ష అభ్యర్థిగా తప్పుకోవాలి. లేదంటే, రెజ్లర్ల భవిష్యత్ కార్యాచరణపై పునరాలోచన చేస్తాం. అదే విషయాన్ని క్రీడాశాఖ మంత్రికి తెలిపాం. అధ్యక్ష అభ్యర్థిగా నిలిచిన అనిత షియోరాన్‌పై మాకు అభ్యంతరాలు లేవు. ఆమె మాజీ మల్లయోధురాలు. రెజ్లర్లు దేశానికి మెడల్ తెచ్చేందుకు ఎంత కష్టపడతారనే సంగతి ఆమెకు తెలుసు. మాజీ రెజ్లర్లు ఫెడరేషన్‌లో ఆఫీస్ బేరర్లుగా ఉండాలని కోరుకుంటున్నాం. అనిత కామన్‌వెల్త్ గేమ్స్ మెడలిస్ట్.. రెజ్లర్ల డిమాండ్లను అర్థం చేసుకుంటుంది' అని సాక్షి, బజరంగ్ తెలిపారు.

డిసెంబర్ 21న జరిగే ఎన్నికల్లో రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా సంజయ్ సింగ్ ఎన్నిక లాంఛనమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఓటర్లలో 90 శాతం మంది మద్దతు బ్రిజ్‌భూషణ్ కూడగట్టినట్టు సమాచారం. దీంతో మాజీ రెజ్లర్ అనిత నిలిచినా.. ఆమెకు పెద్దగా అవకాశాలు లేనట్టే. 12 ఏండ్ల అధ్యక్షుడిగా కొనసాగిన బ్రిజ్‌భూషణ్ నేషనల్ స్పోర్ట్స్ కోడ్ ప్రకారం ఈసారి రేసులో నిలువలేదు. అతడి కుమారుడు కరణ్ సింగ్ (ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ సంఘం ఉపాధ్యక్షుడు), అల్లుడు విశాల్ సింగ్ (బిహార్ రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడు)లు సైతం ఎన్నికలకు దూరంగానే ఉన్నారు.

4 వేదికలు, 41 మ్యాచులు

- ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ షెడ్యూల్
- డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి భారత్

దుబాయ్ : ఐసీసీ మెన్స్ అండర్-19 ప్రపంచకప్ షెడ్యూల్ వచ్చేసింది. శ్రీలంక ఆతిథ్యం ఇవ్వాల్సిన ఈ ప్రతిష్టాత్మక టోర్నీ అనూహ్య పరిణామాల నడుమ దక్షిణాఫ్రికా తరలిన సంగతి తెలిసిందే. శ్రీలంక క్రికెట్ బోర్డుపై ఐసీసీ సస్పెన్షన్ వేటు వేయటంతో.. ఆ దేశం ఆతిథ్య హక్కులు కోల్పోయింది. దక్షిణాఫ్రికాలో నాలుగు నగరాల్లో 41 మ్యాచులతో కూడిన ప్రపంచకప్ జరుగనుంది. 2024 జనవరి 19 నుంచి ఫిబ్రవరి 11 వరకు ఈ టోర్నీ జరుగుతుంది. ఈ మేరకు ఐసీసీ సోమవారం అధికారికంగా షెడ్యూల్ విడుదల చేసింది.



ఫార్మాట్ మారింది : అండర్-19 ప్రపంచకప్ ఫార్మాట్‌ను ఐసీసీ మార్పు చేసింది. గతంలో గ్రూప్ దశ తర్వాత నాకౌట్ షురూ అయ్యేది. ఇప్పుడు గ్రూప్ దశ తర్వాత సూపర్ 6 దశను ప్రవేశపెట్టారు. ఆ తర్వాత నాకౌట్ మ్యాచులు ఉంటాయి. తొలుత ప్రకటించినట్టే నాలుగు గ్రూపుల్లో నాలుగేసి జట్లు పోటీపడుతున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ భారత్ సహా బంగ్లాదేశ్, ఐర్లాండ్, అమెరికాలు గ్రూప్-ఏలో ఉన్నాయి. ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, స్కాట్లాండ్‌లు గ్రూప్-బిలో.. ఆస్ట్రేలియా, శ్రీలంక, జింబాబ్వే, నమీబియాలు గ్రూప్-సిలో.. అఫ్గనిస్థాన్, పాకిస్థాన్, న్యూజిలాండ్, నేపాల్‌లు గ్రూప్-డిలో ఉన్నాయి. గ్రూప్ దశ మ్యాచుల అనంతరం ఆరు జట్లు సూపర్6 దశకు చేరుకుంటాయి. సూపర్ సిక్స్‌లో ఆరు జట్లు రెండు గ్రూపులుగా విడిపోతాయి. ఒక్కో గ్రూప్ నుంచి రెండు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఫిబ్రవరి 11న టైటిల్ పోరు జరుగనుండగా, ఆ తర్వాతి రోజును రిజర్వ్ డేగా ఉంచారు. భారత్ తన తొలి మ్యాచ్‌ను జనవరి 20న బంగ్లాదేశ్‌తో ఆడనుంది. ప్రధాన టోర్నీకి ముందు ప్రతి జట్టు రెండు వార్మప్ మ్యాచులు ఆడనుంది. వరల్డ్‌కప్ వార్మప్ మ్యాచులు జనవరి 13-17న షెడ్యూల్ చేశారు.

ట్రావిశ్ హెడ్ పట్టేశాడు

దుబాయ్ : 2023 ప్రపంచకప్ ఫైనల్ హీరో, ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిశ్ హెడ్ ప్రతిష్టాత్మక ఐసీసీ పురస్కారం దక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికాతో సెమీస్‌లో, భారత్‌తో టైటిల్ పోరులో ట్రావిశ్ హెడ్ గెలుపు ఇన్నింగ్స్‌లు నమోదు చేశాడు. సఫారీపై 62, భారత్‌పై 137 పరుగులతో మెప్పించాడు. దీంతో ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ (నవంబర్)గా నిలిచాడు. బంగ్లాదేశ్ స్పిన్నర్ నహిద అక్తర్ మహిళల విభాగంలో నవంబర్ ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా నిలిచింది.



చెస్ చాంప్స్ వీరేశ్, శ్రేయ

జాతీయ చెస్ టోర్నీ



హైదరాబాద్ : 36వ జాతీయ అండర్-13 చెస్ చాంపియన్‌షిప్స్ విజేతలుగా మహారాష్ట్రకు చెందిన వీరేశ్ (బాయ్స్), శ్రేయ్ (గర్ల్స్) నిలిచారు. సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన పోటీల్లో 9.5 పాయింట్లు సాధించిన ఈ ఇద్దరు చాంపియన్‌షిప్ ట్రోఫీలతో పాటు చెరో రూ.80 వేల నగదు బహుమతి సైతం అందుకున్నారు. ఆదర్శ్ ఉప్పల (తెలంగాణ), రాఘవ్ (తమిళనాడు) బాలుర విభాగంలో సిల్వర్, కాంస్యం నెగ్గారు. బాలికల విభాగంలో శన్మతి శ్రీ (తమిళనాడు), కళ్యాణి (కేరళ) 2, 3 స్థానాల్లో నిలిచారు. సిల్వర్ మెడలిస్ట్‌కు రూ.60 వేలు, కాంస్య పతక విజేతకు రూ.48 వేలు ప్రైజ్‌మనీ దక్కింది. ఎస్‌సీఆర్‌ఎస్‌ఏ చెస్ మాజీ కార్యదర్శి ఉమా శంకర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.బి.ఆర్ రాథోర్, తెలంగాణ చెస్ సంఘం అధ్యక్ష, కోశాధికారులు కె.ఎస్ ప్రసాద్, వంశీలు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



సిద్దు, బివిఎస్ఎన్‌ప్రసాద్, బొమ్మరిల్లు భాస్కర్

క్రేజీ కాంబోలో వినోదాత్మక చిత్రం

సిద్దు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. రీసెంట్‌గా ఈ సినిమా పూజా కార్యక్రమాలు కూడా జరిగాయి.

ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్ పై నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి వర్కింగ్ టైటిల్‌గా ఎస్‌విసిసి37 అని ఫిక్స్ చేశారు. సోమవారం ఈ చిత్ర షూటింగ్ ప్రారంభం అవుతుందని ఓ స్ట్రైకింగ్ పోస్టర్‌తో అప్డేట్ ఇచ్చారు. ఈ పోస్టర్‌లో బొమ్మరిల్లు భాస్కర్, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్, హీరో సిద్దు కనిపిస్తున్నారు.

సిద్దు, బొమ్మరిల్లు భాస్కర్ వంటి డిఫరెంట్ కాంబోలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగాయి. వీరిద్దరి కాంబోలో రాబోతోన్న ఈ చిత్రం కచ్చితంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని అంతా భావిస్తున్నారు. ఈ చిత్రం పూర్తిగా వినోదాత్మకంగా ఉంటుందని, త్వరలోనే క్యాస్ట్ అండ్ క్రూ వివరాలను ప్రకటిస్తామని మేకర్లు తెలిపారు.

ప్రేక్షకులు కచ్చితంగా భయపడతారు

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించారు.



యశ్వంత్, శ్రీరామ్, ఖుషీ రవి, సాయికిరణ్ దైదా

ఈ సినిమా ఈనెల 15న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మంగళ వారం ప్రీ-రిలీజ్ ప్రెస్‌మీట్‌ను నిర్వహించారు.

హీరో శ్రీరామ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా ఏంటి అనేది మీకు ఈనెల 15న తెలుస్తుంది. ఈ సినిమాని థియేటర్‌లో చూడటానికి నేను కూడా ఎంతగానో ఎదురుచూస్తున్నాను. ఈ చిత్రం మీకు ఖచ్చితంగా నచ్చుతుంది.' అని తెలిపారు. 'నేను ఎప్పుడూ మంచి నటులు, మంచి దర్శకులు, మంచి నిర్మాణ సంస్థ, మంచి సాంకేతిక నిపుణులతో కలిసి పని చేయాలని కోరుకుంటాను. ఈ సినిమాతో ఆ కోరిక నెరవేరింది. నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు' అని కథానాయిక ఖుషీ రవి చెప్పారు. దర్శకుడు సాయికిరణ్ దైదా మాట్లాడుతూ, "నల్గొండ జిల్లాలో జరిగిన ఒక యదార్థ ఘటనను తీసుకొని, దాని చుట్టూ కల్పిత కథ అల్లుకొని హర్రర్ జోనర్‌లో తీసిన సినిమా ఇది. ప్రేక్షకులు ఖచ్చితంగా ఈ సినిమా చూసి భయపడతారు' అని అన్నారు.

'ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుంది. ఈనెల 15న మా పిండం సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలవుతుంది. ప్రేక్షకులు మా సినిమాను చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను"నిర్మాత యశ్వంత్ దగ్గుమాటి చెప్పారు.

నవచిత్రం

మెస్మరైజ్ చేసే విజువల్ వండర్



వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హిందీలో అరంగేట్రం చేస్తున్న చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. తమ సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్‌లో ఇదొక విజువల్ వండర్‌గా ఉండబోతుందని ప్రామిస్ చేస్తోంది. యదార్థ సంఘటన స్ఫూర్తితో రూపొందుతున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఇండియన్ ఎయిర్ పైలట్‌గా కనిపించనున్నారు. రాడార్ ఆఫీసర్ పాత్రలో మానుషి చిల్లార్ నటిస్తున్నారు. ఇది తెలుగు చిత్ర పరిశ్రమలో ఎయిర్‌ఫోర్స్‌పై వస్తున్న తొలి చిత్రం. సినీ ప్రేక్షకులకు గొప్ప సినిమా అనుభూతిని కల్పిస్తామని నిర్మాతలు ఇటీవల ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు మోషన్ టీజర్‌తో సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ సినిమా వచ్చే ఏడాది ఫిబ్రవరి 16న గ్రాండ్‌గా విడుదల కానుంది. వరుణ్ తేజ్, మానుషి చిల్లర్ అతిపెద్ద వైమానిక దాడుల్లో ఒకదానికి సిద్ధమవుతున్నందున అద్భుతమైన మోషన్ టీజర్ ఆపరేషన్ వాలెంటైన్ ప్రపంచం గురించి ఒక గ్లింప్స్‌గా ప్రజెంట్ చేస్తోంది.

మన వైమానిక దళ వీరుల అసమానమైన ధైర్యసాహసాలని, దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ సినిమా చూపనుంది. ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్ సందీప్ ముద్దా నిర్మించారు. నందకుమార్ అబ్బినేని, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ (వకీల్ ఖాన్) సహ నిర్మాతలు.

యాడ్-ఫిల్మ్ మేకర్, సినిమాటోగ్రాఫర్ వీఎఫ్ఎక్స్ నిపుణుడు శక్తి ప్రతాప్ సింగ్ హడా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శక్తి ప్రతాప్ సింగ్ హడా, అమీర్ ఖాన్, సిద్దార్థ్ రాజ్ కుమార్ రైటర్స్ . ఈ చిత్రం తెలుగు, హిందీ భాషలలో విడుదల కానుంది.

సరదా.. సరదాగా..



వెంకటేష్, సారా, శ్రద్ధా శ్రీనాథ్

వెంకటేష్ నటిస్తున్న తన 75వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం వీవీఐటీ కాలేజీలో విద్యార్థుల సమక్షంలో సినిమాలోని సెకండ్ సింగిల్ 'సరదా.. సరదాగా'ని లాంచ్ చేశారు.

సంతోష్ నారాయణన్ ఈ పాటని మనసుని హత్తుకునే మెలోడీగా స్వరపరిచారు. వెంకటేష్, శ్రద్ధా శ్రీనాథ్ మధ్య సాగే సంభాషణతో పాట ప్రారంభమవుతుంది. ఆమె అతని భార్య కాదు కానీ కుటుంబ సభ్యురాలిగా ఉండాలను కుంటోంది. సారా పోషించిన వెంకీ కుమార్తె పాత్రతో పాటు ఇద్దరి చూడచక్కని ప్రయాణాన్ని ఆకట్టుకుంది.

జ్వరం ఉన్నప్పుడు పాప వెంకటేష్‌ని చూసుకోవడం, తల్లి కాలమ్‌లో శ్రద్ధ సంతకం చేయడం, వెంకీ తన కుమార్తెను ఉత్సాహపరిచేందుకు పాఠశాల వార్షిక వేడుకకు హాజరు కావడం లాంటి సన్నివేశాలతో ఈ పాట అందర్నీ అలరి స్తుంది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం వారి మధ్య బంధాన్ని మరింత అందంగా చూపించింది. అనురాగ్ కులకర్ణి వాయిస్ ఆ పాటకు ప్రత్యేక ఆకర్షణను తీసు కొచ్చింది.

మొదటి పాట మాస్‌కి, యూత్‌కి బాగా కనెక్ట్ అయితే, రెండో సింగిల్ ఫ్యామిలీలకు కనెక్ట్ అవుతుంది అని చిత్ర బృందం తెలిపింది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 13న అన్ని దక్షిణ భారత భాషలు, హిందీలోనూ విడుదల కానుంది.



ప్రజ్వల్ దేవరాజ్

కరావళిలో ఏం జరిగింది?

ప్రజ్వల్ దేవరాజ్ 'కరావళి' సినిమాతో అందరినీ పలకరించబోతున్నారు. 'అంబి నింగే వయసైతో'తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు గురుదత్త గనిగ ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు.

వీకే ఫిల్మ్స్ బ్యానర్‌తో కలిసి గురుదత్త గనిగ ఫిల్మ్స్ బ్యానర్ పై గురుదత్త గనిగ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కరావళి అనే గ్రామంలో కంబాల చుట్టూ ఈ కథ తిరుగు తుంది. ప్రజ్వల్ దేవరాజ్ నటించిన ఈ 40వ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్, ప్రోమోలను సోమవారం విడుదల చేశారు. ఈ ప్రోమో చూస్తుంటే పాన్ ఇండియాకు పర్‌ఫెక్ట్ సబ్జెక్ట్ అన్నట్టుగా కనిపిస్తోంది. తమ భాష, సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, తమ మూలల్లోంచి కథలు తీసుకుని తెరపై ఆవిష్కరించాలని అనుకుంటు న్నామని దర్శక, నిర్మాత గురుదత్త గనిగ తెలిపారు.



సోహెల్, మేఘ లేఖ

హిట్ ఖాయం

'బిగ్‌బాస్' ఫేమ్ సోహెల్ టైటిల్ రోల్‌లో శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్, కథ వేరుంటాది బ్యానర్స్ పై ఎం.డీ పాషా నిర్మిస్తున్న చిత్రం 'బూట్ కట్ బాలరాజు'. మేఘ లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. సోమవారం డైరెక్టర్ అనిల్ రావిపూడి టీజర్‌ని లాంచ్ చేసి, చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు.

హీరో సోహెల్ మాట్లాడుతూ, 'బెక్కం వేణుగోపాల్ టీం ఈ కథని డెవలప్ చేశారు. ఆయన సినిమాల్లో ఉండే ఎంటర్‌టైన్మెంట్ ఈ సినిమాలోనూ ఉంటుంది. భీమ్స్ ఎనర్జిటిక్ పాటలు ఇచ్చారు. అనూప్ మంచి ఆర్ఆర్ చేశారు' అని తెలిపారు. 'అందరూ ఎంజాయ్ చేసే సినిమా ఇది. రాకేశ్, రామ్ ప్రసాద్ మంచి మాటలు రాశారు. మా టెక్నికల్ టీం ఎంత గానో సపోర్ట్ చేశారు' అని దర్శకుడు శ్రీ కోనేటి చెప్పారు.

నిర్మాత పాషా మాట్లాడుతూ, "ఒసేయ్ రాములమ్మ'లో విజయశాంతిని ఎలా చూశారో.. ఇందులో ఇంద్రజని అలా చూస్తారు. నిర్మాతగా నా తొలి చిత్రమిది. ఈ సినిమా తప్పకుండా పెద్దవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు.

యూనివర్సల్ కాన్సెప్ట్..

హీరో వైభవ్ నటించిన తాజా సినిమా 'ఆలంబన'. పార్వతి నాయర్ కథానాయిక. పారి కె విజయ్ దర్శకుడు. కోటపాడి జె రాజేష్ సమర్పణలో కేజేఆర్ స్టూడియోస్, కౌస్తుభ్ ఎంటర్టైన్మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. గంగ ఎంటర్టైన్మెంట్స్ సంస్థ ఈ సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. ఈనెల 15న తెలుగు, తమిళ భాషల్లో సినిమాను విడుదల చేయనున్నారు.

ఈ సందర్భంగా సోమవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. హీరో వైభవ్ మాట్లాడుతూ, 'నాకు చాలా పెద్ద సినిమా ఇది. ఫుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్. డబ్బింగ్ వెర్షన్ చూశా. చాలా బాగా వచ్చింది. పీటర్ మాస్టర్ రెండు బ్రహ్మాండమైన ఫైట్స్ చేశారు. హిప్ హాప్ తమిళ మ్యూజిక్ బావుంటుంది. మంచి సాంగ్స్ ఇచ్చారు. సినిమా మొదలైన 15 నిమిషాల తర్వాత జీనీ క్యారెక్టర్ ఎంటర్ అవుతుంది. ఆ తర్వాత నుంచి చివరి వరకు ఉంటుంది' అని తెలిపారు. 'నా తొలి చిత్రమిది. తమిళంలో పాటు తెలుగులో కూడా విడుదల అవుతుండటం సంతోషంగా ఉంది. జీనీ ఉందని ఇది చిన్న పిల్లల సినిమా అనుకోవద్దు. పెద్దలు కూడా చూసే సినిమా. యూనివర్సల్ కాన్సెప్ట్ తీసుకుని చేసిన సినిమా' అని దర్శకుడు పారి కె విజయ్ చెప్పారు. గంగ ఎంటర్టైన్మెంట్స్ అధినేత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, 'శివ కార్తికేయన్ 'వరుణ్ డాక్టర్' తర్వాత తెలుగులో మేం విడుదల చేస్తున్న చిత్రం ఇది. అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్' అని అన్నారు.



పార్వతి నాయర్, వైభవ్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

షుగర్ మిల్స్‌కు కేంద్రం షాక్

- ఇథనాల్ తయారీ విషయంలో ఆంక్షలు
- చెరకు రసం ఉపయోగించొద్దని ఈనెల 7న ఆదేశాలు
- ఇప్పటికే చక్కెర ఎగుమతులపై నిషేధం



న్యూఢిల్లీ : భారత్‌లో ఇథనాల్ తయారీ విషయంలో మోడీ సర్కారు షుగర్ మిల్లులకు షాకిచ్చింది. చక్కెర ఎగుమతులను నిషేధించిన తర్వాత, దేశీయ లభ్యతను పెంపొందించే దిశగా కేంద్రం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈనెల 7న వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ అన్ని మిల్లులు, డిస్టిలరీలను ఏదైనా ఇథనాల్ తయారీకి చెరకు రసం(సిరప్)ను ఉపయోగించవద్దని ఆదేశించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. అయితే, చెరకు ఉత్పత్తిపై ఆధారపడే షుగర్ మిల్లులపై ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశం కనిపిస్తున్నది.

ఏమిటీ ఇథనాల్?

ఇథనాల్‌ను అధిక స్టార్చ్ కంటెంట్ ఉన్న చెరకు, మొక్కజొన్న, గోధుమ వంటి వాటి నుంచి ఉత్పత్తి చేస్తారు. భారత్‌లో ఇథనాల్‌ను ప్రధానంగా చెరకు మొలాసిస్ నుంచి కిణ్వ ప్రక్రియ ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు. ఇథనాల్‌ను గ్యాసోలిన్‌తో కలిపి వివిధ మిశ్రమాలను తయారు చేయవచ్చు. ఇథనాల్‌లో ఆక్సిజన్ ఉండటంతో ఇంజిన్ పూర్తిగా ఇంధనాన్ని మండించడానికి దోహదపడుతుంది. ఇథనాల్ 99.9 శాతం స్వచ్ఛమైన ఆల్కహాల్. దీనిని పెట్రోల్‌తో కలపవచ్చు(బ్లెండింగ్). ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్(ఈబీపీ) కార్యక్రమం మోడీ ప్రభుత్వ ఒక ముఖ్యమైన కార్యక్రమం. భారత్‌లో పెట్రోల్‌తో ఇథనాల్ కలపటం సగటు 2013-14లో 1.6 శాతం నుంచి 2022-23 నాటికి 11.8 శాతానికి పెరిగింది.

ఇథనాల్ ఉత్పత్తి ఇలా..

ఇథనాల్ సాధారణంగా సి-హెవీ మొలాసిస్ నుంచి తయారు చేయబడుతుంది. మిల్లులు సాధారణంగా 13.5 నుంచి 14 శాతం మొత్తం పులియబెట్టే చక్కెరలతో (టీఎఫ్ఎస్) చెరకును చూర్ణం చేస్తాయి. అందులో 11.5 శాతం చక్కెర రూపంలో రసం నుంచి తిరిగి పొందవచ్చు. స్ఫటికీకరించబడని, తిరిగి పొందలేని 2 నుంచి 2.5 శాతం టీఎఫ్ఎస్.. సీ-హెవీ మొలాసిస్‌లోకి వెళ్తుంది. 40 నుంచి 45 శాతం చక్కెరను కలిగి ఉన్న ఈ ద్రవంలోని ప్రతి టన్ను కిణ్వ ప్రక్రియ, స్వేదనంపై 220-225 లీటర్ల ఇథనాల్‌ను ఇస్తుంది. కానీ, మిల్లులు 11.5 శాతం చక్కెరను తిరిగి పొందే బదులు, కేవలం 9.5-10 శాతాన్ని సంగ్రహించి, మిగిలిన 1.5 నుంచి 2 శాతం టీఎఫ్ఎస్‌ని మునుపటి సీ-హెవీ' స్టేజ్ మొలాసిస్‌కి మళ్లిస్తున్నాయి. ఈ మొలాసిస్, 50 శాతం కంటే ఎక్కువ చక్కెర కలిగి, టన్నుకు 290-320 లీటర్ల ఇథనాల్‌ను ఇస్తుంది.

భారత్‌లో ఇథనాల్ ఉత్పత్తిలో పెరుగుదల ఎక్కువగా 2017-18 తర్వాత జరిగింది. మిల్లులు ఇథనాల్‌ను సీ-హెచ్‌వీ మొలాసిస్, సాంద్రీకృత చెరకు రసం(సిరప్) నుంచి తయారు చేయడం ప్రారంభించాయి. అదనంగా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) స్టాక్‌ల నుంచి మిగులు బియ్యం, విరిగిన, పాడైన ఆహారధాన్యాలు, మొక్కజొన్న ఉపయోగించబడ్డాయి. ధాన్యం నుంచి ఇథనాల్ దిగుబడి ఎక్కువగా ఉంటుంది. ఇది టన్నుకు 380-480 లీటర్లుగా ఉంటుంది.

ఓఎంఎస్‌ల పైనా ఎఫెక్ట్

అయితే డిసెంబరు 7 నాటి ఆదేశంతో పరిశ్రమకు ఎదురుదెబ్బ తగిలింది. ముఖ్యంగా, యూపీలోని షుగర్ మిల్లులు ఈ ప్రభావంతో నష్టపోనున్నాయి. ఇటు ఓఎంసీలు 2023-24 కోసం దాదాపు 825 కోట్ల లీటర్ల ఇథనాల్ సరఫరా కోసం టెండర్‌ను విడుదల చేశాయి. గత నెల ప్రారంభంలో జరిగిన బిడ్‌ల మొదటి ప్రక్రియలో అవి దాదాపు 559 కోట్ల లీటర్లకు ఆఫర్‌లను అందుకున్నాయి. అందులో చెరకు రసం(సిరప్) నుంచి ఉత్పత్తి చేయబడిన ఇథనాల్ 135 కోట్ల లీటర్లు. డిసెంబరు 7 నాటి ఆర్డర్ దీనిపై ఎక్కువ ప్రభావం చూపనున్నది.

చెరకు ఉత్పత్తి తగ్గే అవకాశం

2022-23 చక్కెర సంవత్సరం కేవలం 57 లక్షల టన్నుల (ఎల్‌టీ) కంటే ఎక్కువ నిల్వలతో ముగిసింది. ఇది 2016-17లో 39.4 లీటర్లు కాగా, 2018-19లో ఇది రికార్డుస్థాయిలో 143.3 లీటర్లుగా ఉన్నది. ప్రస్తుత 2023-24 సంవత్సరానికి సైతం ఉత్పత్తిపై అనిశ్చితి ఉన్నది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ ఈ సంవత్సరం ఉత్పత్తిని 291.50 లీటర్లుగా అంచనా వేసింది. 2022-23లో 330.9 లీటర్లు, 2021-22లో 359.25 లీటర్లతో పోల్చుకుంటే తక్కువ కావటం గమనార్హం. మహారాష్ట్ర, కర్నాటకలలో తక్కువ వర్షపాతం కారణంగా చెరకు పండించే ప్రాంతాలలో తక్కువ రిజర్వాయర్ నీటి మట్టాల నేపథ్యంలో క్షీణత నమోదయ్యే అవకాశం కనిపిస్తున్నది.

సీఎం రేవంత్‌కు పీఆర్టీయూటీఎస్ శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బి మోహన్‌రెడ్డి, పూల రవీందర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ పటిష్టం కావాలని తెలిపారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

క్లాట్ ఫలితాల్లో శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమి ప్రభంజనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా నేషనల్ లా విశ్వవిద్యాలయాల్లో ఐదేండ్ల లా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన క్లాట్-2024 ఫలితాల్లో శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్, ఇన్ఫినిటీ లెర్న్ కో ఫౌండర్ సుష్మ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ కేటగిరీల్లో అత్యధికంగా రాష్ట్రస్థాయి, అఖిల భారత స్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో కె వినోత్న మొదటి ర్యాంకు, ఎస్ సాయి రాహుల్ మూడో ర్యాంకు, షేక్ మహమ్మద్ ఆసీఫ్ ఐదో ర్యాంకు, ఎ హర్షవర్ధన సాయి పదో ర్యాంకు, కె స్వరూప్ 11వ ర్యాంకు, డి హర్ష 14వ ర్యాంకు, జి నేహ 18వ ర్యాంకు, ఎం రోహిత్ 25వ ర్యాంకు, బి హేమలత 30వ ర్యాంకు, బి అభిలాష్ 41వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీల్లో 85, 123,470,482,547,864 ర్యాంకులు పొందారని వివరించారు.

రేవంత్ కలిసి టీజీవో నేతలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని టీజీవో అధ్యక్షురాలు వి మమత, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ నేతృత్వంలో సోమవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఉద్యోగులందరూ తోడ్పాటునందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీవో నాయకులు పి రవీందర్‌కుమార్, ఎస్ సహదేవ్, నగర అధ్యక్షులు జి వెంకటేశ్వర్లు, హైదరాబాద్ అధ్యక్షులు ఎంబీ కృష్ణయాదవ్, నాయకులు బి వెంకటయ్య, కృష్ణమూర్తి, సుజాత, సబిత, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ఉత్తర్వులు 1975 ప్రకారమే స్థానికత కావాలి

- ఎల్‌సీజీటీఏ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇందిరాగాంధీ హయాంలో రాష్ట్రపతి ఉత్తర్వులు-1975 ప్రకారం ఇచ్చిన స్థానికతే విద్యార్థులు, నిరుద్యోగులకు కావాలని లోకల్ క్యాడర్ ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం (ఎల్‌సీజీటీఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వులు-2018 ప్రకారం స్థానికతను అమలు చేయొద్దని కోరింది. ఈ మేరకు ఎల్‌సీజీటీఏ అధ్యక్షులు ఎం వీరాచారి, ప్రధాన కార్యదర్శి ఎం లక్ష్మీకాంతరెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2018 ప్రకారం స్థానికత అమలైతే విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్రపతి ఉత్తర్వులు-2018ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ఉత్తర్వులు-1975 ప్రకారం నాలుగు నుంచి పదో తరగతి వరకు నాలుగేండ్లు ఎక్కడ చదివితే ఆ జిల్లాకు స్థానికులుగా పరిగణిస్తారని గుర్తు చేశారు. దానివల్ల విద్యా, ఉద్యోగావకాశాల్లో ఎవరికీ అన్యాయం జరగదని తెలిపారు. కానీ రాష్ట్రపతి ఉత్తర్వులు-2018 ప్రకారమైతే ఒకటి నుంచి ఏడో తరగతి వరకు నాలుగేండ్లు చదివితే ఆ జిల్లా స్థానికులవుతారని వివరించారు. ఒక విద్యార్థి ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు తెలంగాణలో, ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఏపీలో చదివితే రెండు రాష్ట్రాల్లోనూ స్థానికులవుతారని పేర్కొన్నారు. 371-డీ ప్రకారం స్థానికత ఒకచోటే ఉండాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశంపై దృష్టిసారించాలని కోరారు.

దర్యాప్తు సంస్థల బాటలో యూజీసీ, ఎన్సీఈఆర్టీ

- స్వామిభక్తితో పునీతమవుతున్న సంస్థలు
- హిందూ జాతీయతావాద అజెండాతో ముందుకు



న్యూఢిల్లీ : కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రెండు పర్యాయాలు అధికారాన్ని అనుభవించి, ముచ్చటగా మూడోసారి పాలనా పగ్గాలు చేపట్టాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ పది సంవత్సరాల కాలంలో ప్రభుత్వ సంస్థలపై బీజేపీ ప్రభావం, పెత్తనం సుస్పష్టంగా కన్పిస్తోంది. ప్రతిపక్ష పార్టీలే లక్ష్యంగా చర్యలు చేపట్టడంలో ఈడీ, ఐటీ, సీబీఐ అధికారులు తలమునకలై పోయారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ కూడా కొన్ని సందర్భాలలో పక్షపాత వైఖరినే ప్రదర్శిస్తోంది. ఇప్పుడు తామేమీ తక్కువ తినలేదన్నట్లు యూజీసీ, ఎన్సీఈఆర్టీ కూడా స్వామిభక్తిని చాటుకుంటున్నాయి. అధికార పార్టీ రాజకీయ సిద్ధాంతానికి అనుగుణంగా విద్యా వ్యవస్థను, ఆ నిర్మాణాన్ని సమూలంగా మార్చేసే పనిలో ఈ రెండు సంస్థలూ నిమగ్నమయ్యాయి.

విద్యార్థులలో హిందూ జాతీయతావాద భావాలను రేకెత్తించాల్సిందిగా విద్యా సంస్థలకు తరచుగా ఆదేశాలు జారీ అవుతున్నాయి. బీజేపీ ప్రభుత్వం విద్యార్థి ఉద్యమాలను నీరుకార్చేందుకు నిత్యం ప్రయత్నిస్తూనే ఉంది. ఇలాంటి నిరసనలకు జాతి వ్యతిరేక చర్యలుగా ముద్ర వేస్తోంది. ప్రతి విశ్వవిద్యాలయంలోనూ జాతీయ పతాకాన్ని ఎగరేసేందుకు ఓ పొడవైన పోల్‌ను ఏర్పాటు చేయాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మాజీ మంత్రి స్మృతి ఇరానీ ప్రతిపాదించారు. జేఎన్‌యూ ప్రాంగణంలో విద్యార్థులు చర్చా వేదికలు నిర్వహించే ప్రదేశంలో నిరుపయోగంగా ఉన్న సైనిక ట్యాంకును ఉంచాలని మరో ప్రతిపాదన వచ్చింది. ఇది వివిధ అంశాలపై తమ అభిప్రాయాలు చెప్పుకునేందుకు విద్యార్థులకు ఓ వేదిక అనేదే లేకుండా చేయాలన్న ఉద్దేశంతో చేసిన ప్రతిపాదన.

ఇటీవలి కాలంలో అనేక సర్క్యులర్లు జారీ అయ్యాయి. ఏబీవీపీని స్థాపించిన ఆర్ఎస్ఎస్ ప్రచారక్ దత్తాజీ దిదోల్కర్ శత జయంతి ఉత్సవాలలో విద్యార్థులు విధిగా సంవత్సరం పొడవునా పాల్గొనాలన్నది అందులో ఒకటి. భారతీయ జాతీయతావాదం కోసం లేదా బ్రిటీష్ వలస పాలనపై పోరాడిన వారిని గౌరవిస్తే తప్పేమీ లేదు. కానీ దిదోల్కర్ ఎన్నడూ స్వాతంత్రోద్యమంలో పాలుపంచుకోలేదు. స్వతంత్ర భారత రాజ్యాంగంలోని విలువలకు ప్రాతినిధ్యం వహించలేదు. ఇక కొద్ది రోజుల క్రితం జారీ అయిన మరో సర్క్యులర్‌ను చూద్దాం. విద్యా సంస్థలలో ప్రధాని నరేంద్ర మోడీ నేపథ్యంలో ఉండేలా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలట. రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇలాంటి సర్క్యులర్లు జారీ అవుతున్నాయి. ప్రజాస్వామ్య దేశంలో ఈ తరహా వ్యక్తి ఆరాధనా ధోరణులకు తావు లేదు. ఒక పార్టీని, దాని నేతను గురించి ప్రచారం చేయడమే దీని వెనుక ఉన్న ఉద్దేశం. ఇలా చేయడం ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను ఉల్లంఘించడమే అవుతుంది. ఇది అధికార దుర్వినియోగానికి తార్కాణం.

యూజీసీ, ఎన్సీఈఆర్టీ ఇంతటితో ఆగలేదు. 7-12 తరగతుల విద్యార్థులకు చరిత్ర పాఠ్యాంశంలో భాగంగా రామాయణం, మహాభారతం బోధించాలట. ఇవి దేశభక్తిని, ఆత్మ గౌరవాన్ని ప్రేరేపిస్తాయట. ఇక ఇండియా పేరును భారత్‌గా మార్చాలన్న యోచన సరేసరి. ఈ విధంగా యూజీసీ, ఎన్సీఈఆర్టీ సంస్థలు తలాతోకా లేని ఆదేశాలు జారీ చేస్తూ విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నాయి. హిందూ జాతీయతావాద అజెండాతో రాజ్యాంగ విలువలకు పాతరేస్తున్నాయి.

భారత ఆర్మీలో ఫాతిమా వసీం ఘనత

- సియాచిన్ గ్లేసియర్‌పై మొదటి మహిళా మెడికల్ ఆఫీసర్‌గా రికార్డు

న్యూఢిల్లీ : భారత ఆర్మీలో కెప్టెన్ ఫాతిమా వసీం చరిత్ర సృష్టించారు. సియాచిన్ వారియర్స్‌కు చెందిన ఆమె సియాచిన్ గ్లేసియర్‌పై ఆర్మీ మొదటి మహిళా మెడికల్ ఆఫీసర్‌గా రికార్డు నెలకొల్పారు. అత్యంత ఎత్తైన యుద్ధభూమి సియాచిన్ గ్లేసియర్‌పై మోహరించిన భారత సైన్యానికి చెందిన మెడికల్ ఆఫీసర్‌గా ఆమె నిలిచారు.

సియాచిన్ యుద్ధ పాఠశాలలో అత్యంత కఠిన శిక్షణ అనంతరం 15,200 అడుగుల ఎత్తులో ఒక పోస్టులో నియమించినట్టు భారత ఆర్మీ ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఇది ఆమె స్ఫూర్తి, ప్రేరణను తెలియజేస్తుందని వివరించింది. దీనికి సంబంధించిన ఒక వీడియోను సైతం అప్‌లోడ్ చేసింది.

ప్రారంభించారు.. వదిలేశారు..!

- యుద్ధ ప్రాతిపదికన ప్రారంభమైన కులసంఘాల భవనాలు



నవతెలంగాణ-మిర్యాలగూడ

ఆయా కులాల ప్రాతిపదికన యుద్ధప్రాతిపదిన నిర్మించిన భవనాలు వృథాగా ఉన్నాయి. వాటిని ఆగమేఘాల మీద వర్చువల్ పద్ధతిలో అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. కానీ వాటి నిర్వహణ వదిలేశారు. మిర్యాలగూడ పట్టణం ఎన్నెస్పీ క్యాంపు అవరణలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.4.50కోట్లతో ఎస్సీ సామాజిక తరగతికి భారతరత్న బిఆర్.అంబేద్కర్ భవనం, ఎస్టీ సామాజిక సామాజిక తరగతికి సంత్ సేవాలాల్ భవనం, వెనుకబడిన తరగతుల సామాజిక తరగతికి మహాత్మా జ్యోతిరావుపూలే భవనాన్ని నిర్మించారు. నల్లగొండ పర్యటనకు వచ్చిన అప్పటి ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఈ మూడు భవనాలను అక్టోబర్ 8న వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. 9న మిర్యాలగూడ వచ్చి ప్రత్యక్షంగా ప్రారంభిస్తారని బీఆర్ఎస్ నేతలంతా అనుకున్నారు. అదే రోజు ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కేటిఆర్ పర్యటన ఆగిపోయింది. వర్చువల్‌లో ప్రారంభించారు. కానీ, రెండు నెలలుగా నిరుపయోగంగా ఉన్నాయి.

నూతన ప్రభుత్వం ఆయా భవనాలను శాఖాపరంగా నిర్వహిస్తుందా.. ఎలా చేస్తుందనేది స్పష్టత రావాల్సి ఉంది. ఆ భవనాల్లో ఆయా శాఖలకు చెందిన ఏఎస్ డబ్లుఓ, ఏటీడబ్లుఓ, బిసిడబ్లుఓ కార్యాలయాలు ఏర్పాటు చేసి ఆయా సామాజిక తరగతులకు సంబంధించిన సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చేలా అధికారులకు అధికారాలు ఇవ్వాలని నాయకులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బీఆర్ఎస్ శ్రేణుల సన్మానం




నవతెలంగాణ-చేర్యాల

జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందాక సోమవారం మొదటిసారి చేర్యాల పట్టణానికి రావడంతో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూప, వైస్ చైర్మెన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, ఎంపీపీ కరుణాకర్, వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్ రెడ్డి, ఏఎంసీ చైర్మెన్, వైస్ చైర్మెన్ మల్లేశం, పుర్మ వెంకట్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు పెడతల ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జార్ఖండ్ సీఎంకు ఈడీ సమన్లు

- మనీలాండరింగ్ కేసులో



రాంచీ : జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌కు ఈడీ తాజా సమన్లు జారీ చేసింది. ల్యాండ్ స్కామ్‌తో సంబంధమున్న మనీలాండరింగ్ కేసులో దర్యాప్తు సంస్థ ఈ చర్యకు దిగింది. నేడు (మంగళవారం) ఈడీ అధికారులు ఆయనను ప్రశ్నించనున్నారు. ఇక్కడ కార్యాలయం ముందు హాజరు కావాలనీ, మనీలాండరింగ్ కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేయాలని హేమంత్ సోరెన్‌కు తెలిపినట్టు ఈడీ వర్గాలు చెప్పాయి. కాగా, ఈడీ నుంచి ఆయనకు నోటీసులు అందటం ఇది ఆరోసారి కావటం గమనార్హం. గతంలోనూ ఆయనకు ఈడీ నుంచి నోటీసులు అందినప్పటికీ.. దానిని సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లారు. అయితే, ఈడీ చర్యల నుంచి రక్షణ కోరుతూ ఆయన చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం పిటిషన్‌ను తిరస్కరించింది. దీనిపై హైకోర్టుకు వెళ్లాలని సూచించింది. హైకోర్టుకు వెళ్లినప్పటికీ అక్కడా ఆయనకు ఎదురుదెబ్బే తగిలింది. హైకోర్టు సైతం ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చింది. కాగా, ఈ భూకుంభకోణం కేసులో ఈడీ ఇప్పటికే 14 మందిని అరెస్టు చేసింది. ఇందులో రాంచీ డిప్యూటీ కమిషనర్‌గా, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌గా పని చేసిన ఐఏఎస్ అధికారి ఛవ్వీ రంజన్ కూడా ఉన్నారు. మైనింగ్ కేసుతో సంబంధమున్న మనీలాండరింగ్ కేసులో చివరగా గతేడాది నవంబర్‌లో ఈడీ.. హేమంత్

బిజినెస్

రూ.33.61 లక్షల కోట్ల పన్ను వసూళ్లు లక్ష్యం : కేంద్రం



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.33.61 లక్షల కోట్ల పన్ను వసూళ్లు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒక్కరు తెలిపారు. ఇప్పటి వరకు ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో 20 శాతం, పరోక్ష పన్ను వసూళ్లలో 5 శాతం వృద్ధి నమోదయ్యిందన్నారు. ప్రథమార్థంలో మెరుగైన వసూళ్ల జరిగాయన్నారు. 2023-24 బడ్జెట్‌లో రూ.33.61 లక్షల కోట్లు వసూళ్లు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇంతక్రితం ఏడాది రూ.30.54 లక్షల కోట్లతో పోల్చితే 10 శాతం వృద్ధిని నిర్దేశించుకుంది. ఇందులో ప్రత్యక్ష పన్నుల ద్వారా రూ.18.23 లక్షల కోట్లు, పరోక్ష పన్నుల ద్వారా రూ.15.38 లక్షల కోట్లు వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఆపిల్ డిజైన్ హెడ్ రాజీనామా..

వాషింగ్టన్ : ప్రీమియం ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీదారు ఆపిల్ కంపెనీకి కీలక అధికారి గుడ్‌బై చెప్పారు. ఐఫోన్‌లు, ఆపిల్ వాచీల డిజైన్‌ను పర్యవేక్షిస్తున్న యాపిల్ ప్రొడక్ట్ డిజైన్ వైస్ ప్రెసిడెంట్ టాంగ్ టాన్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఇది ఆపిల్ కంపెనీకి పెద్ద దెబ్బనేనని ఆ వర్గాలు పేర్కొన్నట్లు బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఆపిల్ ఉత్పత్తుల ఫీచర్లు, వాటి రూపం, అమరిక తదితర కీలక విషయాలను టాన్ బృందమే నిర్వహిస్తుంది.

వరి రైతులకు నర్చర్.ఫార్మ్ శిక్షణ

nurture.farm

హైదరాబాద్ : అగ్రిటెక్ స్టార్టప్ నర్చర్.ఫార్మ్ రబీ 2023 సంబంధించి సుస్థిర వరి సాగు కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొంది. దీంతో సాగు ఉత్పాదకత పెంచడం ద్వారా రైతులకు సాయం నిలువనున్నట్టు పేర్కొంది. సాగు విధానాల క్రమబద్ధీకరణ, కృత్రిమ మేధనూ ఉపయోగించడం, సాగు నీటి సంరక్షణ సంకేత ద్వారా బియ్యంకు విలువలను జోడించాలని ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని తెలిపింది. వ్యవసాయ పరిశ్రమకు సంబందించిన నిపుణులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ పరిశోధకులు ఈ కార్యక్రమాన్ని పరియవేక్షిస్తారని తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లోని 10వేల ఎకరాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు పేర్కొంది.

రస్నా నుంచి కొత్త ఉత్పత్తులు



హైదరాబాద్ : ప్రముఖ అహార పానియాల సంస్థ రస్నా కొత్తగా రస్నా హిమాలయన్ గులాబ్ షర్బత్, హిమాలయన్ గుల్కండ్, హిమాలయన్ గులాబ్ చైవాన్‌ప్రాష్‌లను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. ఉత్తరాఖండ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో వీటిని ఆవిష్కరించినట్లు పేర్కొంది. ఉత్తరాఖండ్ లోయల నుండి సేకరించిన స్వచ్ఛమైన రోజ్ ఆయిల్, రోజ్ వాటర్ వంటి ముడి పదార్థాలతో ఈ ఉత్పత్తులను తయారు చేసినట్లు పేర్కొంది. దేశంలోని 12 కర్మాగారాలు తయారు చేసి 16 లక్షల ఔట్‌లెట్‌లలో తమ ఉత్పత్తులు లభిస్తాయని రస్నా గ్రూప్ ఛైర్మన్ పిరూజ్ ఖంబట్టా తెలిపారు.

వండర్‌లా 'ఉమెన్' ప్రత్యేక ఆఫర్

హైదరాబాద్ : ప్రముఖ అమ్యూజ్‌మెంట్ పార్క్ చైన్, వండర్‌లా హాలిడేస్ తమ హైదరాబాద్ పార్క్ తాజాగా "వండర్ ఉమెన్" అనే ప్రత్యేకమైన ఆఫర్‌ను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. డిసెంబర్ 6 నుండి ఈ ఆఫర్ అందుబాటులోకి వచ్చిందని ఆ సంస్థ పేర్కొంది. ప్రతి బుధవారం అందుబాటులో ఉండే ఈ ఆఫర్‌లో మహిళలు ప్రత్యేకమైన రెండు టికెట్లు కొనడం ద్వారా మరో ఇద్దరికీ ఉచిత ప్రవేశాలు పొందవచ్చని పేర్కొంది. ఈ ఆఫర్ ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా పొందవచ్చని వండర్‌లా హాలిడేస్ ఎండి అరుణ్ కె. చిట్టిలపిల్లి పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు అధికారం శాశ్వతం కాదు

- కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలి : బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ కు అధికారం శాశ్వతం కాదని మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ తెలిపారు. టీపీసీసీ అధ్యక్షునిగా కూడా కొనసాగుతున్న సీఎం రేవంత్ రెడ్డి తమ కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలని ఆయన సూచిచారు. సోమవారం తెలంగాణ భవన్ లో మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్ ,గువ్వల బాలరాజుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారపక్షం మారినంత మాత్రాన శిలా ఫలకాలు తొలగించడం సబబు కాదని హితవు పలికారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని తెలిపారు. శిలా ఫలకాలు ధ్వంసం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలనీ, వాటి స్థానంలో కొత్తవి వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులు ప్రజల ఆస్తి అని గుర్తుచేశారు. ప్రభుత్వం మంచి చేస్తే అభినందిస్తామనీ, చెడు చేస్తే నిలదీస్తామని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ సమయంలో ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెసుకు ప్రజలిచ్చిన తీర్పును మర్చిపోవద్దని సూచించారు. ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

టీఆర్టీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కటకం రమేష్, అశోక్‌కుమార్




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కటకం రమేష్, కావలి అశోక్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో సోమవారం 48 మందితో నూతన కమిటీని ప్రతినిధులు ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షులుగా మానేటి ప్రతాపరెడ్డి, చీఫ్ ప్యాట్రన్‌గా లక్కిరెడి సంజీవరెడ్డి, ఉభయ తెలుగు రాష్ట్రాల కో కన్వీనర్‌గా విష్ణు మూర్తిలను ఎన్నుకున్నారు. అనంతరం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దుకు వెంటనే కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలనీ, ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలనీ, మొదటి తేదీనే వేతనాలు చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.